
సాహిత్య

# ప్రస్థానం

ఏప్రిల్ 2015

వెల రూ. 10/-



సాహితీస్రవంతి

విశాఖ తీరం ఉల్లాసహోరం...

వినోద విజ్ఞానాల మేలు కలయిక...

# VIZAG Fest 2015

* పుస్తక ప్రదర్శన * చిత్రకళా ప్రదర్శనలు

కళాసాంస్కృతిక కార్యక్రమాలు * సాహితీ సమాలోచనలు

**2015, ఏప్రిల్ 10 నుండి 19 వరకు,**

**ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్, మద్దిలపాలెం, విశాఖపట్నం**

సాహిత్య ప్రస్థానం
ఏప్రిల్ 2015
సంపుటి : 14 సంచిక : 4

# భావ ప్రకటనా స్వేచ్ఛ

ఐటి చట్టంలో జొప్పించిన సెక్షన్66(ఎ)ను కొట్టి వేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశమంతా హర్షించింది. ఈ చట్టం చేసిన గత పాలకులూ, దాన్ని దుర్వినియోగపర్చిన వారు, కేసు నడుస్తున్నా వ్యతిరేకించని ప్రస్తుత నేతలూ అందరూ ఆహ్వానించారు. అంటే అప్రజాస్వామికమైన 66(ఎ) ఈ దేశంలో చెల్లుబాటు కాదని గుర్తించారన్న మాట. సోషల్ మీడియాలో ఏవైనా అభ్యంతరకరమైన అవాంఛనీయమైన అంశాలు వుంచితే మూడేళ్ల వరకూ శిక్షించవచ్చుననేది ఈ సెక్షన్ల సారాంశం. ఏది అభ్యంతర కరం అన్నది ఎవరు ఎలా నిర్ణయిస్తారు? తమకు తామే ఎలా అరెస్టులు చేస్తారన్నది ప్రాథమిక ప్రశ్న. సాంకేతికాభివృద్ధి వల్ల లభించిన అద్భుతమైన అంతర్జాతీయ సమాచార వాహిక ఇంటర్‌నెట్. దాని ఆధారంగా నడిచే సోషల్ మీడియా. మొత్తంపైన అదుపాజ్ఞలు ఎవరివైనా రోజువారిగా తమ భావాలు కూడా దాని ద్వారా ప్రచారం చేసుకోవడానికి ప్రతివారికి అవకాశం కలిగించడం దీని ప్రత్యేకత. రాజకీయ సామాజికాంశాలే గాక సాహిత్యం కళలు అభిమానించేవారికి కూడా అదో వారధిగా బోధినిగా ఉపకరిస్తున్నది. కొన్ని సైట్లలోనో ఫేస్‌బుక్ పోస్టింగ్సులోనో అశ్లీలతో లేక టెర్రరిజమో వస్తుందనుకుంటే అది ముందూ వుంది. వాటిని అరికట్టడానికి అనేక చట్టాలూ వున్నాయి. 66(ఎ) ఇంతవరకూ ప్రయోగించింది అమాయకుల మీద, తద్వారా వారి భావ ప్రకటన మీద. ఆ మాటకొస్తే నరేంద్ర మోడీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియాను ఎంత విస్తారంగా ఉపయోగించుకున్నారో అందరికీ తెలుసు. ప్రతిపక్షంలో వుండి 66(ఎ)ను విమర్శించిన ఆయన ప్రధాని అయ్యాక దాన్ని రద్దు చేయించే దిశలో వ్యవహరించలేదు. పైగా దేశంలో హిందూత్వ మతతత్వ భావజాలంతో ఏకీభవించని రచయితలపైన, దర్శకుల పైన, చిత్రాలపైన అన్నిటిపైనా దాడులూ నిషేదాలు చూశాం. ఉత్తర ప్రదేశ్‌లో ఎస్‌పి ప్రభుత్వం, బెంగాల్‌లో మమత ప్రభుత్వం కూడా తమకు భిన్నంగా రాసిన వారిపై ఇదే ప్రయోగించాయి. అధికారంలో వున్నవారికి అనుకూలంగా తప్ప ప్రతికూలంగా దీన్ని ఉపయోగించరాదన్నది ఇక్కడ ఉద్దేశం. దేశంలో ఫ్రీ సాఫ్ట్‌వేర్ నెట్‌వర్క్ వంటి సంఘాలూ, మీడియా సంస్థలూ, రాజకీయ పక్షాలూ వ్యతిరేకిస్తూ వచ్చిన ఈ సెక్షన్‌ను కొట్టివేయడం సంతోషదాయకం. భావ ప్రకటనా స్వేచ్ఛను విస్తరించుకోవాలే తప్ప కత్తిరించే ఎలాటిచర్యలూ అనుమతించదగినవి కావు. ఇదే కోణంలో నచ్చని భావాలపై దాడి చేసే వారు కళ్లు తెరవడానికి కూడా ఈ తీర్పు ఉపయోగపడాలి.

బొమ్మలు : తుంబలి శివాజి, జె.వెంకటేష్, భాస్కర్

## ఈ సంచికలో ...

కవిత ........ 4
పెట్టుడు రెక్కలు (కథ) ........ 5
కవిత ........ 7
మహాకవి నిర్యాణం... ........ 8
రెండు జ్ఞాపకాలు – పరిశీలన ........ 15
కవిత ........ 17
కలాలకు సంకెళ్ళు...... ........ 18
ఒక రైతు ప్రార్థన (కథ) ........ 20
కవిత ........ 24
నిశ్చయముగ... నిర్భయముగ........ 25
కవిత ........ 30
కన్నపేగు (కథ)........ 31
కవిత ........ 33
రాయలసీమ తొలికథ........ 34
కవిత ........ 39
చిన్న కథ........ 40
జనజీవనరాగంలో.. కన్నెగంటి పాటలు........ 41
కథలు విందాం రండి!........ 43
స్వీకారం ........ 45
డైరీ ........ 48

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వీరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె.లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్ - 500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# చూపులు చూపులే

- డా॥ సి. నారాయణ రెడ్డి



చూపులను పైపైకి ప్రసరిస్తే
ఎన్నెన్నో ఎత్తులు
కళ్ళలోనికి దిగొస్తాయి
ఆ చూపులనే లోలోనికి దింపితే
అజ్ఞాతంగా వున్న లోతులేవో
కళ్లముందు నిలుస్తాయి
ప్రసరించే చూపుల్లో పసవుంటే
ఎత్తులు తలలు వాల్చి
లోతులు రొమ్ములు సాచి
తమ మౌలిక రూపాలను ఆవిష్కరిస్తాయి
పరస్పర విభిన్నాకృతులను
ఏకాకృతిలో ప్రదర్శించే
అసాధారణ దర్శకత్వ శక్తి
చూపులకుంది
పాతుకుని వున్న కొండలైనా
చూపులదారాలతో పట్టి
బలంగా లాగితే
అవి తమ వేళ్లను పెకిలించుకుని
పైకి లేస్తాయి
పడగెత్తిన కడలి కెరటాలైనా
చూపుల వలలు విసిరితే
చేపల్లాగా విధేయతను ప్రకటిస్తాయి
కళ్లు మూసుకున్నా
జాగృత చైతన్యమున్న చూపులు
అదృశ్య జగత్తులోని
దృశ్య రహస్యాలను
ప్రత్యక్షంగా నిలుపగలుగుతాయి
పై చూపులు లోచూపుల మేళనం
విజ్ఞానం వివేకం
సమన్వయాత్మకంగా చేసుకునే
కరచాలనం

---

## మార్చి నెల పురస్కారాలు



**తప్పటడుగుల బాల్యం**
కథకు: రూ.700/-
రచయిత : **వి.శాంతిప్రబోధ**

**డ్రెస్‌కోడ్**
కవితకు : రూ .500/-
రచయిత :**దారల విజయకుమారి**



సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి



వ్యాసం : **తెలుగు రచయిత్రి తొలి సాంఘిక నవల-లలిత** రచయిత : **డా॥ పొదిలి నాగరాజు**

ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం రూ.500/- అందజేయబడుతుంది

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని
ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. **- ఎడిటర్**

కథ



- జంధ్యాల రఘుబాబు
9849753298

# పెట్టుడు రెక్కలు

డియర్ చిన్నాన్నా,

ఎలా ఉన్నావు. పిన్ని బాగుందా? విదేశాల్లో ఉన్న పిల్లలు ఎలా ఉన్నారు?

ఈ అత్యాధునిక యుగంలో ఉత్తరమేమిటని ఆశ్చర్యపోతున్నావా? కొన్ని విషయాలకు ఫోనుగానీ, దగ్గరకొచ్చి చెప్పటం కానీ, ఈ మెయిల్ పంపటంగానీ సరిపోవు. చెప్పదలచుకున్నది సూటిగా చెప్పటానికి ఈ ఉత్తరమే కావాలి మనిషికి. అది ఇంకా అంతరించిపోలేదనే రాస్తున్నాను.


ఇంకో పదేళ్ళకి నా సర్వీసు ముగుస్తుంది. బ్యాంకులో గుమాస్తాగానే రిటైర్ అయిఉండేవాణ్ణి కాని ఇంట్లో వాళ్ళ పోరు, వారిపై చుట్టుపక్కలా, బంధువుల్లో పోరూ పడలేక ఓ ప్రమోషను తీసుకొని, ఎలాగో కష్టపడి మళ్ళీ మన ఊరు చేరుకున్నాను. ఇంట్లోవాళ్ళు, సమాజంకోసమని నేను తీసుకున్న ప్రమోషను నాకు బీపీ, సుగర్‌లని తెచ్చిపెట్టిందనుకుంటున్నాను. అది వేరే సంగతి. మనిషి తనకోసమే కాకుండా ఇంట్లోవాళ్ళకోసం, మనల్ని గమనిస్తున్న సమాజం కోసం కొన్ని పనులు చేస్తాడు. తనకిష్టం లేకున్నా మనిషి ఇలా ఎందుకు చేయవలసి వస్తుంది అని ఆలోచించటానికి కూడా అతనికి సమయం చిక్కటంలేదు. ఈ వ్యాపార ప్రపంచంలో అది ఇంకా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మనకోసం మనం బతికే కాలం ఎప్పుడో పోయినట్టు నాకనిపిస్తుంది. “ఏం గురూ ప్రమోషన్ తీసుకోలేదా?” అని అడిగేవాళ్ళే కాని “హాయిగా ఉన్నావా లేదా?” అని అడిగేవారు పూర్తిగా కరువైపోయారు. అలాంటివారికోసం మన ఇంట్లోవాళ్ళు, వారికోసం మనమూ బతికేస్తున్నాము. మనకేం కావాలో మనం ఇచ్చుకోలేకుండా ఉన్నాము.

సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం, నీవు నా ప్రస్తుత వయస్సులో ఉన్నప్పుడు జరిగిన కొన్ని విషయాలు గుర్తొస్తున్నాయి. సహాయం చేసిన వాళ్ళు ఎప్పుడూ అది గుర్తు చేయరాదని చెబుతారు. కానీ తప్పటం లేదు. అప్పుడు అనుకోకుండా జరిగిన సంఘటనలు నిన్ను నిర్వీర్యం చేసే సమయంలో అన్నయ్య, నేను కలిసి నీ జీవితమనే బండిని బురదలో ఇరుక్కుపోకుండా చేయటమే కాదు, తరువాత రథంలా దూసుకుపోవటానికి కారణమయ్యాయని నీకూ తెలుసు. ఇప్పుడేదో అవన్నీ గుర్తు చేసి గొప్పలు చెప్పుకోవలసిన అవసరంగానీ, అగత్యం కానీ నాకు లేవు. నేను ఈ ఉత్తరం రాస్తున్న సంగతి అన్నకి కూడా తెలియదు. తెలిసేది మనిద్దరికే. చదివిన వెంటనే దాన్ని చించేయి.

మరి ఈ ప్రహసనమంతా ఎందుకు అని నువ్వు ప్రశ్నించవచ్చు. ఎందుకంటే గత రెండేళ్ళుగా పెట్టుడు రెక్కలతో గాలిలో తేలుతున్నట్టు, ఈ నేలమీద ఉండే వారు కంటికి కనిపించనంతగా నీ ప్రవర్తన, మాటలు మారిపోయాయని నువ్వెంతకు నువ్వు గ్రహించలేక పోతున్నందుకే. కోడి

ఆకాశంలో ఎగిరినా దాని కోడి అంటారే కాని గద్ద అనరు.

నీ కొడుకులిద్దరూ విదేశాల్లో పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. వారి భార్యలూ సంపాదించేవారే. మంచిది. దీనికి నువ్వెంత ఆనందిస్తున్నావో అంతకు రెట్టింపుగా మేము సంతోషపడుతుంటాం. వాళ్ళు మాకూ తమ్ముళ్ళే కదా. వారు పైకి రావటానికి నువ్వెంత కారణమో మేమూ అంతేనన్న సంగతి నీకు, వాళ్ళకు తెలుసు. బంధువులకూ తెలుసు. అయినా ఆ విషయం అంత పెద్దదని మేమెప్పుడూ మురిసిపోలేదు. మాగురించి ఎవరితోనూ చెప్పుకోలేదు. నీవు చెప్పావో లేదో మాకు తెలియదు, తెలుసుకునే అవసరంకూడాలేదు.



వారు చూపించే ఆప్యాయత వారు మాకిస్తున్న బహుమతుల్లో వేమెప్పుడూ చూడలేదు. వారు అప్పుడప్పుడూ మమ్మల్ని పలకరిస్తే చాలు. అదే మాకు ఆనందం.

“ఇవేం ఉద్యోగాలురా, ఒక్క విదేశీ యాత్ర లేదు. వాళ్ళు చూడు ఈగల్లాగా ఎగిరి ప్రపంచాన్ని చుట్టేస్తున్నారు. దేనికైనా అదృష్టం ఉండాలేమో!” అన్న నీ మాటలు ఇంకా నా చెవిలో ఇప్పుడే చెప్పినట్టు ఉన్నాయి. అలా నువ్వన్నప్పుడే సమాధానం ఇచ్చుండేవాడినే. కాని నువ్వే అలాంటి మాటలు మానేస్తావేమోనని ఎదురు చూశాను. పరోక్షంగా ఇతర విషయాలతో కలిపి నీకు అర్థమయ్యేలా కొన్నిసారు మాట్లాడినా కానీ నువ్వు ఆ విషయంపై దృష్టి పెట్టినట్టులేదు. నీ మాటలు మా తరాన్ని బాధపెడతాయన్న కనీస స్పృహ నీకు ఉండదని నేననుకోవటం లేదు. నేను ఒక్క ఉదాహరణ మాత్రమే రాస్తున్నాను. అలాంటి సూటిపోటి మాటలు ఇంకా ఎన్నో అన్నావు. మానవ సంబంధాల గురించిన కనీస పరిజ్ఞానం నీకు ఈ వయసుకు కూడా రాకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటుంది. నీవరకు నీకు మోపెడ్ నడపటం కూడా రాదన్న విషయం ఓ లోపంగా నీకు ఏనాడూ కనపడదు. బంధువుల్లో కొందరితో నీవు ఎంత ఎకసెక్కెంగా మాట్లాడేదీ అందరూ గమనిస్తూనే ఉంటారు.

నీకు తెలుసు నీవు చేసిన ఉద్యోగం ఎలాంటిదో. అలాగే మాదీనూ. మేము చదివినప్పుడు ఈ బీటెక్కులూ, ఎంసీయేలు లేనే లేవు. ఎలాగోలా డిగ్రీ పూర్తిచేసుకొని బ్యాంకులోనో, రైల్వేలోనో ఉద్యోగం సంపాదించటం కష్టమైనా సాధించుకున్నాం. ఆనందంగా, తృప్తిగా బతుకుతున్నాం. కానీ నీలాంటి వాళ్ళు తమ మాటలతో మమ్మల్ని తక్కువ చేసినంత మాత్రాన కుంగిపోయేంత పిరికివాళ్ళం కాదు. మా జీవితాలకు ఏం కావాలో మాకు బాగా తెలుసు. ఎవ్వరో నేర్పక్కరలేదు. ఇంకెవరో వచ్చి చెబితే నేర్చుకునే స్థితిలో లేము. మేము చేస్తున్నది తక్కువైనదని మేము అనుకోము, మమ్మల్ని మేము కించపరచుకోము. మాకుండాల్సిన వ్యక్తిత్వం మాకుంది. దాన్ని ఎవ్వరూ తక్కువ చేయలేరు.

ల్యాప్‌టాపులో ఇంట్లో కూడా ఆఫీసుపని చేయటం, సెల్లులో, టాబ్లెట్లో ఏదో ఒక సమాచారం పంపటం లాంటివి చూసి అబ్బో అనుకోవచ్చు. అవి ఎవరైనా చేయొచ్చు, నీతో సహా. ఉదయం లేచినదగ్గరనుండి ఆఫీసే జీవితమనుకొనే నీలాంటివారికి అవి ఇంకా నచ్చి ఉండవచ్చు. సామాజిక సేవ చేసే ఎందరో ఇవన్నీ వాడటం నీ కళ్ళకు కనిపించినా అది వారి పైత్యంగా అనుకునే నీకు దాన్ని ఇంకోవిధంగా బేరీజు వేసుకుని ఉండవచ్చు. నీ మేధోవికాసానికి నువ్వంతకు నువ్వే మురిసిపోయి ఉండవచ్చు. ఆ సేవల్ని నీ మనసు అంగీకరించి ఉండకపోవచ్చు.

అయినా నీవనుకుంటున్నట్టు అంతంత పెద్ద ప్యాకేజీలు గడిస్తున్న ఈ తరంవాళ్ళు జీవితాన్ని సరిగా అనుభవించలేకపోతున్నామని మాతో చెప్పినప్పుడంతా మేము వారిని ఓదారుస్తుంటాము. ఈ వయస్సులోనే మీరు పైకి ఎదగాలని వారిని బలపరుస్తుంటాము. ఇంటినీ కాస్త చూసుకొమ్మని చెబుతుంటాము. ఈ టెన్షన్ ఉద్యోగాలు ఎంతో కాలం చేయలేమనీ, హాయిగా ఏ గవర్నమెంటు, ఇన్సూరెన్సు, బ్యాంకు ఉద్యోగమో చేసుకుని జీవితాన్ని దగ్గరనుండి చూడాలని ఎంతోమంది మాతో అంటూనే ఉంటారు. నెలకు ఏ ఇరవైవేలో ఖర్చు చేసి మంచి బ్రాండు దుస్తులేసుకుంటున్నామే కాని అవి మాకు ఆనందాన్ని ఇవ్వటంలేదని వాళ్ళు వాపోతున్నారు.

నీలాంటి వాళ్ళు చదువులైతే నేర్పిస్తున్నారు కాని జీవితంలో ఎలాగుండాలో నేరుపుతున్నారా? ఈ ప్రశ్నకు సమాధానం నీ రెండవ కొడుకు సంసారాన్ని చూసిన ప్రతిఒక్కరూ చెబుతారు. ఇటు నీలాంటి తలితండ్రులు చెప్పక, కాలేజీల్లోనూ చెప్పక, సమాజమూ నేర్పించక ఈ తరాన్ని ఏం చేద్దమనుకుంటున్నారు మీరంతా? వెనక్కెళ్ళి ఏమీ చేయలేరు, ఇకనుండయినా మీ భ్రమలనుండి బయటపడి జీవితంలోని సుఖ సంతోషాల్ని ఆస్వాదించండి. మనుషులకు విలువల్ని నేర్పించండి. ఇదే మీకందరికీ నా సలహా.

సెలవు, ఉత్తరం పూర్తి చేసిన రాఘవ దాన్ని ఓ కవరులో పెట్టి మూసేశాడు. మనసు ప్రశాంతంగా అనిపించింది భారం తొలగినందుకు. దాన్ని పోస్టు చేశాడో లేదో తనకు తన బాబాయ్‌కి మాత్రమే తెలుసు.

## కవిత

# కర్తవ్యం

- ముర్తుజా. ఎస్
9985543523

తమ గీతం మారి
తల రాత మారి
వెతలు తీరి
బ్రతుకులు బాగవుతాయని
ఏళ్ళుగా ముడివడ్డ ముళ్ళన్నీ విడివడతాయని
గూళ్ళు నీళ్ళు కనీస వసతులన్నా ఒనకూడుతాయని
కన్నీళ్ళ జీవితాలలో వసంతాలు విరబూస్తాయని
ఆశగా చూస్తుంటే తిరకాసులా!
కుక్క తోక వంకర తీరదా!
పుట్టిల్లో బుద్ధి పుల్లల దాకా పోదా!
ఎందుకీ వ్యర్థ ప్రసంగాలు వివాదాల సుళ్ళు?
రొచ్చు రాజకీయాల కుచ్చుటోపీలు?
ఎవరి నెత్తికి చుట్టాలి రోకళ్ళు?
పనికట్టుక బడికి తెస్తారా
మధ్య యుగాల పడికట్టు పోకళ్ళు!



హిత భాష
మిత భాష
జనప్రియత్వం
రాముని తత్వం
రావణులై శాంతి సీతను అపహరిస్తారా?
పిచ్చిగీతలు
పిల్లికూతలు కాదు
అవినీతి అక్రమాలు,
బుసకొట్టే దౌర్జన్యాలకు
మసకేసే బడుగుల బ్రతుకులు
సమాజంలో సమస్యలు ఎన్నో ఎన్నెన్నో
దృష్టి సారించండటు
అమావాస్య చీకట్లపై వెయ్యండి వేటు
అదే గీత ఖురాన్ బైబిల్ అన్నింటి రూటు

---

# ఆలకించని ఆలాపం

- కొలనుపాక మురళీధరరావు
9247159203


తొలి సంధ్యలో
మల్లెలు పూయించిన జీవితం
ఆలి మమతానురాగం
పిల్లాపాపలతో ఆనందం
తేలిపోయె యవ్వనం
కాలం మార్పులో
తలపై పులితకేశాలు
ఏళ్ళు ఒక్కొక్కటి సడలి
కళ్ళజోడు ముక్కుపై కొత్త అందం
గాలానికి చిక్కుకున్న మేను
గిలగిలలాడుతూంటే
మలిసంధ్యలో అడుగుపెడుతున్నావని
కాలము హెచ్చరిస్తుంది
అనారోగ్యంతో మంచానపడితే
తనువు ఏమైపోతుందోనని
అనుక్షణం బతుకు భయం
కనుమరుగైన పేగుబంధం
కనుచూపులో లేని
కన్నవారు అనురాగంతో
సెలవు, దొరకలేదనో



టిక్కట్లు కూడా లభించలేదనో
సారీ మమ్మీ, డాడీ అంటూ
మరుగవుతున్న మరుల మాటలు
దరి చేరని తనవాళ్ళకోసం
నిరీక్షణలతో క్షణం
ఆపాదించేవాళ్ళు లేక
పలుకరించే వాళ్ళు లేక
ఏ ఆపన్న హస్తం కోసమో
ఎవరో వస్తారని, ఏదో చేస్తారని
ఎదురు చూసి చూసి కడకు
వృద్ధాశ్రమాల ఒడిలో చేరి
సేద తీర్చుకుంటూ
తన కర్మకు తనను తానే నిందించుకుంటూ
అలసితినీ, సొలసితినీ
ఒక్కరూ ఏ ఒక్కరు ఆలకించని
ఆలపించే చరమగీతాలు

శత వర్ధంతి ప్రత్యేకం

# మహాకవి నిర్యాణం



*ఆయన తల్లి గర్భం నుంచి ఏడో నెలలోనే బయటి ప్రపంచంలోకి వచ్చేశారు. శరీరావయవాలు భౌతికంగా పొందవలసిన ధారుడ్యం పొందక పోవడం వల్ల బ్రతికినంతకాలం అనారోగ్యంతోనే బ్రతికారు. ఆయన శరీరం 30 పౌన్ల బరువయితే ఒక్క మేథ మాత్రం మరో ముప్పై పౌన్లు ఉండేదనుకోవచ్చు. ఏక సంథాగ్రాహిగా చదివినవీ, తెలుసుకున్నవీ మర్చిపోవడమంటూ లేకుండా మనసులో ఆలోచనా ప్రేరకమై నిలిచేవి.*

**- డా॥ సోమసుందర్ ఆవంత్స**
**9347848905**

మహాకవి గురజాడ వెంకటప్పారావు జననమే విచిత్రమైనది. మహాపురుషుల అవతరణవలే, అసామాన్యమై ఆశ్చర్యం కలిగించేది. ఆయన తల్లి గర్భం నుంచి ఏడో నెలలోనే బయటి ప్రపంచంలోకి వచ్చేశారు. శరీరావయవాలు భౌతికంగా పొందవలసిన ధారుడ్యం పొందక పోవడం వల్ల బ్రతికినంతకాలం అనారోగ్యంతోనే బ్రతికారు. ఆయన శరీరం 30 పౌన్ల బరువయితే ఒక్క మేథ మాత్రం మరో ముప్పై పౌన్లు ఉండేదనుకోవచ్చు. ఏక సంథాగ్రాహిగా చదివినవీ, తెలుసుకున్నవీ మర్చిపోవడమంటూ లేకుండా మనసులో ఆలోచనా ప్రేరకమై నిలిచేవి.

ఆ మేథతోనే బి.ఏ పాసయ్యారు. బి.ఏ విద్యార్థులకు పాఠం చెప్పారు. ఇంగ్లీషులో కవిత్వం రాశారు. తెలుగులో ఆధునికత్వానికి ఆది స్వరూపాలు సంతరించారు. మహత్తరమైన సాంఘిక నాటకాన్ని కన్యాశుల్కాన్ని రచించారు! పాలు త్రాగే పసికూనలను వృద్ధులకిచ్చి వివాహం చేసే భయంకర సాంఘిక దురాచారాన్ని ఖండిస్తూ వీరేశలింగం గారు ఉద్యమాన్ని చేపట్టారు. సాహిత్యాన్ని సృజించారు. కాని, దానికి రసయోగం సిద్ధించలేదు. ఆలోటు భర్తీ చేయడానికే గురజాడ కన్యాశుల్కం రచించారు. హైందవ సమాజంలో అస్పృశ్యత అనే జాడ్యాన్ని రూపు మాపదల్చి ప్రథమ బీజాలు జల్లారు. హృద్యమైన గేయకావ్యంగా "లవణరాజు కల" మలిచారు. బాలవృద్ధ వివాహాలను ఖండిస్తూ – మొగుడు తాతయ్య అని గేలిచేసే మహా అరిష్టాన్ని పరిష్కరించుకుందుకు ఆత్మాహుతి గావించుకున్న పుత్తడిబొమ్మ పూర్ణమ్మను – మనోజ్ఞంగా చిత్రించారు. మతం నల్లమందు మత్తులో పరస్పరం కలహించుకునే భిన్నమతాల వారి ఆగడాల్ని ఖండిస్తూ – "దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్ళారా, మీపేరేమిటి? అనే అత్యద్భుత ఆధునిక సంవిధానంలో కథనందించి, వారే చెప్పిన భవిష్యత్తులో స్త్రీ చరిత్రను రచించగలదు." అన్న వాక్యాన్ని రూఢిపరుస్తూ ఆ కథలో పూజారి పాత్ర ప్రవేశించడంతో ఆ కథ సమాప్తం చేశారు. మరికొన్ని నాటకాలు, ఒక నవలా సంపూర్ణ స్వరూపంతో అందకుండా, చేయిజారిపోయాయి!

"దిద్దుబాటు" అనే అత్యంత శిల్పసుందరమైన కథా, మరికొన్ని చిన్న కథలూ మనకందాయి. ఆ మహాకవి 53ఏళ్ళ తనువు చాలించి, శతాబ్ది పూర్తవనుంది. ఈ నూరేళ్ళ లోనూ, ఆయన సాధించి ఇచ్చిన ఆధునికత్వం సర్వసాహిత్య ప్రక్రియలనూ పరిపోషిస్తోంది. అంతకు పూర్వం వేల సంవత్సరాలలో వెలువడిన సాహిత్యానికి దాదాపు రెట్టింపు సాహిత్యం వెలువడ్డానికి సాహిత్యంలో ఆధునికత్వానికి జనకులు! కనుకనే వారిని జాతి త్రిశుద్ధిగా స్మరించుకోవలసిన అవసరం ఉంది. 1915లో ఆయన నిర్యాణం చెందినపుడు ఆ మహాకవి నిర్వహించిన పాత్రను మనసారా ఆమోదించిన మేధావులెందరో విలపించారు. ఆయన్ని స్మరించుకుంటూ ప్రకటనలెన్నో చేశారు. ఆ స్మృతి రేఖలను అవసరాల సూర్యారావు

చిత్తశుద్ధితో గ్రంధస్థం చేశారు. స్మృతి రేఖలే ప్రధానంగా, ఈ వ్యాసంలో ఉటంకించడం జరుగుతుంది. కారణజన్ముడైన అవసరాల, గురజాడ అప్పారావుగారి సాహిత్యాన్ని అచ్చుకెత్తడం ద్వారా చిరస్మరణీయం చేసి, తన కర్తవ్యం నెరవేర్చుకుని వెళ్ళిపోయాడు.

వారి నిర్యాణ సమయంలో విజ్ఞత గల మేధావులు వారి మరణం పట్లవారు పొందిన విషాదాన్ని ఏ రీతిగ వ్యక్తం చేశారంటే – వీరి నిర్యాణ సందర్భములో పేరు కనిపించని పత్రికలో ఇలా రాశారు. గురజాడవారి బాల్య, విద్యా భ్యాసము సాఫీగా గడవలేదు. వీరికి పండిత చంద్రశేఖర శాస్త్రిగారి ప్రోత్సాహము పెంపొంది, వీరు, కళింగదేశ చరిత్ర రాయదలచి గొప్ప, సామగ్రి సమకూర్చుకున్నారు. దానిని వినియోగించుకుని, ఎవరైనా ఆ చరిత్ర పూర్తి చేస్తే గొప్ప ఉపయోగం గానే ఉంటుంది. వీరు విజయనగరం మహారాజావారికి ఆంతరంగిక కార్యదర్శి. సంస్కృత కళాశాల, సంగీత కళాశాల వీరి హయాములోనే ప్రాదుర్భవించాయి.

*కళింగదేశ చరిత్ర రాయదలచి గొప్ప, సామగ్రి సమకూర్చుకున్నారు. దానిని వినియోగించుకుని, ఎవరైనా ఆ చరిత్ర పూర్తి చేస్తే గొప్ప ఉపయోగంగానే ఉంటుంది. వీరు విజయనగరం మహారాజావారికి ఆంతరంగిక కార్యదర్శి. సంస్కృత కళాశాల, సంగీత కళాశాల వీరి హయాములోనే ప్రాదుర్భవించాయి.*

ఆంధ్రభాష నిమిత్తమై శ్లాఘనీయమైన కృషి సల్పారు. "వారు లేని వర్తమాన భవిష్యత్తులు దుఃఖాకులమై పోగలవు." అని ఆ పత్రిక ఎందరో ఆత్మీయులకు ప్రతినిధి మాత్రముగా నిలుస్తుంది.

**మదరాసులో సంతాపసభ**

గురజాడ అప్పారావుగారి మృతి వలన, ఆంధ్రదేశానికి వాటిల్లిన తీరని నష్టానికి దురపిల్లుతూ నిన్న సాయంకాలం, ఆండర్సన్ హాలులో తెలుగు రీసెర్చి సొసైటీ ఆధ్వర్యాన సంతాపసభ జరిగింది. శ్రీ అప్పారావుగారి చిరకాల స్నేహితులు, వారి అభిమానులు అయిన శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు సభకు అధ్యక్షత వహించారు.

**ఆనరబుల్ సర్ హోరాల్డు స్టూవర్టు**

అప్పారావుగారి మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఆనరబుల్ స్టూవర్ట్ పంపిన సందేశాన్ని శ్రీనివాసయ్యంగారు సభవారికి చదివి వినిపించారి. అప్పారావు పంతులుగారి మరణమునకు సానుభూతి తెలపడానికై సభ జరుగుతున్నట్లు నాకిప్పుడే వర్తమానం వచ్చింది. చాలా జరూరు పనులుండడం వల్ల నేనీ సభకు హాజరుకాలేక పోతున్నందుకు నాకెంతో దిగులుగా ఉంది. అప్పారావు పంతులు వంటి మహాపండితుని, కోల్పోయినందుకు దురపిల్లుతున్న తెలుగువారి సంతాపములో నాకూ భాగమున్నది. ఈ దిగువ సంతాపతీర్మానమును సభవారు దుఃఖ సూచకముగ కొన్ని నిముషములు మౌనముగా నిలబడి ఏకగ్రీవముగా ఆమోదించారు.

''గురజాడ అప్పారావుగారి మరణం వలన తెలుగు సాహిత్యమునకు ఎంతో నష్టం వాటిల్లింది. వారి కుటుంబానికి ఈ సభవారు తమ సంతాపాన్ని తెలియజేస్తున్నారు." విజయనగరంలో ఒక సూర్యుడు అస్తమిస్తే మద్రాసులో మేధావుల ముఖాలపై చీకటి పడింది. ఎందరో మేధావులు వాళ్ళు తమిళులయినా, ఆంధ్రులయినా, ఆంగ్లేయులయినా, వారెంత విచారించారో, పై తీర్మానం తెలుపుతుంది. మేధావి లోకహితైషి అయితే అందరికీ ఆత్మబంధువే. గురజాడ వారి నిర్యాణం, అలాంటి విషాదమే కలిగించింది.

చెన్నా ప్రగడ భానుమూర్తిగారు, చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారికి మిత్రులు. ఇటీవల కొందరు వక్రబుద్ధులు – భరతఖండంబు– చక్కని పాడి ఆవు– పద్యాన్ని చెన్నా ప్రగడవారు తమ పద్యాలకు తలమానికంగా అలంకరించుకుంటే తర్వాత ముద్రణల్లో ఆ పద్యానికి కొటేషన్ పెట్టకపోవడం వల్ల ఆ పద్యం చెన్నా ప్రగడవారిదేనని అడ్డగోలుగా వాదించనారంభించారు. ఆ భానుమూర్తి గారు ఇలా అంటున్నారు.

సంతాపతీర్మానాన్ని ప్రతిపాదిస్తూ మద్రాసు ప్రభుత్వ తెలుగుట్రాన్స్ లేటర్ భానుమూర్తి గారిలా ఉపన్యసించారు.

"అప్పారావు గారి ఉపజ్ఞ మాత్రమే గొప్పది కాదు! ఆయన హృదయం నవనీతం వంటిది. అనేక శాస్త్రాలలో నికటమైన పాండిత్యమూ, అపార విజ్ఞాన సంపత్తి గల మేధావులు. తమ స్నేహితులను, హృదయమిచ్చి ప్రేమించే వారు. సోదర ప్రజానీకం పట్ల ఆయనకు గల ప్రేమే ఎనలేనిది. డాబూ దర్పమూ ఏ కోశానా యెరగని వ్యక్తి. మిత్రులైననూ శత్రువులైననూ, వారి వారి సుగుణములను సరిసమానముగా గుర్తించి, అప్పారావు పంతులుగారు వారిని మన్నన చేసేవారు. వారితో పరిచయమైతే చాలు. కలిగిన ఆ కాస్త పరిచయమూ, ఇతరుల ప్రేమను, గౌరవాన్నీ సదా పొందుతూ ఉండేవారు. దీనికి అప్పారావు పంతులుగారి సుగుణ సంపత్తియే కారణం."

అప్పారావుగారి మృతి వలన దేశము ఒక ఉత్తమ పుత్రుణ్ణి కోల్పోయిందనీ తెలుగువారొక ఆత్మీయుని పోగొట్టుకున్నారనీ చెబుతూ, భానుమూర్తిగారు గ్రాంధిక వ్యావహారిక భాషా వివాదములను ప్రస్తావిస్తూ ఇలా అన్నారు.

"వ్యావహారిక భాషా వాదానికి ఆయన నాయకులు. నేనూ, నా మిత్రులమూ దీనికి వ్యతిరేకులము. వారికీ మాకూ తీవ్ర బేధాభిప్రాయాలుండేవి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఏ భాషలో అయితే బెంగాలీ సాహిత్యాన్ని సృష్టించారో అట్టి భాష తెలుగు సాహిత్యానికెంతో ప్రయోజనకారి. ప్రజలను విద్యావంతులను చేయడానికీ, దేశ అభివృద్ధికీ, జాతీయాభ్యున్నతికీ ఇట్టి భాషా సాహిత్యాలెంతో అవసరం.

అప్పారావు రచించిన ఖండకృతుల ప్రాశస్త్యమును, ఉపన్యాసకులు ఉగ్గడిస్తూ ప్రజలను విద్యా సంపన్నులను చేసే జాతీయోన్నత్యాన్నీ సాధించే రచనా విధానాన్ని రవీంద్రుని వలె అప్పారావు పంతులుగారు కొన సాగించారని ఇలా అభిభాషించేవారు.

అప్పారావుగారి కవితాశక్తి మహత్తరమైనది. విశ్లేషించి చూసే దృష్టీ, తార్కికశక్తీ తమ ఆశయాలకనుగుణంగా, రచించే నేర్పూ, ఆయనకు కలదు. తమ ఆదర్శాలేమో వాటిని సాధించడానికి ఏమి చేయవలెనో తెలిసిన ఆత్మశక్తీ, చైతన్యమూ గల రచయిత చెన్నా ప్రగడ భానుమూర్తిగారు! ఉత్తమమైన అవగాహనాశక్తి గల మేధావీ. మహాకవీ, మహా పురుషుడూ గురజాడ అప్పారావు గారి గురించి చెప్పిన వాక్యాలు శిరోధార్యాలే. భానుమూర్తిగారు ప్రభుత్వోద్యోగి. ఆయన అభిప్రాయాలకి పైన ఉల్లేఖించిన చిలకమర్తి వారిపై పద్యం వంటి దేశభక్తి గీతాలు, పద్యాలు రాసే అవకాశం లేదు!! లభించిన వారి రచనలు వేటిని పరిశీలించినా ఇలాంటి దేశభక్తి కనిపించదు!

దేశభక్తులైన గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు పాల్గొన్న ఆంధ్రులలో ప్రముఖులు. 1905 ప్రాంతంలోనే జైలు శిక్ష అనుభవించిన దేశభక్తుడు. వారు పత్రికా రచయితగా సంపాదకుడుగా మద్రాసులో ఉండేవారు. వారు ఈ క్రింది విధంగా, తమ సంతాపం తెలిపారు. వారు సభలో పాల్గొని వి.ఆర్.వి సుబ్బారావుగారు పంపిన లేఖను సభలో చదివారు అనంతరం ఉపన్యసిస్తూ ఇలా అన్నారు. అప్పారావు గారు నాయకత్వం వహించిన వ్యావహారిక భాషా వాదమునకు తాము వ్యతిరేకులమే అయినా, అప్పారావుగారిలో రెండు ఉత్కృష్ట గుణములను ఆయన శత్రువులు సైతము మెచ్చుకోక తప్పదన్నారు. “గొప్ప గొప్ప పండితులకు సైతం తమ వాదమును నచ్చజెప్పి, తమకు సుముఖులుగా చేసుకుంటూ, వారిని మార్చేశక్తి అప్పారావుగారికి వుంది. తమ వాదానికి తామే ఆదర్శముగ నిలబడి కావ్య రచన సాగించడమనే ఉత్కృష్ట ఆశయాన్ని ఆయన సాధించారు. మరికొన్ని సంవత్సరాలు ఆయన జీవించి, తాము అవలంభించిన రీతులలో రచనలను అధిక సంఖ్యాకంగా, సృష్టించి ఉంటే, ఈ సరికి ఆయన తెలుగుదేశానికి రవీంద్రులయేవారు.”

అప్పారావు గారు మరికొన్నేళ్ళు సాహిత్య రచనలోనే తమ జీవితకాలమును గడిపివున్నట్లయితే ఈ పాటికి ఆంధ్రసాహిత్యం మహా సంపన్నవంతమై ఉండేది. ఆయనకు అనేక ఇతర కార్యకలాపాలు వుంటూ వుండేవి. మీదబడ్డ ఈ కావ్య భారమంతా తొలగి ఇక తీరిక చిక్కింది కదా అనుకునే సరికి సాహిత్య సేవ మిక్కుటముగా చేసే అవకాశం తిరిగి లభించింది కదా, అని, ఆశించేతరి, ఆకస్మికంగా మృత్యువు సమీపించింది. ఇటువంటి దురదృష్టకర సంఘటనవల్ల ఆంధ్రదేశానికి తీరని నష్టం వాటిల్లింది. నిజంగా ఇది తెలుగువారి దురదృష్టమనక తప్పదు. ఇంతవరకూ వచ్చిన సాహిత్యం ప్రజలకు చేయవలసిన సేవ చేయతగినంత చేయలేకపోయిందనీ దీనికి అనేక కారణాలు కలవనీ, దీనిని సంస్కరించి, నూతన దృక్పథంతో ముందు అడుగు వేయాలనీ గమనించినవారు అరుదు. ఇట్టి వినూత్న మార్గములను అన్వేషించి క్రొత్త క్రొత్త పోకడులకు పోయి, ప్రజలకు సాహిత్యాన్ని సన్నిహితంగా తెచ్చినవారు అప్పారావు పంతులుగారు. ఆయన ఈ మార్గంలో మహోత్కృష్ట విజయాన్ని సాధించారు. మాతృభాషకూ, సాహిత్యానికి ఇంతటి ఆత్మీయ స్నేహితులు మరొకరు లేరు. అనంతరం సానుభూతి తీర్మానాన్ని బలపరుస్తూ ఒక పండితుడు తెలుగున ఉపన్యసించారు.”

***అప్పారావు గారు మరికొన్నేళ్ళు సాహిత్య రచనలోనే తమ జీవితకాలమును గడిపివున్నట్లయితే ఈ పాటికి ఆంధ్రసాహిత్యం మహా సంపన్నవంతమై ఉండేది. ఆయనకు అనేక ఇతర కార్యకలాపాలు వుంటూ వుండేవి.***

ఉపన్యాసకుల పలుకులలో అతిశయోక్తులేవీ లేవని, చెబుతూ, సభాధ్యక్షులు ఎస్. శ్రీనివాసయ్యంగారిలా అన్నారు. అప్పారావు గారు సునిశిత విమర్శకులు. ఇతరుల రచనలే కాదు, తమ రచనలను సైతం విమర్శించుకుని, చూచుకునేవారు, కావ్య వస్తువులోనూ, రీతిలోనూ, ఆయన ఆదర్శములను పరిపూర్ణతను సాధించడం, తమకూ, అప్పారావుగారికీ గల స్నేహాన్ని గురించి ముచ్చటించి, అధ్యక్షులు కొన్ని మధురస్మృతులను పేర్కొన్నారు. విజయనగరం పెద్ద దావా జరుగుతున్న సందర్భంలో ఆయనతో తాము వాల్తేరులో కొన్నాళ్ళు గడిపే అవకాశం లభించిందని చెబుతూ, శ్రీనివాసయ్యంగారిలా అభిభాషించారు. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషా సాహిత్యాలలో, శాసన పరిశోధనలో పురావస్తు తత్త్వ శాస్త్రంలో ఆయనకు గల ప్రజ్ఞ అపారం. ఆయన విషయ పరిజ్ఞానం నన్నాశ్చర్య చకితుణ్ణి చేసింది. సాహిత్యపు పోకడలనే కాక, లోకమున మనుజుల ప్రవర్తననూ, తీరు తెన్నులనూ స్వభావాన్ని ఆకళించుకున్న రచయిత అప్పారావు పంతులు. ఆయనతో అయిదారు నిమిషాలు ప్రసంగిస్తే చాలు! ఆయన నఖశిఖ పర్యంతమూ మహా పండితుడనీ, గొప్పమేధావి అనీ మనకు బోధపడుతుంది. ఆయన సాహిత్య సేవయే, పరిశోధనయే, జీవితపరమాశయంగా, ఉపలక్షించిన రచయిత. పరిశోధనలో మిక్కుటమగు ఆసక్తి వలన, ఎక్కువ ఖండకృతులను రచించే వ్యవధి ఆయనకు లేకపోయింది. ఇంతటి ధీశాలి ఇంకా అధికంగానే, రచనలు చేసే, అవకాశం వుంది మరి, కాని, సంస్థాన వ్యవహారాలు ఆయనకు ఊపిరి ఆడనీయలేదు. విజయనగర రాజకుటుంబీకులాయనకు ఎంతో ఋణపడ్డారని, చెప్పవచ్చును. ఆయనతో పరిచయమవుతున్న కొద్దీ ఆయన మనకు సన్నిహితులయ్యేవారు. మానవునిగా ఆయనలో గల లోపముల కంటే

సుగుణములనే మనం దర్శించగలం.

అధ్యక్షుని ఉపన్యాసానంతరం, మద్రాసు యూనివర్సిటీ రీడరు బి.శేషగిరిరావుగారు సభవారు కావించిన సంతాపతీర్మానాన్ని అప్పారావుగారి కుటుంబమునకు అందజేయవలసిందిగా సూచించిరి.

మద్రాసు సానుతాపసభలు పూర్తయిన తర్వాత విద్యార్థి దశనుంచీ సహచరుడూ, మిత్రుడూ, భాషాసాహిత్య పోరాటశీలీ అగు మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు గారు. ఆయన అప్పారావుగారి నిర్యాణంతో దుఃఖాబ్దిలో మునిగిపోయారు. అజరామరమైన వారి లేఖ ఇప్పుడు మనము చదువుకునే లేఖ. అది చదివినవారికి కన్నులు చెమరుస్తాయి.

వాగను శాసనులు శ్రీ గిడుగు
పర్లాకిమిడి
5 డిసెంబరు 1915

ప్రియమైన రామదాసూ,

ఎంత విషాదకరము, అతడు గతించినాడు. ప్రియమైన ఆత్మ! నీ వలెనే, నాకూ దుఃఖం పొంగుకు వస్తున్నది. నీ విచారములో సంగోరు భాగమును పంచుకుంటున్నాను. నా అత్యంత ప్రియమిత్రుడు పరమపదించినాడు!

ఎలాగ వున్నదో చూసి వద్దామని విశాఖపట్నం వెళ్ళాను. అదే ఆఖరుసారి అతన్ని చూడడం. నేనతన్ని చూడ్డానికి వెళ్ళినపుడు డాక్టరు నాకిలా సలహా ఇచ్చాడు. "మీరు మొదట కనిపించే సరికల్లా ఆయన ఉద్రేకం పట్టలేకపోతున్నారు! అదే పనిగా జబ్బు మాటే మరచి మీతో సాహిత్య గోష్ఠి చేస్తున్నారు. చారిత్రక విషయాలను, గురించి, సారస్వతాన్ని గురించీ చర్చలు జరుపుతున్నారు. విపరీతమైన అలసట కలుగుతున్నా లెక్క చేయడం లేదు. ఇలా అయితే ఆయన ఆరోగ్యం మరీ పాడవుతుంది కదా!"

డాక్టరు అతనికి ఉత్తరాలు వ్రాయవద్దని, నాకు చెప్పాడు. నాటి నుంచీ అతనికి ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాను! జబ్బు నిమ్మళిస్తుంది కదా, ఆరోగ్యం తిన్న బడుతుంది కదా అని ఆశిస్తూ వుంటిని! కాని ఇంత త్వరలోనే మరణం ముంచుకువస్తుందనుకోలేదు.

నీ దస్తూరీతో వున్న అతని ఉత్తరం ఇరవై తొమ్మిదో తేదీన కాబోసు. పోస్టులో వేశావు. అది అతను చెప్పగా నువ్వు వ్రాసిన ఉత్తరం కదూ! అవును, అదే కట్టకడపటి ఉత్తరం.

అతని మరణంతో ఒక గొప్ప వ్యక్తిని ఒక పరోపకార పరాయణుని, మహా పండితుని మన దేశం పోగొట్టుకున్నది.

మీ నాయనమ్మను తలచుకున్నప్పుడల్లా నా హృదయం ద్రవించిపోతున్నది. గుండె చెరువవుతున్నది. పాపం ముసలితనంలో ఎంత విపత్తు! ఏమని చెప్పి, ఆమె దుఃఖాన్ని నివారించగలం? దుఃఖమును ఆపుకునే శక్తిని భగవంతుడు ఆమెకు ప్రసాదించుగాక! మీ తల్లిగారినీ, నాయనమ్మనూ అప్పచెల్లెళ్ళనూ, ఓదార్చి నువ్వు ధైర్యముతో వుండవలెను. మానాన్న గారు పోయేసరికి నాకు పద్నాలుగేళ్ళు మాత్రమే. దుఃఖం పట్టలేకపోయాను అవును, నాకింకా జ్ఞాపకం ఉంది. దుఃఖిస్తోన్న నన్ను చూసి దుఃఖం పట్టలేక, అప్పారావు భోరున దుఃఖించసాగేడు. అదే నన్ను ఉపశమింప జేసింది.

తెలుగు ప్రజల స్మృతి పథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ అతను జీవిస్తున్నాడు. అతన్ని తలచుకోవడమంటే మన జీవితములలోని అత్యంత ఆనందమయ సంఘటనలను మన స్మరణకు తెచ్చుకోవడమే.

*తెలుగు ప్రజల స్మృతి పథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ అతను జీవిస్తున్నాడు. అతన్ని తలచుకోవడమంటే మన జీవితములలోని అత్యంత ఆనందమయ సంఘటనలను మన స్మరణకు తెచ్చుకోవడమే.*

మిస్టర్ జె.ఏ ఏట్సుగారు కూడా ఒక సంతాప లేఖ రాశాడు. ఆయన ఇంగ్లీషువారు. ప్రభుత్వం నియమించిన టెక్స్టుబుక్స్ కమిటీలో నెంబరై ఉంటారు. మహాకవి దినచర్యలో ఒకటి రెండుసార్లు ఆయన పేరు ఉటంకించబడింది. ఆయన విజయనగరంలో గురజాడవారి కుటుంబ సభ్యుల్ని పరిచయం చేసుకున్నారు. వారు మహాకవి కుమారుడు రామదాసుకు ఈ క్రింది ఉత్తరం రాశారు.

**బెంగుళూరు 22 డిసెంబరు 1**
**సౌత్‌పేరెడ్**

"ప్రియమైన రామదాసుగారూ మీ తండ్రి గారి మరణవార్త విన్నంతనే నా ప్రగాఢ సానుభూతిని మీకు అందచేయవలసిందిగా రావు సాహెబ్ గిడుగు రామ్మూర్తి పంతులుగారిని కోరితిని. మీ నాయనగారి ఆప్తమిత్రులు, బంధువులూ, శ్రీరామమూర్తిగారిని తప్పిస్తే, నేను మరెవ్వరినీ ఎరుగుదు.

ఈ విషాదవార్తను నేను మొదట నమ్మలేకపోయాను. ఇది నిజం కాదనుకున్నాను. ఏమీ అంటే ఇలాంటి దురదృష్టకరం సంఘటన జరగకూడదనీ, జరగదనీ నా మనస్సు ఊహిస్తూ రావడమే నేనీ వార్తను విశ్వసించకపోవడానికి హేతువు. మొన్న మొన్ననే ఈ మధ్యనే ఆయన నాకు లేఖ వ్రాశారాయె! తరువాత తెలుగు వ్యావహారిక భాష మీద ఆయన వ్రాసిన మెమోరాండము పన్నెండు కాపీలు పంపారాయె! తెలుగుభాషా సంస్కరణకు నడుము కట్టి అహోరాత్రాలు కృషి చేసిన మహా పండితుడు. పరమ పదించడం తీరనిలోటు! అంతటి హాస్యరస ప్రధానమైన గొప్ప నాటకాన్ని రచించి, సంస్కరణోద్యమాన్ని శక్తివంతమైన దానినిగా చేసిన ప్రతిభాశాలి ఆయన! ఆయనకు బదులుగా ఆయన రచనలు ఎల్లకాలమూ జీవిస్తాయి. మహత్తరమైన ప్రయోజనమును సాధించి ఉదాత్త

ఆశయముల కోసం ఆయన మరణించారు. ఆ ఆశయములు నెరవేరినవి. కనుక ఆయన లేరనే దిగులు పడక్కరలేదు. భవిష్యత్తులో ఒక్కొక్క ఏడాదీ పైబడుతున్న కొద్దీ మానవులు గతం వెనుక కొకసారి తిరిగి చూసుకుని, నమ్రతతో గౌరవముతో  మీ నాయనగారికి జోహారులర్పిస్తారు. రచయితగా, పండితునిగా, దేశభాషా సంస్కరణోద్యమ ఆధ్యులుగా లోకము ఆయనకు హారతులు పడుతుంది.

ఆయనతో నాకు పరిచయం లభించడం ఎంత అదృష్టం! తెలుగు భాషా సాహిత్యములను గురించి ఎన్నో విషయాలను తెలుపుతూ ఆయన నాకు లేఖలు వ్రాస్తూ ఉండేవారు.”

**వంగదేశీయ ఆంధ్ర సమితి 27, భవానీ చరణ్**
**దత్తాలేన్ కలకత్తా 14 డిసెంబరు 15**

“అయ్యా” డిసెంబరు పన్నెండవ తేదీన వంగదేశీయ ఆంధ్రసమితియను పేరబరగుచున్న బంగాళాదేశము ఆంధ్రసంఘము కూడి, కీర్తిశేషులగు, గురజాడ అప్పారావు పంతులుగారు ఆంధ్రదేశమునకు చేసిన మేలు అతిశ్లాఘనీయమని కొనియాడుచు ఆంధ్రకవి ప్రపంచము కోల్పోయిన నుత్తముని జ్ఞాపకార్థము ఈ సభ కూడినదనియు, నిలచి… నిశ్శబ్దముగా తీర్మానించిరి!” అని వ్రాసిరి!

***భవిష్యత్తులో ఒక్కొక్క ఏడాదీ పైబడుతున్న కొద్దీ మానవులు గతం వెనుక కొకసారి తిరిగి చూసుకుని, నమ్రతతో గౌరవముతో  మీ నాయనగారికి జోహారులర్పిస్తారు. రచయితగా, పండితునిగా, దేశభాషా సంస్కరణోద్యమ ఆధ్యులుగా లోకము ఆయనకు హారతులు పడుతుంది.***

**మిష్టర్ మార్క్ హంటర్**
**ఆండర్సన్ హౌస్, సుంగంబాకం మద్రాసు**
**డిసెంబరు 15**

డియర్ మిష్టర్ రామదాసు,

నా మిత్రుడు శ్రీ అప్పారావు మరణవార్త విని క్రుంగిపోయాను. ఆయన సాధించినది ఉన్నతమైనది. దక్షిణ భారతదేశములో గల మేధావులలో, పండితులలో ప్రథమశ్రేణికి చెందిన వ్యక్తి. తన రచనలతో తెలుగు భాషా సారస్వతములకు ఎనలేని సేవ చేసిన రచయిత. ఆయన ఉద్యమ స్వభావమును కొందరు అపార్థము చేసుకుంటే చేసుకొందురు గాక: కాని, యెడతెరిపిలేని పోరాటమును నడిపినాడు. ద్రవిడ భాషలకు, వాఙ్మయమునకు ఆయన మరణించడం వలన తీరని నష్టము వాటిల్లినది.

శ్రీ కిళాంబి రంగాచార్యులుగారు ఆయన మన ఆంధ్రులలో మాకు ముందటి తరము వారిలో చాలా ప్రసిద్ధ పురుషులు… తన మాట చెల్లివచ్చిన చోటనల్లా మన ఆంధ్రులకు, ఆంధ్ర సంస్థలకు సాయపడిన సిసలైన దేశాభిమాని. దేశాభిమానం నాకు కద్దని ఒట్టి గొప్పలు చెప్పకోయ్, పూనియేదైనాను  ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్!” అని తన ముత్యాలసరములలో పాడినట్లు తాను లోకోపకారమని, నమ్మిన వ్యావహారిక భాషోద్ధరణ’ మనే ఉద్యమమునకు ధారపోసిన మహితాత్ముడు. నాది ప్రజల ఉద్యమము. దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను” అని ప్రవచించిన శ్రీ అప్పారావు పంతులుగారు నాకు గురుతుల్యులు.

ఒకసారి మనోహర మగు స్త్రీల పాతపాట ఒకటి అప్పారావుగారి చెవినిబడి మనసున క్రొత్త సంగీతము తిరుగగా తెలుగున ఒక క్రొత్త ఛందము నడిపింపవలెనని సంకల్ప ముదయించెను. 1910లో బరంపురమున జరిగిన నానావిధ వర్ణ సహపంక్తి భోజనములో అప్పారావు పాల్గొనినాడు. ఆ సంవత్సరమే తోకచుక్క పొడిచినది. ఒక విచిత్రమైన భావమథనమున అప్పారావు రసిక చిత్తమున నుండి ఒక క్రొత్త కవితా వేశము రూపు కట్టినది. ఈతని కావ్యముల పాత్రలు ఒక సహజ భావోద్రేకములో ఈతని వలెనే కావ్యౌచిత్యమును కుంటుపడనీయక మెరుగుదేరునట్లు సంస్కారాశయముల వెలిబుచ్చును.”

ఇంగిలీషు ప్రభుత్వం సుస్థిరం, కాగానే దిగ జారుతున్న ఆర్థిక పరిస్థితులు బట్టబయలైనాయి. ప్రజలు అన్నంలేక మాడిపోతున్నారనీ ఈ దుస్థితి. ప్రజలకు కలగడం మన దుష్టసాంఘిక పరిస్థితుల వల్లనేననీ మన సంఘం మరమత్తు అయి, ప్రజా ప్రభుత్వ స్థాపనమై పర ప్రభువుల స్వచ్ఛంద విహారం కట్టించబడితేనే గాని, ప్రజలకు మరి ముక్తి లేదని, ప్రజల్లో కొంత అలజడి కలిగింది. అంత వరకూ నిరసించబడ్డ జాతీయ సారస్వతం తిరిగి ప్రజల దృష్టిని ఆకర్షించింది. ప్రజాసామాన్య సారస్వత రక్తధ్వజం ఎత్తబడింది. రక్తధ్వజాన్ని ఎత్తినవారిలో గురజాడ వేంకట అప్పరాయ కవి ఒకరు.

గురజాడ అప్పారావు పంతొమ్మిది వందల పదిహేనులో చనిపోయినా ఆ తర్వాతనే జీవించడం ప్రారంభించాడు! కాల్పనికోద్యమంలో ఉన్న ఉత్తమ లక్షణాలన్నీ స్వచ్ఛమూ, నిసర్గసుందరమూ అయిన ఆయన వాణిలో కనబడతాయి. సామాన్యుల గాథలూ, సామాన్యుల మాటలూ కావ్య ప్రాంగణాన ప్రవేశపెట్టడం ఆయన గొప్పతనం. ఆ ముత్యాలసరం కూడా అలాగే అమరింది. ఆ ఛందస్సు తెలుగు వాడి కష్టసుఖాలూ, కథలూ ఎంత బాగా చెపుతుంది. “పాట లాదరిచెట్లు చేతులకై పాట పాడితే తాటివనమున ఆగి చంద్రుడు తాయొ చెవి విగ్గడమూ”

“మంచి చెడ్డలు రెండు కులములు. మంచి అన్నది మాల అయితే మాలనేనగుదున్” అని చాటడమూ నలుగురు కూర్చుని నవ్వేవేళల పుత్తడిబొమ్మను పూర్ణమ్మను ఒకపరి తలచి” అన్నీ పలికించడమూ పెరిగి విరిగితి, విరిగి పెరిగితినని, స్వంత కష్టసుఖాలు తలపోసుకుని,

వాపోవడమూ ఇవన్నీ ఆ క్రొత్తరోజుల్లో యువకవుల హృదయాలకు ఆనంద పక్షాలు తొడిగి, గూటిని ఎరుగని వాటికి కొండంత జీవితాకాశాన్ని చూపెట్టాయి. వీరి రచనలన్నిటిలోనూ వీరేశలింగం మానవోద్యమ ప్రభావమే కనబడుతుంది.

గురజాడ అప్పారావు పంతులుగారు సంస్కృత, ఆంధ్ర ఆంగ్లభాషలలో నిష్ణాతులు. ఆయన సృష్టించిన పాత్రలు మానవత్వంతో నిండినట్టివి. ప్రాణమున్న ప్రతి ఒక్కరిలోనూ, అవి జీవించి, జీవితాన్ని ఉత్సాహవంతం చేస్తాయి. మానవత్వంలోనూ, జీవితంలోనూ పరిపూర్ణమైన రచన కన్యాశుల్కం. దానిలోని స్త్రీలూ, పురుషులూ దయాదాక్షిణ్యాలతోనూ, విపరీతాలతోనూ అయుక్తాలతోనూ, క్రౌర్యాలతోనూ, కుయుక్తులతోనూ, పవిత్రతతోనూ, పంచకత్వంతోనూ తిరుగులాడతారు. ప్రకృతి – ఆచారం, హేతువు సంప్రదాయం, అభిప్రాయం, ఛాందసత్వం, ఒక దానితో ఒకటి తీవ్ర సంఘర్షణలకు తలపడ్డ జీవిత వెల్లువలతో ఇది నిండి తొణికి సలాడుతున్నది.

మహాకవి గురజాడ అప్పారావుగారి గేయాలతో తేట తెనుగు భాష తియ్యదనము చక్కగా ద్యోతకమవుతాయి. మృదు మధురమైన పదాలను పరికూర్చడంలో గురజాడవారి కున్న ప్రతిభ "ముత్యాలసరాలు" చాటుతాయి. సరళమైన శబ్దాలకు పదునుపెట్టి జతచేర్చి, తాము అందజేయాలనుకున్న భావాలను చదువరుల హృదయాలకు హత్తునట్లు చెప్పగల గొప్ప శిల్పి అప్పారావుగారు. పూర్ణమ్మ, కన్యక, మొదలయిన పాటలను చదివితే మహాకవి రచనా పాటవం చక్కగా స్ఫురించుతుంది.

గురజాడవారి "దేశభక్తి" గేయం జాతీయగీతాలన్నిటిలో అత్యుత్తమమైనదిగా నేను భావించుతాను. బ్రిటీష్ వాళ్ళ జాతీయగీతమైన "గాడ్ సేవ్‌ది కింగ్"లో సామ్రాజ్యవాదుల అహంకారం ద్యోతకమవుతుందే గానీ, మాతృత్వం గోచరించదు! భారతదేశంలో ఉత్తమ జాతీయ గీతాలుగా ఎంచబడుతున్న "వందేమాతరం" "జనగణమన"లలో కూడ మాతృభూమిని కీర్తించడం వుందేగాని, ప్రజానీకంపై దృష్టిని కేంద్రీకరించవు. "దేశమంటే మనుషులోయ్" అని ఎలుగెత్తిచాటిన అప్పారావు గారి గీతం వాటన్నిటి కంటే మహోన్నతమైనదనడంలో సందేహం లేదు.

"దేశాభిమానం నాకు కద్దని/ఒట్టి గొప్పలు చెప్పుకోకోయ్/పూని యే దైనాను ఒక మేల్/ కూర్చి జనులకు చూపవోయ్!" అనే చరణంలోనూ

"స్వంత లాభం కొంత మానుకుని/ పొరుగువాడికి తోడు పడవోయ్/ దేశమంటే మట్టికాదోయ్/ దేశమంటే మనుషులోయ్!" అనే చరణంలోనూ అప్పారావుగారు మానవత్వం యొక్క ఔన్నత్యాన్ని నిరూపించారు.

''వెనుక జూసిన కార్యమేమోయ్/ మంచి గతమున కొంచెమేనోయ్/ మందగించక ముందు కడుగేయ్/ వెనకబడితే వెనుకే నోయ్!" అని మహాకవి ప్రజానీకాన్ని అభ్యుదయ మార్గాన నడువమని ఉద్బోధించారు.

"ఈసురోమని మనుషులుంటే/ దేశమేగతి బాగుపడునోయ్
జల్దుకుని కళలెల్ల నేర్చుకు/ దేశి సరుకులు నింపవోయ్!"
పాడిపంటలు పొంగిపొర్లే/ దారిలో నువు పాటు పడవోయ్
తిండి కలిగితే కండ కలదోయ్/ కండ కలిగినవాడేను మనిషోయ్!"

అని మహాకవి ఎలుగెత్తి చాటారు. ఇంతగొప్ప జాతీయ గీతాన్ని మనకందించిన మహాకవి మనవాడవడం నిజంగా ఆంధ్ర ప్రజల అదృష్టం!

ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. ఈ సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవి గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను. భవిష్యత్తు మీద గురజాడకున్న విశ్వాసానికి నేనిక్కడ నివాళులర్పిస్తున్నాను. తక్కిన వాళ్ళంతా తెలుగుదేశంలో యోధాను యోధులయితే ఒక్క గురజాడ మాత్రం ప్రపంచంలో ఎచ్చట ప్రామాణ్యాలకైనా విలువగల సార్వజనీనతను సాధించినవాడు.

ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగుదేశపు సరిహద్దులకవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో, తెలుగువారి తరపున ప్రతినిధిగా నిలువగలిగినవాడు గురజాడ అప్పారావు ఒక్కడే! కవిగా మాత్రమే కాదు కథా రచయితగా, విమర్శకుడుగా విశేషించి, నాటక కర్తగా గురజాడ ధ్రువతార.

ముఖ్యంగా నాటక రచన విషయంలో నీవు ప్రదర్శించిన ప్రతిభ సమకాలిక ప్రపంచంలోనే గణుతించదగినట్టిది. నీవు కన్యాశుల్కము నాటకాన్ని – ఒక సమకాలిక సమస్య ఇతివృత్తంగా ప్రకటించిననాటికి యూరప్ ఖండములోనైనా క్రొత్త నాటకం అంతగా ప్రచారంలోనికి రాలేదు.

అప్పరాయకవి ఆంధ్ర వాఙ్మయానికి ఒక సరిహద్దు. ఈయనతో నవ్య సారస్వత యుగం మొదలైనది. స్వాతంత్ర్యపుటూర్పు పోసిన పరమేష్ఠి దేశభక్తి అంటే ఏమిటో మొదట తెలియజెప్పిన మహానుభావుడితడే!

సాంఘిక దురాచారాలను బట్టబయలు చేసి, సంఘ సంస్కారాన్ని

***గురజాడ అప్పారావు పంతొమ్మిది వందల పదిహేనులో చనిపోయినా ఆ తర్వాతనే జీవించడం ప్రారంభించాడు! కాల్పనికోద్యమంలో ఉన్న ఉత్తమ లక్షణాలన్నీ స్వచ్ఛమూ, నిసర్గసుందరమూ అయిన ఆయన వాణిలో కనబడతాయి.***

సాహిత్యం ద్వారా అప్పరాయ మహా కవికి పూర్వం గాని, తరువాత గాని ఏ తెలుగు రచయితా ఆయన చేసినంత అమోఘమైన సేవ చెయ్యలేదనే నిస్సంశయంగా చెప్పవచ్చును.

దేవుళ్ళూ, రాజులూ ధనికులూ ఆక్రమించుకొన్న సాహిత్యాన్ని ప్రజలకు సంపాదించిన మహాపురుషుడు అప్పరాయ మహాకవి. సాహిత్య విప్లవకారకుడై, నూతన సంస్కృతిని నెలకొల్పిన మహాపురుషుడు.

అప్పరాయ మహాకవి తెలుగుజాతి పెన్నిధి. ప్రపంచకవుల కుటుంబానికి చెందిన విశ్వకవి. ప్రతీ విషయంలోనూ, ఇంత స్పష్టమైన దృక్పథం ప్రచురించిన మహాకవి వెనుక ఒక మహత్తర శక్తి ఉంది. మారుతున్న లోకాన్ని తన రచనల్లో స్పష్టంగా చిత్రించాడు. ప్రాచ్యపాశ్చాత్య సంప్రదాయాలు మేళవించి, సజాతీయంగా, సహజంగా, క్రొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెరుంగులు జిమ్మగా, జాతిని మేల్కొల్పి విజ్ఞానపథాలకు నడిపే ఉత్తమాదర్శం, ఆయన రచనల్లో అడుగడుగునా గోచరిస్తోంది. ఆంధ్ర సాహిత్యంలో ఆయన దివ్యవాణి ఆంధ్రజాతికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది. ముందుకు నడుపుతుంది. అదే ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ ఆంధ్రజాతికీ, అభ్యుదయానికీ ఆశారేఖ"

అంటూ పై నివాళిని సర్వశ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రి, డా॥ బుర్రా శేషగిరిరావు, కొంపెల్ల జనార్ధనరావు, కట్టమంచి రామలింగారెడ్డి, మద్దుకూరి చంద్రశేఖరరావు, శ్రీశ్రీ, నార్ల వెంకటేశ్వరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, సెట్టి ఈశ్వరావు అభ్యుదయ సాహిత్య పత్రిక సంపాదకీయంలో రాశారు.

కోకిలా! పారిపోతివె కోర్కెలన్ని
వమ్ము జేసి, శోకమ్మున మమ్ము ముంచి
చూపులకు అందరానిదై చోరనశక్య
మైన మరుభూమి కొచ్చితే మందు నిన్ను

శీత కాలమ్ము సందెట్లో చిక్కి స్రుక్కి
చాటుమాటున దాగుండి సరసమగువ
సంత కాలము వచ్చెదు నంతవరకు
ఓపికను పట్టలేవైతివే! ప్రియసఖా!

వెట్టి పడియెదుగాని, ఈ విధము క్రొత్తే
ప్రకృతి మార్గమ్ములకు నడ్డు వచ్చుచుంటి
వేసవిచనంగ, దాని వెన్వెంట వచ్చు,
శీతకాలము రాకుండ, జేయగలవె?

దివ్యమౌ నీదుగానమ్ము తీపి హిర
లకు రుచింపక పోయెను వికలమతిని
"కొయ్య బొమ్మల" నే మెచ్చుకొనెడి వీరి
మతుల కెటిక్కు నౌర, కోమలుల సొరు!"

అంత మాత్రాన వీరిపై నలుగనేల?
వెలుగు చీకటి యొక్కచో వెలయుగాదె?
ప్రకృతి వైచిత్ర మిట్టుల బరగవమ్మ
నలుకమైహిడు నిన్నేమి యనగలమదెలు?

ముందువచ్చు వసంతమ్మునందు నీదు
క్రొత్తగీతము విననెంతో కోర్కెనుంటి
నింక నేమి? వసంతమీ ఇగురు పాట
వినబడదు కాదె ఇంక మా వీనులకును


మరచిపోకుము నెచ్చెలీ మమ్ముదలపు
మమరు లలరి చేష్టలు దక్కియాలకించ
లీనమై హాయి నీ దివ్యగాన రసము
చిలుకునపుడు నీదు నిచ్చెలుల మంచు!"

అంటూ బసవరాజు వెంకటప్పారావు గారు మహాకవి, గురజాడకు స్మృతి గీతాన్ని రచించారు. ఆయన గురజాడకు మానసపుత్రుడు వంటివారు. మనస్సాక్షిగా, ఆయనకు అనుయాయులు! ఆయన సాధారణంగా మంచి పల్లవులతో కూడిన గీతములు రాశారు. సకృత్తుగా పద్యాలు అంతకన్నా తక్కువగా మంచి వచన కవితలూ రాశారు. గురజాడపై సంస్మరణ గీతం మాత్రం వచన పద్యంలోనే రాశాడు. ఆయనేం రాసినా అది శిరోధార్యమే. కారణమేమంటే మహాకవి కృష్ణశాస్త్రి గారే చెప్పినట్లు "బసవరాజు అప్పారావు గారే భావకవిత్వానికి సింహద్వారం వంటివారు!"

కృష్ణశాస్త్రి గారి కృష్ణపక్షం అచ్చువేస్తున్నపుడు (1924) మహాకవి అనే శీర్షికతో ముత్యాల సరాలలో గురజాడ మహాకవికి నివాళు లర్పించారు. దేశభక్త కవి గరిమెళ్ళ సత్యన్నారాయణగారు గురజాడ మహాకవిపై మంచి సంస్మరణ గీతం రాసి, కృష్ణా పత్రికలో అచ్చు వేశారు. బహుశా దానిని అవసరాల చూసి ఉండడు. లేకపోతే కృష్ణశాస్త్రి గారి ముత్యాల సరాలతోనే ముందుగా దాన్నే అచ్చువేసేవాడు. ఏమైనా ఈ మహనీయుల సంస్మరణ రచనలను అనుసరించి, చూస్తే గురజాడ ప్రాముఖ్యత మరింత స్పష్టంగా గోచరిస్తుంది.

మహాకవి వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో అపూర్వము అపరూపమూ అయిన ఆధునికత్వానికి ఆద్యులయి చారిత్రక ప్రసిద్ధులయి, నిర్యాణం చెందడం, సమకాలీన మేధావులలో ఎంతగా విషాద తరంగాలు కదిలించిందో మేధావుల ప్రకటనలు ఉదాహరణ మాత్రంగా పైన వివరించుకున్నాం. వీటిని బట్టే ఆ మహాకవి ప్రభావమూ, ప్రతిభా మనకు ద్యోతకమవుతాయి. అర్ధాయుష్మంతుడై జీవించినా, శకపురుషులై అనంతమైన ఆధునిక సాహిత్యానికి పితృతుల్యులయ్యారు. గురజాడ అప్పారావుగారు అజరామర కవి శేఖరులు!

◆



# రెండు జ్ఞాపకాలు ఒక పరిశీలన

- తోకల రాజేశం
9676761415

***కవిత్వం మౌలికంగా భావావేశానికి సంబంధించిన కళ. ఏ కవితా వస్తువునైనా కవి తన వైయక్తిక దర్శనంలోంచే విలువ కడుతాడు. ఎంత కాదనుకున్నా - కవిత్వంలో వ్యక్తిగా తనకే సొంతమైన భాష, పరిసరాలు, కొన్ని సొంత ప్రతీకలు మొదలైనవి చేరుతాయి. కాబట్టి కవిత్వ నిర్మాణంలోనే వ్యక్తి వాదానికి దారితీసినట్టు కనిపించే కొన్ని అంశాలుంటాయి.***

ఆత్మాశ్రయ కవిత్వాన్ని అంచనా వేసేటప్పుడు కొన్ని గందరగోళ సూత్రీకరణలకు దారితీసే అవకాశం వుంది. ఆత్మాశ్రయ కవిత్వం దాదాపుగా వ్యక్తివాదంలోకి - అంటే భావవాదంలోకి తెరుచుకుంటుందన్న అంచనా ఇప్పటికే వుంది. అయితే ఈ గందరగోళానికి గల కారణాలలో కవిత్వ నిర్మాణానికీ కొంత పాత్ర వుంది. కవిత్వం మౌలికంగా భావావేశానికి సంబంధించిన కళ. ఏ కవితా వస్తువునైనా కవి తన వైయక్తిక దర్శనంలోంచే విలువ కడుతాడు. ఎంత కాదనుకున్నా - కవిత్వంలో వ్యక్తిగా తనకే సొంతమైన భాష, పరిసరాలు, కొన్ని సొంత ప్రతీకలు మొదలైనవి చేరుతాయి. కాబట్టి కవిత్వ నిర్మాణంలోనే వ్యక్తి వాదానికి దారితీసినట్టు కనిపించే కొన్ని అంశాలుంటాయి. అలాంటిది ఆత్మాశ్రయ కవిత్వం దగ్గరికి వచ్చేసరికి అదనంగా మరికొన్ని సమస్యలు తలెత్తుతుంటాయి. ఆత్మాశ్రయ కవిత్వమైనా- ఇంతకు ఎలాంటి కవిత్వమైనా - అందులో కనిపించే సామాజికతను పట్టుకుంటే గానీ ఇలాంటి సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాలు లభించవు. ఆ కవిత్వంలో కనిపించే సమాజం ఎలా వ్యక్తమైంది? ఆ సామాజిక సంబంధాలలో కవి ఎలా వ్యక్తమౌతున్నాడు? అన్న ప్రశ్నలకు సరియైన సమాధానాలు లభించే పక్షంలో-ఆ కవి వ్యక్తివాదం బారిన పడే ప్రమాదం తప్పుతుంది. ఈ తాత్విక నేపథ్యంలోంచే సూరారం శంకర్ రాసిన 'రెండు జ్ఞాపకాలు'' కవిత్వాన్ని పరిశీలించాలి.

ఆత్మాశ్రయ కవిత్వంతోపాటు ''రెండు జ్ఞాపకాల్లో'' వస్త్వాశ్రయ కవిత్వమూ వుంది. ఈ సంకలనాన్ని ఈ రెండు ధోరణులు రెండు పాయలుగా అల్లుకున్నాయి. చాలా కవితల్లో ఈ రెండు ధోరణులు స్పష్టాస్పష్టంగా కలిసిపోయి కవిత్వాన్ని మొత్తంగా వొక తాత్విక వ్యాఖ్యానంలా భ్రమపడేటట్లు కూడా చేస్తున్నాయి. చాలా తక్కువ కవితలను మినహాయిస్తే సామాజిక స్పర్శ లేకుండా-ముఖ్యంగా సామాజిక విమర్శ లేకుండా రాసిన కవితలిందులో లేవు. సమాజం మీద మనిషి మీద ప్రేమ చావని వాడు శంకర్.

సాటి మనిషికి చేయూతనివ్వాల్సిన వాడు
దుఃఖంలో ఓదార్పు కావల్సిన వాడు
నిస్సహాయతలో సహాయత ప్రకటించాల్సిన వాడు
క్రమేణా మసక బారుతున్నాడు (స్నేహ బృందావనాలు)

పై పంక్తుల్లో - ఆ పరిస్థితి మీద కవికి ఆవేదన వుందన్న సంగతి అర్థమవుతుంది. ఇట్లాంటి పరిస్థితి మీద ఆవేదన చెందడం మినహా కవియైనా, మరొకరైనా చేయగలిగిం దేమీ వుండదు. ఇలాంటి ప్రత్యేక సందర్భంలో కవి ఆవేదనతో పాఠకుడు మమేకత ప్రకటించడం వల్ల కవి ఉద్దేశించిన చైతన్యం పాఠకుడికి

అందుతుంది. కవిత్వ నిర్మాణానంతర దశను ఊహించుకోగల్గితే ఇక్కడ కవి పోషించింది అనుసంధాన పాత్ర అన్న సంగతి అర్థమవుతుంది.

కుట్రలు కుట్రలుగా బలపడ్తున్న సందర్భం మీద
'ఏ ఛత్రపతి కత్తులు దూస్తాడో
దోసిలి ఒగ్గి
ఆహ్వానించాలని వుంది'

ఇక్కడ కూడా కవి అలాంటి అనసంధాన పాత్రనే పోషిస్తున్నాడు. మొదటి సందర్భంతో పోలిస్తే ఈ రెండవ సందర్భంలో కవి అనుసంధాన పాత్రను దాటి రావాల్సిన అవసరం వున్నదన్న సంగతి సులభంగానే అర్థమవుతుంది. కానీ కవి వేరేవాళ్ళ కోసం "దోసిలి ఒగ్గి" ఆహ్వానిస్తున్నాడు. తానే స్వయంగా ఆ పాత్రను పోషించే అవకాశాన్ని వదిలేసి మాట్లాడుతున్నాడు. అయితే ఇదంతా కావాలనే చేస్తున్నాడు. వ్యూహంలో భాగంగా చేస్తున్నాడు. చివరి వాక్యాలను చదివితేనే గాని ఆ విషయం అర్థం కాదు.

**ఉద్యమాల ద్వారా ప్రభావితమైన కవి – ఆ ప్రభావంతో కవిత్వం రాస్తాడు కాని కవిత్వం రాయటం వల్లనే ఉద్యమాలు బయలు దేరుతాయనటం పొరపాటు అవగాహన. కాకపోతే ఉద్యమంలో వున్న వాళ్లను చైతన్యం చేయటం ద్వారా – ఆ ఉద్యమ వేగానికి కవిత్వం కొంతవరకు సహాయాన్ని అందించవచ్చు. ఉద్యమం–కవిత్వం – ఉద్యమం ఇదీ క్రమం.**

మోదుగుపూల మీద ఒట్టేసి
సామాన్యుడి మీద ఏ అరాచక
ఉల్కాపాతం దాడి చేయకుండా
ప్రాణాలు ఫణం పెట్టి
పోరాడాలని వుంది

దాదాపు అన్ని కవితలను నిర్దిష్టమైన ఎత్తుగడతో, స్పష్టమైన వ్యూహంతో నడిపిస్తాడు కవి. త్రిపురనేని మధుసూధనరావు చెప్పినట్టు – వస్తువు పదచిత్రాల్లో వుండటం వచన కవిత్వ రూప లక్షణం. వచన కవితా రూపం దెబ్బతినకుండా పదచిత్రాల్ని ఒకదాని వెంట ఒకటి పేర్చుకుంటూ వస్తువు స్పష్టంగా అభివ్యక్తమయ్యేలా తీర్చిదిద్దటం సూరారం శంకర్ ప్రత్యేకత. ఒక సందర్భంలో మాటలకు పరువూ, బరువూ ఉంటాయన్నాడు శ్రీశ్రీ. మాటల పరువూ, బరువులు తెలిసిన కవి సూరారం శంకర్. అందుకే ప్రతి కవిత వొక చెక్కిన శిల్పంలా అనిపిస్తుంది.

కవిత్వ నిర్మాణ రహస్యాలు బాగా తెలిసిన (ఆయన తన మాటలో కొంత నిర్మాణపరమైన చర్చ చేశాడు) సూరారం శంకర్ కవిత్వంలో ప్రధానంగా మాట్లాడుకోవల్సింది శిల్పం గురించి. ఈ కవిది విలక్షణమైన శిల్పం. కవిత, కవితకీ శిల్పం మారుతుందన్న సంగతి నిజమే కాని – అన్ని కవితల్లోనూ శిల్పానికి తాత్విక గాఢత తోడవటం ఇందులోని విలక్షణత. నిజానికి తాత్వికత వస్తువుకు సంబంధించినదే అయి వున్నప్పటికీ – అది వ్యక్తమయ్యేది శిల్పంలో భాగంగా కాబట్టి కొంత శిల్ప సంక్లిష్టతకు అవకాశం ఏర్పడింది. ఇతరేతర కారణాల వల్ల కొన్ని సందర్భాల్లో శిల్పం భావవాదానికీ దారితీసింది. దయ/జాలి/క్షమ/ప్రేమ/దుఃఖం/బాధ/సంతోషం/ధిక్కారం/బహుశా మనల్ని సచేతన పర్చటంలో/దేవుడు వాడుకున్న మూల పదార్థాలు అయి వుంటాయి – అందుకే మనం కవులం అయ్యాం...! అని అంటున్నప్పుడు కవి దృక్పథాన్ని నిర్దేశించిన అంశాలలో భావవాదం కూడా వుందన్న సంగతి స్పష్టంగా అర్థమవుతుంది – శిల్పంలో కనిపించే భావవాదానికి సూరారం దృక్పథంలోని వైరుధ్యాలు కూడా కారణమే.

ఈ సంకలనానికి ముందుమాటలు రాసిన ఇద్దరు ప్రసిద్ధుల్లో (సి. హెచ్. మధు, డా॥అమ్మంగి వేణుగోపాల్) ఎవరూ శిల్ప చర్చ చేయలేకపోయారు. బహుశా! ఈ కవిత్వమే వాళ్ళను వశం చేసుకొని మాట్లాడించకుండా చేసి వుంటుంది. అలాంటి సమ్మోహన శక్తి ఈ కవిత్వానికి వుంది కూడా! దాన్నుంచి బయటపడి నిజాయితీతో కవిత్వాన్ని అంచనా కట్టటమే విమర్శకులు చేయవలసిన పని. సి. హెచ్. మధు తన ముందుమాటలో "శంకర్ లాంటి వారు సెజ్‌లకు వ్యతిరేకంగా, కవిత్వం వ్రాసారు కనుక సెజ్‌లకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు వెల్లి విరిసాయి" అన్నాడు. కవిత్వాలకు ఉద్యమాలు రావని ఏనాడో రాశారు. ఉద్యమాల ద్వారా ప్రభావితమైన కవి – ఆ ప్రభావంతో కవిత్వం రాస్తాడు కాని కవిత్వం రాయటం వల్లనే ఉద్యమాలు బయలు దేరుతాయనటం పొరపాటు అవగాహన. కాకపోతే ఉద్యమంలో వున్న వాళ్లను చైతన్యం చేయటం ద్వారా – ఆ ఉద్యమ వేగానికి కవిత్వం కొంతవరకు సహాయాన్ని అందించవచ్చు. ఉద్యమం–కవిత్వం – ఉద్యమం ఇదీ క్రమం.


త్రిపురనేని మధుసూధనరావు చెప్పినట్టు – కవికి ప్రపంచ పురోగమనం కారణం అని చెప్పక కవే ప్రపంచ పురోగమనానికి కారణం అని చెప్పడం కాల్పనిక దృక్పథమే. ఇక్కడ కవిస్థానంలో కవిత్వాన్ని వుంచినా, ఈ ఉద్దేశంలో ఎలాంటి మార్పూ వుండబోదు. అయితే ఈ కాల్పనిక దృక్పథాన్ని దాటి స్పష్టమైన భౌతికవాద పునాది మీద నిలబడితే తప్ప – కవికైనా, విమర్శకునికైనా ఎలాంటి తాత్విక గందరగోళాలు ఉత్పన్నమయ్యే సమస్య వుండదు.

◆

## కవిత

# చౌరస్తా

ఎన్.వి. రత్నశర్మ
9866376050



ఆ చౌరస్తా
పేపర్ బోయ్స్ హడావిడితో నిద్రలేస్తుంది
సూర్యుణ్ణి బుజానికెత్తుకుని
ఉత్సాహంగా తమ 'అడ్డా'కు
చేరుకునే కూలీలతో
బద్ధకాన్ని వదిలించుకుంటుంది

బారెడు పొద్దెక్కేసరికి
యూనిఫారంతో కవాతు తొక్కే సైనికుల్లా
పిల్లలు పాఠశాలలకు క్యూ కడుతుంటారు

అక్కడో అడుక్కునే ముసలోడు
మనుషుల దయా వర్షం కోసం
పొద్దస్తమానం ఎదురుచూస్తూ
పడిగాపులు కాస్తుంటాడు
వాహనాలు తమ తమ లక్ష్యాలను చేరుకోటానికి
ఒకటే ఉరుకులు, పరుగులు

ఎప్పుడన్నా రెండు వాహనాలు ఢీ కొని
రక్త స్నానం చేసే రాదారికి
ప్రత్యక్ష సాక్షి ఆ చౌరస్తా

పగలంతా సూర్యుణ్ణి బుజాన మోసిన కూలీలు
సాయంత్రానికి దించేసి
కాస్త బడలికతోనో
కాసింత మత్తుగానో
ఇంటికి పోతుంటారు
పేపర్‌బోయ్స్ హడావిడితో నిద్రలేచిన ఆ చౌరస్తా
ఎప్పుడో బాగా పొద్దుపోయాక కానీ
నిద్రకుపక్రమించదు!
మరో ఉదయాన్ని
సరికొత్తగా మొదలు పెట్టాలని స్వప్నిస్తూ......

---

# అదే మరి...

పి.ఎన్. మూర్తి
8498084577




ఓ అపరిచిత హృదయం కోసం
తహతహలాడిపోతాడు
ఓ అనిర్వచనీయమైన స్నేహం కోసం
ఆరాటపడతాడు
ఆ నవ్వుల పువ్వుల పుప్పొడి తనదేనని
తనువెల్లా పులకించిపోతాడు
ఆ వదన ఫలకముపై బొట్టుబిళ్ళ
తానెట్టాలని తెగమురుస్తాడు
తనలో ఆమె ప్రతిబింబాన్ని అణువణువునా
ఆవిష్కరించుకొని ఆనందిస్తాడు
ఆమె గతకాలపు చీకట్లను తరిమేసి
రవికిరణం తానవ్వాలని తపిస్తాడు
ఓ కొత్త జీవితాన్ని ఆమెకు అందించాలని
అడుగడుగునా ఆరాటం ప్రదర్శిసాడు
ఆమె ఏనాటికి ఒంటరి కారాదని
తనని తాను ఓదార్చుకొంటాడు

తనగుండె గూటిలో కరుణామయిగా
తన జీవిత రంగస్థలంపై అరుణామయిగా
ఆమెను ఆనందడోలికలలో ఊరేగిస్తాడు
కలల స్వర్గదామంలో ఆమెతో విహరిస్తాడు
దుబుక్కున మంచంపై నుండి దొర్లి
ధబేలున క్రిందపడి కలచెదిరిందని
కలతచెంది రోదిస్తాడు... అదే మరి...

---

## పరిశీలన

# కలాలకు సంకెళ్ళు




***సాధారణంగా సెన్సార్‌షిప్ అంటే పాలకులు, మత ఛాందసవాదులు తమకు తాము కొన్ని నియమ నిబంధన లేర్పర్చుకొని, దానికిలోబడని వాళ్ళని నియంత్రించడమన్న మాట. ఆ విధంగా తమ నియమాల్తో విభేదించే సృజనాత్మక రూపాల్ని కఠినంగా నిషేధిస్తుంటారు. వాళ్ళు కొన్ని నైతిక, మేధోపరమైన సూత్రాల్ని ఏర్పర్చి సాహిత్యంలో వాస్తవ, కాల్పనిక ప్రక్రియలపైన తమ తీర్పును ప్రకటిస్తుంటారు.***

**- ఉదయమిత్ర**
**9985203376**

*సుప్రసిద్ధ రచయిత డా॥ శామ్యూల్‌జాన్సన్ గురించి ఓ కథ చెబుతుంటారు. 18వ శతాబ్దంలో ఆయన తన అసిస్టెంట్ బెన్‌జాన్సన్ సహకారంతో ప్రతిష్ఠాత్మకమైన ఇంగ్లీషు నిఘంటువును రూపొందించడాన్కి పూనుకున్నాడు. ఆ సందర్భంగా ఆయన ఇంటి (Fleet Street) కి కొందరు కులీనులైన లండన్ స్త్రీలు వొచ్చారట.* వొచ్చి, అతని నిఘంటువులో అశ్లీలపదాలు చేర్చనందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పారట. అందుకా మహనీయుడు నవ్వి, "నేను Miss అయిన (అశ్లీల) పదాలపట్ల మీకున్న శ్రద్ధకు ధన్యవాదాలు" అన్నాడట. చూడడానికి తమాషాగా అన్పించినా ఇది జ్ఞానానికీ, సెన్సార్ షిప్‌కీ గల చిక్కుముడిని తెలియజెబుతుంది. సాధారణంగా సెన్సార్‌షిప్ అంటే పాలకులు, మత ఛాందసవాదులు తమకు తాము కొన్ని నియమ నిబంధన లేర్పర్చుకొని, దానికి లోబడని వాళ్ళని నియంత్రించడమన్న మాట. ఆ విధంగా తమ నియమాల్తో విభేదించే సృజనాత్మక రూపాల్ని కఠినంగా నిషేధిస్తుంటారు. వాళ్ళు కొన్ని నైతిక, మేధోపరమైన సూత్రాల్ని ఏర్పర్చి సాహిత్యంలో వాస్తవ, కాల్పనిక ప్రక్రియలపైన తమ తీర్పును ప్రకటిస్తుంటారు.


చరిత్రలో అనేక ప్రసిద్ధ గ్రంథాలు ఈ కోవలోనే నిషేధించబడ్డాయి. అత్యంత ప్రసిద్ధి పొందిన "యులిసెస్" నవల అతి తీవ్రమైన నిషేధానికి గురైంది. ఆ పరిస్థితుల్లో దానిని ప్యారిస్ వీధుల్లోకి దొంగతనంగా తీసుకురావాల్సి వొచ్చింది. 1933లో అమెరికాలోకి ఆ నవల ప్రతుల్ని తేవడానికి ఓడ మీద స్మగుల్ చేస్తున్నప్పుడు కస్టమ్స్ అధికారులు దానిని సీజ్ చేశారు. ఇప్పుడు అదే జేమ్స్ జాయిస్ నవల "యులిసెస్" ప్రపంచంలో అత్యధిక ప్రజాదరణ గల్గిన వాటిల్లో ఒకటిగా పరిగణించబడ్తోంది. (వ్లాదిమీర్ నోబొకోవ్ రాసిన నవల "లోలితా"కు కూడా ఇదే గతిపట్టింది. దానిని 1955లో బ్రిటిష్ కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు.)

"యులిసెస్" నవలను 'అశ్లీలత, అస్పష్టత' అనే రెండు భిన్నమైన, వివాదాస్పదమైన కారణాలతో నిషేధించారు. జేమ్స్ జాయిస్ తన నవలలో శారీరక ధర్మాలు, శారీరక సుఖాలను వర్ణించి, ఆనాటి క్యాథలిక్కుల సెంటిమెంట్లను గాయపర్చడమే గాక, తన అస్పష్టమైన కథా కథనంతో పాఠకుల్ని సైతం అయోమయంలో పడేశాడు. ఆ విధంగా ఆయన సాంప్రదాయబద్ధమైన సెన్సార్ షిప్‌ను గందరగోళపర్చడంతో, ఆయన విమర్శకులకు సైతం తాము దేని మీద దాడి జేస్తున్నారో తెలీకుండాపోయింది.

మరోవైపు, మానవ జీవితంలోని విషాదాన్ని అద్భుతంగా చిత్రీకరించిన నవలా రచయిత థామస్ హార్డీ నవల "జ్యూడ్ ది అబుస్క్యూర్" Jude the obscure 1985) లిఖిత ప్రతులను ఇంగ్లాండ్‌లోని వేక్‌ఫీల్డ్‌కు చెందిన బిషప్, పబ్లిక్‌గా కుప్పబోయించి, తగుల బెట్టించాడు. సాల్మన్ రష్దీ నవల "శాటానిక్ వర్సెస్" గురించి తెల్సిందే.. అది ఏకంగా ఆయెతుల్లా ఖొమైనీ ఆగ్రహానికి గురై, ప్రేమికుల రోజునాడు ఆయన మీద 'ఫత్వా' విధించబడ్డది. పై రెండు నవలలు మతపరమైన అంశాల కింద నిషేధించబడితే, "యులిసెస్" మాత్రం నైతిక, మేధోపరమైన అంశాల కింద నిషేధించబడ్డది.

చరిత్రలో అన్ని సాహిత్య ప్రక్రియల్లో, మొట్టమొదట

నిషేధించబడ్డది ''నాటకం'' అనే విషయం ఆశ్చర్యమనిపిస్తది. ఇంకా లోతుల్లోకి పోతే, అది నిషేధించబడ్డ తీరు మరింత ఆశ్చర్యవరున్నది. చారిత్రక ఆధారాల ప్రకారం క్రీ.పూ. 411లో గ్రీకు నాటక రచయిత అరిస్టోఫేయిన్ రచించిన "లైసిస్ట్రాటా" అనే కామెడీ నాటకం మొట్టమొదట నిషేధానికి గురైంది. ఈ నాటకంలో కథా నాయికదే ప్రధానపాత్ర. ఆ కాలంలో పెలిపోనీషియన్ యుద్ధాలు విరివిగా జరుగుతుండేవి. పురుషులు ఆ యుద్ధాలలో పాల్గొనడానికి సిద్ధమైపోతుండేవారు. ఎలాగైనా వాళ్ళను యుద్ధాలకు పోకుండా ఆపివేయాలన్నది ఆమె ఆకాంక్ష. దాని కోసం ఆమె స్త్రీలందరితో ఒక ఉద్యమం లేవదీస్తుంది. ఆమె సైనికుల భార్యల్ని కూడదీసి, వాళ్ళు తమ భర్తలకు లైంగిక సుఖం నిరాకరించాలని సూచిస్తుంది. ఈ నాటకం పురుషుల యుద్ధకాంక్ష (Military heroism)ల మీద తీవ్రంగా విరుచుకుపడడమే గాక, "బలవంతపు బ్రహ్మచర్యం" ద్వారా పురుషులు దిగివొచ్చి, యుద్ధాల్ని మాని, భార్యల్తో సమాధానపడ్తారని సూచిస్తుంది. ఇది ఆ కాలంలో పెద్ద దుమారమే రేపి, నిషేధానికి గురయ్యింది. దీనికి గల కారణాలు విస్పష్టమే... ఈ నాటకంలో స్త్రీలు, పురుషులకన్నా ధృడ చిత్తులై ఉండడమే గాక వాళ్ళకు పురుషుల మీద లైంగిక నియంత్రణ ఉన్నట్లుగా చిత్రీకరించబడింది. తద్వారా పురుషులు తమ శారీరక సుఖాల కోసం భార్యా విధేయులై ఉంటారని హాస్య ధోరణిలో చెప్పినప్పటికీ, అది పురుషాధిక్య సమాజానికి మింగుడు పడలేదు... దీనికి పాలక వర్గం కూడా తోడై, ఆ నాటకం నిషేధానికి గురైంది. ఆనాటి సమకాలీన సమాజంలో అదొక సరిపడని అంశం (Misfit) అయిపోయి, ప్రజాగ్రహాన్కి గురైంది.




> ***ఒకప్పుడు అనాగరికంగా, చదువదగనివి (Unreadable) గా అన్పించిన సాహితీ ప్రక్రియలు కాలాన్ని దాటివొచ్చి, నేడు గొప్ప రచనలుగా ఎందుకు పరిఢ విల్లుతున్నాయి?***

ప్రసిద్ధనాటక రచయిత ఇబ్సన్ రాసిన నాటకం 'ఘోస్ట్స్' (Ghosts) కు కూడా ఇదే గతిపట్టింది. ఈ నాటకంలో వ్యభిచారం, సుఖరోగాల గురించి సూటిగా వివరించడంలో లార్డ్ చేంబర్లేన్ (ఇంగ్లండ్) 1881లో దానిని నిషేధించాడు. ఇదే వ్యక్తి ఎడ్వర్డ్ బాండ్ రాసిన "సేవ్డ్" (Saved) అనే నాటకాన్ని 1965లో నిషేధించాడు. ఇందులో ఒక పాపను, బ్రిటిష్ కౌన్సిల్‌కు చెందిన కొందరు వ్యక్తులు రాళ్ళతో కొట్టి చంపుతారు. ఆ పసిపాప మరణించే తీరు ద్వారా, సమాజంలోని సంపన్న వ్యక్తుల దౌర్జన్యాన్ని ఎత్తి చూపుతాడు రచయిత. సహజంగానే ఈ నాటకం ఆనాటి పాలకుల ఆగ్రహానికి గురైంది. అయితే ఈ నిషేధం పాలకవర్గాలకు ఆనందమిచ్చినా, ప్రజలకు ఆగ్రహం తెప్పిచ్చింది.

కాల్పనిక సాహిత్యంలో అభూత కల్పనలూ, అలంకారాలూ ఉండడం సహజం. అయినా ఎందుకవి వ్యక్తుల సమూహాల ఆగ్రహాన్కి గురవుతుంటాయి? ఒకప్పుడు అనాగరికంగా, చదువదగనివి (Unreadable) గా అన్పించిన సాహితీ ప్రక్రియలు కాలాన్ని దాటివొచ్చి, నేడు గొప్ప రచనలుగా ఎందుకు పరిఢ విల్లుతున్నాయి? షేక్స్పియర్, సెర్వాంటెస్, పికాసో, ఠాగూర్ వంటివారు మొదట విమర్శింపబడ్డవారే... వారు సృజించిన వాటిని సంకుచితమనీ, అపరిపక్వమనీ, అశ్లీలమనీ ఆనాటి సమకాలికులు ఈసడించుకున్నారు.. కాని వాళ్ళు కాలాన్ని దాటి వొచ్చి మహామేధావులుగా, కళాకారులుగా సమాజంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకోగలిగారు.

జేమ్స్ జాయిస్ రాసిన 'యులిసెస్' నవల పక్కనబెడితే, క్రిస్టియానారోజెట్టీ రాసిన దీర్ఘకవిత "గోబ్లిన్ మార్కెట్ (1982)ను కొందరు పిల్లల కథగా భావిస్తే, కొందరు అశ్లీల కవితగా భావించారు.

అసలు ప్రజలెందుకు కొన్ని కల్పనా ప్రక్రియల్ని సంతోషంగా స్వీకరించి, మరికొన్నింటిని తిరస్కరిస్తున్నారు? ఎందుకు "హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్" కథల్ని సమాదరించి, "యాంజెలాకార్టెల్" కథల్ని తిరస్కరిస్తున్నారు? కల్పనా సాహిత్యాలలో సుఖాంతాలూ, దుఃఖాంతాలూ ఉన్నప్పటికీ, ఒక్కోసారి కామెడీలు సైతం కోపం తెప్పిస్తున్నాయంటే, దానికి కారణాలు మరింత లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. అరిస్టోఫెన్ రాసిన నాటకం "లైసిస్టాటా"ను దీనికి మొట్టమొదటి ఉదాహరణగా చెప్పుకోవాలి. దీనితోబాటు రొబేలియా రాసిన "గార్గంటువా అండ్ పాంట గ్రూయేల్", మోలీర్ రాసిన "టార్టుఫే", సింజ్ రాసిన "ప్లేబాయ్ ఆఫ్ ద వెస్టర్న్ వరల్డ్" వంటి గొప్ప రచనలు మత ప్రాదికన నిషేధించబడ్డవే... ఈ మూడు గ్రంథాల్లోని సాంఘిక, నైతిక, శారీరక సంబంధ అంశాల్ని ఆనాటి మత ఛాందసవాదులు తమ సంకుచిత దృక్పథంలో చూసి వాటిని నిషేధానికి బలిజేశారు. వీటితో బాటు వాళ్ళకు కల్పనలో కనబడిన కఠిన సత్యం వాళ్ళ గుండెల్ని తాకి, వాళ్ళలోని కల్మషాన్ని ఎత్తిచూపింది. తత్ఫలితంగా కల్పనా ప్రక్రియల మీద దాడి చేయడంతో బాటు, వాటిమీద నిషేధం విధించి, దగ్ధం జేశారు. దీనికి మతంతోబాటు, రాజ్యం కూడా తోడయ్యింది.

పై ఉదాహరణల్ని లోతుగా పరిశీలిస్తే, సృజనాత్మకత లేనివాళ్ళే అనవసరమైన ఆందోళనలకు గురై, కల్పనల్ని మెచ్చుకోలేని ఒకానొక విద్వేషంలో చరిత్రలో అత్యంత విలువైన సాహిత్యాన్ని నిషేధించారని స్పష్టమవుతోంది. ◆

**కథ**

# ఒక రైతు ప్రార్థన

- ప్రసాదమూర్తి
8498004488



అనగనగా ఒక రోజు రెండు రాష్ట్రాల సరిహద్దు దగ్గర అనగనగా ఒక రైతు పురుగుల మందు తాగి చనిపోయాడు. బతికున్న రైతు కంటె చనిపోయిన రైతే రెండు రాష్ట్రాలనూ వణికించే వార్తగా మారిన నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. తెల్లారక ముందే ఈ వార్త సరిహద్దుకు ఒకవైపు పాలకపక్ష నాయకుడి చెవిలో పడింది. చాలా తర్జనభర్జనలే జరిగాయి. శవం ఒంటి మీద బట్టల్నిబట్టి.. రెప్పలు తెరిచే వున్న శవం కంటి కొసన వేలాడుతున్న దీనత్వాన్ని బట్టి.. వోవరాల్ గా శవం నుండి కొడుతున్న మట్టివాసన బట్టి అది తప్పనిసరిగా ఒక రైతు శవమే అని తేల్చుకున్నారు. కొంపదీసి ఏ గాలికో రైతు శవం మనవైపు కొట్టుకువస్తే చాలా ప్రాబ్లమ్ చాలా ప్రాబ్లమ్ అనుకుని, వెంటనే సదరు నాయకులవారు తన ఏలుబడిలో ఇలాంటివి జరగితే ఇంకేమైనా వుందా చాలా ప్రాబ్లమ్ చాలా ప్రాబ్లమ్ అని గొణుక్కుంటూ పలుకుబడినంతా ఉపయోగించి పక్కా ప్లాన్ వేశాడు. ఆ శవాన్ని సరిహద్దుకి అవతల వైపు పడేసే ఏర్పాటు చేశాడు. క్షణాల్లో రైతు శవం సరిహద్దు మార్చుకుంది. అటువైపు కూడా అధికార పక్షం నాయకుడొకరికి ఈ వార్త చెవిని సోకింది. ఆ చెవి నుంచి ఇంకో చెవికి అది ప్రయాణం చేసేంత టైమ్ కూడా ఇవ్వకుండా ఆ లీడర్ సారు ఆర్డర్ పాస్ చేశారు. మళ్ళీ రైతు శవం సరిహద్దు మారింది. అందరినీ వణికించే చలిరాత్రి ఈసారి మాత్రం తానే గజగజలాడిపోతూ నెత్తీనోరూ బాదుకుంటూ సరిహద్దు రేఖకి ఆవలా ఈవలా వలవలా ఏడ్చింది. సరే తెల్లారింది కూడా.

ఎవరెవరో జనం వస్తున్నారు. వాళ్లు పార్టీలు వారీగా చీలిపోయి వున్నారు. అటూ ఇటూ అందరికీ అది రైతు శవమేనన్నది కర్ణాకర్ణిగా రూఢి అయిపోయింది. కొందరు రైతు ఆనవాళ్ళకోసం వెదికారు. కొందరు రైతు కులం కోసం చూశారు. కొందరు రైతు మతం ఏంటో ఆరా తీశారు. కొందరు రైతు అక్కడివాడా ఇక్కడివాడా అన్న మీమాంసలో మీసాలు పీక్కున్నారు. సరిహద్దుకి అవతలా ఇవతలా జనం పోగయ్యారు. మీ వాడంటే మీ వాడని శవాన్ని బంతిలా అటూ ఇటూ చాలా సేపు విసురుకున్నారు. అలసిపోయాక శవాన్ని సరిగ్గా ఇరువైపులా గొడవ లేకుండా సరిహద్దులో వుంచారు.

ఇదంతా చూసిన రైతు ఆత్మకు చాలా చికాకు మొదలైంది. జనం మీద జాలికూడా కలిగింది. ఎప్పుడూ ఎవరి మీదా కోపం రాని రైతుకు అప్పుడు కూడా ఆ జనం మీద కోపం రాకపోవడం విశేషమేం కాదు. కాని జనాన్ని తనివితీరా తిట్టాలని రైతు ఆత్మ విశ్వప్రయత్నమే చేసింది. వీలు కాలేదు. అక్కడి నుంచి గాల్లో ఎటైనా ఎగిరిపోవాలనుకుంది. అంతలోనే ఒక సందేహం దేహం లేని ఆత్మను చుట్టుముట్టింది. వీళ్ళంతా కలిసి తనను ఏ రాష్ట్రానికి చెందిన వాడిగా ముద్ర వేస్తారో

కదా అన్నదే ఆ సందేహం. అయితే వీళ్ళ గొడవ తేలే లోగా ఏం చేయాలబ్బా అని తల గోక్కుంది. వచ్చింది..వచ్చేసిందో ఐడియా. తను చూడాల్సిన కొన్ని ప్రదేశాలు..తను పలకరించాల్సిన కొందరు మనుషులు..తను వినాల్సిన కొందరి మాటలు..తను అర్థం చేసుకోవాల్సిన కొన్ని స్పందనలు వున్నాయి. ఈ లోగా ఆ పని ముగించుకువద్దామని రైతు అనుకున్నాడు. అదేనండి రైతు ఆత్మ అనుకుంది.

ముందుగా ఒక వైపు రాష్ట్రం అసెంబ్లీలోకి ప్రవేశించింది. అక్కడ వాడివాడిగా తన మీదే చర్చ జరుగుతోంది.

"అధ్యక్షా ఇది మన పొరుగు రాష్ట్రం వారి కుట్ర. అక్కడ రైతు శవాన్ని కావాలనే మన రాష్ట్రంలో పడేయడానికి అన్ని పన్నాగాలు పన్నారు అధ్యక్షా! ఈ విషయంలో మాకు పక్కా సమాచారం వుంది. అయినా సరే రైతు పూర్వాపరాలు తేల్చడానికి ఒక నిజనిర్ధారణ కమిటీనిఏర్పాటు చేశాము అధ్యక్షా!"



ఈ మాటలు విన్న వెంటనే ప్రతిపక్షాలు తటాలున లేచాయి. "ఇది తమ బాధ్యత నుంచి తప్పించుకోడానికి పాలకపక్షం పన్నుతున్న కుట్రే గాని మరొకటి కాదు అధ్యక్షా" అని విపక్షాలు గగ్గోలు పెట్టాయి.

అధికార పక్షం మాత్రం తక్కువ తిందా. కౌంటర్ హంటర్లు ఝళిపించింది.

"అధ్యక్షా రైతు ఇక్కడే చనిపోయాడని అనుకుందాం. కాని అప్పుల బాధతో కదా ఆత్మహత్యకు పాల్పడేది? కొత్త ప్రభుత్వానికి పాత అప్పులతో సంబంధం ఏంటో గౌరవ ప్రతిపక్ష సభ్యులు తేల్చి చెప్పాలి. ఇదంతా పాత ప్రభుత్వాల పాపఫలితమే కదా అధ్యక్షా!"

'అవును! అవును!"అని సర్కారీ పక్షం నుంచి బల్లల మోత మోగింది.

"అబద్ధం! అబద్ధం!" అని విపక్షం నుంచి ఇంకా మోత.

"అధ్యక్షా వేరే రాష్ట్రాల్లో ఇంత కంటె ఎక్కువ మంది చనిపోతున్నారు. గౌరవ సభ్యులు గణాంకాలు తెలుసుకోవాలి. మీకు ఓపిక లేకపోతే మా మంత్రివర్యులు సదరు వివరాలు అందిస్తారు విని తరించండి" అని పాలకపక్ష ప్రతినిధి సెలవిచ్చారు. మంత్రి గారు లేచి నిలబడి వివరాల చిట్టా తీశారు. విపక్షం రణగొణ ధ్వని మధ్య ఆయనలా చదువుతూనే వున్నారు. ఏ రాష్ట్రంలో ఎందరు రైతులు చనిపోయారు, గతంలో ఏ సంవత్సరంలో ఎంతమంది ఆత్మహత్య చేసుకున్నారు, తమ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన మరణాలెన్ని? అసలు ఆత్మహత్యలెన్ని సహజమరణాలెన్ని, ఎన్ని సహజమరణాలను ఆత్మహత్యలుగా విపక్షాలు చిత్రీకరించాయి.. ఇలా సాగిన మంత్రిగారి గణాంకాల చిట్టా ఆంజనేయుడి తోకలా చుట్టుకుంటూ సభా భవనం మిద్దెను గుద్దుకుంది.

రైతు ఆత్మ అదిరిపడి ఇక్కడిక లాభం లేదని పొరుగు సోదర రాష్ట్రంలో అసెంబ్లీని సందర్శిద్దామని బయల్దేరింది. వెళుతూ వెళుతూ ఒక్కసారి అసెంబ్లీనంతా కలయజూసింది. ఆకాశంలో నక్షత్రమేదో కుప్పకూలినప్పుడు మనకు కనిపించే వెలుగుతో పోలిన సన్నటి పొరలాంటి వస్త్రం సభ్యుల మొహాలను రాసుకుంటూ పోయింది. అందరూ అవాక్కయ్యారు. ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని, అధికార పక్షం విపక్షాలను ఏదో కుట్ర జరిగిందన్నట్టు పరస్పరం అనుమానంగా చూసుకుని అంతలోనే సర్దుకుని రొటీన్ చర్చకు రెడీ అయ్యాయి.

పొరుగు రాష్ట్రంలోకి వెళుతూ వెళుతూ తనకి అప్పులు పెట్టిన షావుకారుగారు ఎలా వున్నారో చూసిపోదామని అనుకుంది. షావుకారు హాయిగా నిద్రపోతున్నాడు. ఆయన చుట్టూ కాగితాల కట్టల గుట్టలున్నాయి. రోజంతా మనం రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పనుల్లో మునిగిపోతాం. మనలాంటి వాళ్ళను ఆదుకోడానికి ఆయన ఇంకెంత కష్టపడుతున్నాడో కదా అని రైతు ఆత్మకు జాలేసింది. తనకు అప్పుపెట్టడమే కాదు..తాను అదిగో ఇదిగో అని అప్పు కట్టకుండా గడిపేస్తుంటే ఎందుకూ కొరగాని తన పొలాన్ని ఆయన పేర రాయించుకోడానికి ఎంత బాధపడ్డాడో కదా షావుకారు అని రైతు ఆత్మ కన్నీళ్ళు పెట్టకుంది. అంతెందుకు పెళ్ళాం పుస్తెల తాడు తెచ్చినప్పుడు అది తీసుకోడానికి ఆయన చేతులెంత తడబడ్డాయో ఇంకా రైతుకు గుర్తే వుంది మరి. కొంతైనా వడ్డీ డబ్బులు చెల్లించడానికి మిగిలిన కాడెద్దుల్ని అమ్మేయాలని సంతకు తీసుకు వెళుతుంటే షావుకారు వూరి కొసదాకా వచ్చి సాగనంపి జేబులో కొన్ని డబ్బులు కుక్కి ఆకలేస్తే కాఫీ తాగరా అని కండువాతో షావుకారు కన్నీరు తుడుచుకున్న దృశ్యం రైతు ఆత్మ తలచుకుని తలచుకుని కుమిలిపోయింది. పడుకున్న రైతు చుట్టూ కాసేపు ప్రదక్షిణలు చేసింది. కమ్మర కొలిమి దగ్గర గాలి తిత్తి పైకీ కిందికీ కదులుతున్నట్టు వూగుతున్న షావుకారు పొట్ట మీద కాసేపు కూర్చుంది రైతు ఆత్మ. ఈయన రుణం ఎలా తీర్చుకోవాలా అని ఆలోచించి ఆలోచించి పుణ్యాత్ముడు తనలాంటి వాళ్లకి ఎందరికో ఇలాగే ఆయన అప్పులు పెట్టి ఆదుకోవాలని..అంతటి ధర్మాత్ముణ్ణి దేవుడా నువ్వే కాపాడాలని భగవంతుణ్ణి ప్రార్థించింది. వెళుతూ వెళుతూ షావుకారు ఇంట్లో ఒక మూలన పడివున్న ఎరువులను, మందులనూ చూసింది. పంటకు పట్టిన పురుగుల్ని చంపలేని

## కవిత

మందు  కనీసం తననైనా చంపి రుణం తీర్చుకుందని ఒక ఎండ్రిన్ డబ్బాను చేతుల్లోకి తీసుకుని వాసన చూసి ఆహా బతుకు వాసన ఎలా వుంటుందో ఇన్నాళ్ళకి తెలిసింది కదా అనుకుని అక్కడి నుండి కదిలింది.

సమయం మించిపోతోందని అక్కణ్ణించి తటాలున ఎగిరి పొరుగురాష్ట్రం అసెంబ్లీలో వాలింది. అక్కడ కూడా సేమ్ సీన్ రిపీటవుతోంది. తన మీదే చర్చ జరుగుతోందని తెలుసుకుని రైతు ఆత్మ కొంచెం సంబరపడింది. కాని రాష్ట్రాలు వేరైనా డైలాగులు.. కొట్లాటలు..వాదోపవాదాలు..ఎత్తులూ పల్లాలూ సేమ్ టూ సేమ్ అనిపించి కించిత్తు విచారపడింది.  అయినా తనలాంటి ఒక అనామకుడి కోసం ఇందరు పెద్దలు అటూ ఇటూ ఇంత భీషణంగా యుద్ధానికి దిగడం ఆనందంగానే అనిపించింది. తనలాంటి బీదాబిక్కీ రైతుల కోసం ఇంత బెంగపడిపోతున్న ఇంతమంది బాబుల్ని గ్రాసంతో నిమిత్తం లేకుండా చల్లగా ఆదుకోవాలని..తన మరింతగా కొట్లాడటానికి వారికి మరింత స రైతు ఆత్మ దేవుణ్ణి వేడుకుంది.



వెంటనే తన మృతదేహం బయల్దేరింది. ఇరు రాష్ట్రాల ప్రజలు పడకుండా లెక్కలు తేల్చుకున్నారో లేదో ఒ అటు ప్రయాణం కట్టింది. వెళుతూ వె పొలాన్ని పలకరిద్దామని అక్కడ కాసేపు వాలింది. బీటలు వారిన పొలంలో కూర్చుని, తన కోసం శూన్యంగా చూస్తున్న తన భార్య కూడా కనిపించింది. ఒంటికి అంటిన మట్టిని స్నానం చేసి వదిలించుకోవచ్చు. జీవితం చుట్టూ గుండె చుట్టూ అంటిన మట్టి బంధాన్ని ఎలా వదిలించుకోవాలి? అదేమో కాని ఒక్క వేలిముద్రతో పొలం జంజాటం వదిలించుకున్నాడు. కాని ఒక్క పసుపుతాడుతో ఒంట్లోని నరాలనన్నీ తన చుట్టూ చుట్టేసుకున్న పెళ్ళాన్ని ఎలా వదిలి పోవాలో రైతుకు  అర్థం కాక  ఎంత సతమతమయ్యాడో. అయినా తప్పలేదు. తననే నమ్ముకున్న భార్యను  ఒంటరిగానే  వదిలేసి ఏమీ చెప్పకుండానే వెళ్ళిపోయాడు. ఇప్పుడు భార్యను పొలంలో ఒంటరిగా చూస్తే రైతు ఆత్మకు బోరున ఏడవాలనిపించింది.  భార్య ఖాళీ ఖాళీ కళ్ళలోకి..అక్కడి నుండి ఆమె గుండెల్లోకి..అక్కడి నుండి ఆమె శరీరం లోపలా బయటా అంతటా ఓసారి రైతు ఆత్మ కలతిరిగింది. ఎక్కడా ఏమీ తగల్లేదు. ఒకటే శూన్యం. వచ్చే జన్మలోనైనా ఒక గొప్ప ధనవంతుడైన రైతుని ఆమెకు భర్తగా ప్రసాదించమని రైతు భగవంతుణ్ణి వేడుకున్నాడు.

తిరుగు ప్రయాణం కడుతూ ఒక సారి కలయజూసింది. ఎండిన బోరు కనిపించింది. అందులోకి చొరబడి బోరులో అడుగుకంటా వెళ్ళింది.  అడుగున నీళ్ళు వుండే వుంటాయని, తనకే నీళ్ళందలేదని రైతు నమ్మకం. కనీసం ఆ నీళ్ళను కళ్ళ చూద్దామని రైతు ఆశ. ఆత్మ లోపల్లోపలకి..ఇంకా లోపలికి వెళుతూనే వుంది. భూమి అడుగు పొరల్లో కూడా ఎండమావులుంటాయా అని రైతుఆత్మ ఆశ్చర్యపోయింది. నీళ్ళు కనపడుతూనే వున్నాయి కాని తనకి తడి తగలటం లేదు. అయినా తనిప్పుడు చనిపోయింది కదా..బహుశా నీళ్ళ తడి తనను తాకదేమో అనుకుని పైకి వచ్చేసింది. అటూ ఇటూ దిక్కులు చూస్తే కరెంటు స్తంభం, దాన్నుంచి ఒక వైరు పొడవుగా సాగి పొలం దగ్గరున్న చిన్న కరెంటు మీటర్ దాకా వచ్చింది. మీటర్ దగ్గరకు వెళ్ళింది. మీటరు జోరుగా తిరుగుతోంది. ఆశ్చర్యంగా వుంది. కరెంటు కళ్ళజూడ్డమే గగనమైన రోజులు తాను గడిపాడు. తాను పోయిన తర్వాతైనా కరెంటుకు తన మీద జాలికలిగిందన్న మాట అనుకుని నీళ్ళకోసం ఏర్పాటు చేసిన మోటరు స్విచ్చి నొక్కింది. కాని పంపునుండి ఒక్క బొట్టు కూడా పడలేదు. ఏందబ్బా అనుకుని కరెంటు తీగ పట్టుకుని తనకేమీ షాక్ కొట్టలేదు. ఏమో తనిప్పుడు తనకంతా ఇలాగే వుంటుందేమో అనుకుని ఆత్మ సర్రున బయల్దేరి గాల్లో ఎగురుతూ చూసింది. భార్య కళ్ళలో ఇప్పుడు సుళు పించి నిట్టూర్చింది.  యథాప్రకారం తన వెళ్ళి అందులోకి దూరి జనం మాటలు విషయం ఒక కొలిక్కి రాలేదు. సరిహద్దుకి ఆవలా ఈవలా  రాష్ట్రస్థాయి నాయకులు, స్థానిక నాయకులు శవం మాది కాదంటే మాది కాదని కొట్టుకుంటూనే వున్నారు. రైతు ఆత్మ వారి  చుట్టూ ప్రదక్షిణ చేస్తూ నవ్వుకుంటూనే వుంది.

జర్నలిస్టుల హడావుడి ఇక అంతా ఇంతా కాదు.  శవం ఎటు పక్కదో తెలిస్తే గబగబా వార్తలు అందించ వచ్చని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. శవం అటుదని తేలితే ఒక వార్త..ఇటుదని తేలితే ఒక వార్త ముందే రాసి వుంచుకున్నారు. ప్రస్తుతానికి శవం మూలాలు ఇంకా తెలియటం లేదన్న బ్రేకింగ్ న్యూస్ మాత్రం అప్ డేట్ చేసి పంపిస్తున్నారు.  కొన్ని ఛానళ్ళయితే స్టూడియోల్లో వైద్య నిపుణుల్ని..డి.ఎన్.ఏ. పరీక్షల నిపుణుల్ని కూర్చోబెట్టి చర్చోపచర్చలు కొనసాగిస్తున్నాయి. మనిషి శవాన్ని బట్టి అతను ఏ ప్రాంతం వాడో తెలియజేసే డి.ఎన్.ఏ. పరీక్షలు ఇంకా అందుబాటులోకి రాలేదని నిపుణులు వాపోతున్నారు. ఉత్కంఠను అలాగే కొనసాగించడానికి యాంకర్లు అష్టవంకర్లు తిరుగుతూ నానా యాతనా పడుతున్నారు. హృదయ స్పందనకు కూడా ఒక ప్రాంతం అంటూ వుంటుందా అన్నది పాపం అమాయక రైతు ఆత్మకు అర్థం కాలేదు.  చనిపోయిన రైతు అంటే వార్తాహరులకు ఇంత మమకారమా అని  రైతు ఆత్మ ఎంతగానో మురిసిపోయింది. ఒక రైతు గురించి ఇంతగా తపనపడుతున్న వీరందరినీ చల్లగా చూడమని దేవుణ్ణి

ప్రార్థించింది.

ఇంతలో రైతు ఆత్మకు ఒక చెట్టు పక్కన ఒక మనిషి కన్నీరు మున్నీరై ఏడుస్తున్నట్టు కనిపించి అయ్యో తన కోసం ఇంతగా రోదిస్తున్న అమాయకుడు ఎవరా అని పరిశీలించింది. వినగా వినగా అర్థమైంది ఏమంటే అతనో గాయకుడు. ప్రజల ఈతిబాధలే తన పాటలుగా మలిచే ప్రజాకవి. శవం అటు పక్కదని తేలితే ఎంతో గొప్పగా రాయొచ్చని, కాని ఖర్మకాలి ఇటుపక్కదని తేలితే ఏమీ రాయలేం కదా అని, అటా ఇటా తన పాట ఎటని తేల్చుకోలేక తెగని ఉత్కంఠను తట్టుకోలేక బోరుమని విలపిస్తున్నాడు. గడ్డి పువ్వు గాలికి కందినా గాయపడే హృదయం గలవాడు. ఈయనకెందుకింత కష్టం వచ్చిందిరా భగవంతుడా అని రైతు ఆత్మ దీనంగా మూలిగింది. అలాగే రైతుల మీద కథలు రాసేవారు..రైతు మీద బొమ్మలు గీసే వారు.. రైతు మీద వ్యాసాలు రాసేవారు..అక్కడే పక్కపక్కన కూర్చుని ఒకరిని ఒకరు చూసుకుంటూ కలాలను..కాగితాలను పట్టుకుని పనిలోకి ఎప్పుడుదిగుదామా అని రైతు శవం దిశగా చూస్తూనే వున్నారు. ప్రపంచంలో ఎక్కడా ఏ కళాకారుడికీ ఇంతటి సంకటం రాకుండా చూడమని దేవదేవుడికి నివేదించుకుంది రైతు ఆత్మ.




ఇంకా అక్కడే వుంటే తన శవాన్ని ముక్కముక్కలుగా చేసి మూలాలు వెదికే పనిలో వీళ్ళంతా పడతారని అది తన కళ్ళరా చూసి తట్టుకోలేనని రైతు ఆత్మ భావించి ముందుకు ఎగిరింది. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్టు.. ఎటో చటుక్కున ఎగిరిపోయింది.

రైతు ఆత్మ విమానాశ్రయంలో వాలింది. అక్కడ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ కొలువుదీరినట్టు కూర్చున్నారు. ఎవరి వందిమాగదులు వారి చెంత నిలబడ్డారు. వాళ్ళిద్దరూ అక్కడకు రాకముందే రెండుమూడు గంటలపాటు వాస్తునిపుణుల రాకతో పెద్ద కోలాహలమే జరిగింది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఏ ప్రదేశంలో కూర్చోవాలి..ఎటు తిరిగి కూర్చోవాలి..వారికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విమానాలు ఏ దిశగా ల్యాండవ్వాలి.. అన్నీ కూలంకషంగా వాస్తు నిపుణుల బృందాలు పరిశీలించాయి. ఆ తర్వాతే అక్కడకు ముఖ్యమంత్రుల రాక జరిగింది. వాళ్ళిద్దరూ ఎయిర్ పోర్టులోకి ప్రవేశించేటప్పుడు ఒకరికొకరు ఎదురు పడకుండా.. కూర్చొనేటప్పుడు ఒకరికొకరు కనిపించే అవకాశం లేకుండా అన్నీ వాస్తు ప్రకారమే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇద్దరూ చెరో వైపూ నిండుగా కూర్చున్నారు. ఒకరు సింగపూర్ విమానం కోసం, మరొకరు జపాన్ విమానం కోసం వేచి వున్నారు. వారికి పక్కనే కొందరు మంత్రులు..కొందరు అధికారులు ఏవో కాగితాల కట్టలు పట్టుకుని నిలబడ్డారు. వున్నట్టుండి వారు ముఖ్యమంత్రుల చెవుల్లో ఏదో చిలుకుతున్నారు. విషయం చాలా సీరియస్సే మరి. సింగపూర్ లోనూ జపాన్ లోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారా? చేసుకుంటే ఏ విధానాలు అవలంబిస్తారు? వారి సమస్యను ఆ ప్రభుత్వాలు ఎలా డీల్ చేస్తాయి ? అని పరిశీలించడానికి అత్యున్నత శాసనసభాపక్ష కమిటీతో పాటు ముఖ్యమంత్రులు హుటావుటిన బయల్దేరారు. ఉదయం సభలో గందరగోళం చూసి వెంటవెంటనే నిర్ణయాలు చేసి సాయంత్రం ఫ్లయిట్ కే బయలెల్లారు.

రైతు ఆత్మ విమానాశ్రయంలోకి ఎంటరయ్యిందో లేదో ఒక గొప్ప మెరుపు మెరిసినట్టు..వెంటనే చీకటి అలముకున్నట్టు..ఆ వెంటనే వాన కురిసినట్టు..వెనువెంటనే భూమి కంపించినట్టు..ఆ వెంటనే మంటల మాదిరి ఎండలు కాచినట్టు అక్కడున్న వారందరికీ అనిపించింది. ఎవరికీ అర్థంకాక ఎవరినీ ఏమీ అడగడానికి రాక అలా వుండి పోయారు. అంతలో విమానాలు రెండూ ఒకేసారి రన్ వే మీద చప్పుడు చేసుకుంటూ దిగినట్టు అనిపించి అంతా కాస్త శాంతించారు. రెండు టీముల వారూ రెండు విమానాల్లో ఆసీనులయ్యారు. రైతు ఆత్మ రెండు విమానాల్లోనూ ఒకేసారి ప్రవేశించింది. ఇద్దరు ముఖ్యమంత్రులూ ఒకసారి చుట్టూ పరికించారు గర్వంగా. ఉన్నట్టుండి సీట్లన్నీ ఖాళీగా కనిపించి ఉలిక్కిపడ్డారు. తదేకంగా చూశారు. ఖాళీ సీట్లలో ఏదో వెలుగుతో కూడిన నీడలాంటిది మెదలడం కనిపించి చేబుల్లోంచి రుమాళ్ళు తీసి చెమటలు పట్టిన ముఖాలు తుడుచుకున్నారు. ఇంతలో ఎయిర్ హోస్టెస్ డ్రైవర్ సీటువైపు నిలబడి ప్రయాణికులకు జాగ్రత్తలు చెప్పసాగింది. ముఖ్యమంత్రులు చెవులు రిక్కించి విన్నారు. ఎంత విన్నా రైతులు..వారి మరణాలు.. ఆత్మహత్యలు.. జాగ్రత్తలు ఇవే వినపడుతున్నాయి. అంతలోనే ఎయిర్ హోస్టెస్ కూడా తెల్లని నీడలా మారిపోయింది. ఇద్దరూ భయపడ్డారు. గట్టిగా అరుద్దామనుకున్నారు. కాని నోళ్ళు పెగల్లేదు. రైతు ఆత్మ ఇక వెళదామని నిర్ణయించుకుంది. తన కోసం విదేశాల ప్రయాణం కట్టినవారినందరినీ పేరుపేరునా ఆశీర్వదించింది. ఒక రైతు కోసం ఇంతగా కష్టపడే ఇలాంటి ప్రభువులనే మళ్ళీ మళ్ళీ అధికారంలోకి వచ్చేట్టు చూడమని దైవానికి మొక్కుకుంది. అప్పుడు విచిత్రంగా రైతు కళ్ళు చెమర్చాయి. విమానాలు, వాటిలో ఆసీనులైన ఏలినవారు ఒకేసారి ఊపిరి పీల్చుకున్నారు.

## మనదారి

- నవీన్
95537 37304




అతడిదొక దారి
ఆమెదొక దారి
భయ్యాదొక దారి
పాల్ దొక దారి
పాపయ్యదొక దారి
అందరూ
ఒకరి చేతిలో
గాయపడ్డవాళ్ళే
విడి విడి దారుల్లో
వేల సంవత్సరాలు
వేల మైళ్ళు ప్రయాణించినా
ఎడారినే చేరారు

లేదూ....
దాహం తీర్చని ఒక్క ఒయాసిస్సుతోనే
తృప్తి పడ్డారు
కాసేపు ముందుకు పోతారు
మళ్ళీ వెనక్కు వస్తారు
లోలకప్రయాణ అయోమయంలో
ఆగమాగమై
విషపాత్రలనే ఆశ్రయిస్తారు
అందరిదీ ఒకే దారై
సజీవధారై
మనదారై పయనిస్తేనే
గాయాల్లేని ప్రపంచం

## దశలు

- బి. పాండురంగారెడ్డి
9347038626



వానాకాలంలో
కెరటాలు కెరటాలుగా తెరలి
ఉప్పొంగి వరదలెత్తిన నది

శీతాకాలంలో
ఒడ్డుల్లో ఒదిగిపోయి
జోరు తగ్గి
నిమ్మళంగా సాగిపోతుంది

ఎండాకాలంలో
ఇసుక పొరల్లో ఇంకి
చెలమగా దాగి వుంటుంది
ఋతు చక్రగతి బోధపడకపోతే
జీవన స్రవంతి ఆగిపోయినట్టే అనిపిస్తుంది

## సరిహద్దులు

- పొద్దుటూరి మాధవీలత
9030573354



సరిహద్దులంటేనే
అతిక్రమించమని రెచ్చగొట్టేవి
ఆక్రమించమని మనసును
ఊరించేవి
కలలుకనే కళ్ళను
కన్నీటి సెలఏళ్ళను
కోరికల గుర్రాలను
హద్దుల్లో ఉంచగలమా?
మనసు వేగానికి
పడిలేచే కెరటానికి
పండు వెన్నెలలోని చల్లదనానికి
పువ్వుల పరిమళానికి
పగ్గాలు వేయగలమా?
ఎదిగే వృక్షానికి
ఎదలోని ఊహలకు
అంతులేని ఆకాశానికి
ఆశల విహంగాలకు
సరిహద్దులు గీయగలమా...!
కన్నతల్లి ప్రేమకు
కడలి అంచులకు
సరిహద్దులు కనుగొనగలమా...?
హద్దుల్లో అభివృద్ధి ఎలా సాధ్యం..?

## వర్తమానం



'ఇండియాస్ డాటర్' చిత్ర నిర్మాత లేస్లీ ఉడ్విన్

# నిశ్చయముగ ...నిర్భయముగ

- జగద్ధాత్రి
8712293994

***రాజకీయ వత్తిడి , మన భారత దేశ పరువు పోతుందనే మిషతో ఈ చిత్రాన్ని నిషేధించారు. ఈ నిషేధం సబబేనా కాదా అన్న విషయం పై మేధావులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, సామాన్య ప్రజలు చర్చిస్తున్నారు. కొందరు దీనిని సమర్థిస్తే ఎక్కువ శాతం నిషేధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇంత రభసకు కారణమైన ఈ చిత్రం గురించి కొంత వివరణ అవసరమనిపించి, అందులో ఉడ్విన్ చూపించిన విషయాలను గురించి విశదీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నదీ , ఆ చిత్రాన్ని చూశాను కనుక వాస్తవాలను తెలపాల్సిన ఆవశ్యకతను భావించి ఈ వ్యాసం రాస్తున్నాను.***

"నిర్భయ" యావత్ భారతాన్నీ కుదిపేసిన ఒక దుస్సంఘటన. మహిళా లోకమంతా జాగృతి చెంది పోరాడిన వైనం. జరిగి రెండేళ్లవుతుంది. ఇంకా ఆ నేరస్తులకు ఉరి శిక్ష అమలు చేయలేదు. తీర్పు ఇచ్చి రెండేళ్లవుతున్నా శిక్ష అమలు జరగ పోవడం ఈ దేశం లోని న్యాయ వ్యవస్థ వైఫల్యమని ఇటీవలే లో మాట్లాడుతూ జ్యోతి తల్లితండ్రులు వేదనను వ్యక్తం చేసేరు. ఇటీవలే అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విడుదల చేయాలనుకున్న "ఇండియాస్ డాటర్" అనే ఆంగ్ల డాక్యుమెంటేరీని మన ప్రభుత్వం నిషేధించడం పట్ల చాలా చర్చ జరుగుతోంది. ఈ చిత్రం యూ ట్యూబ్ లో (నిషేధానికి ముందు) 16 గంటలు లభ్యంగా ఉంది . అప్పుడు ఎందరో భారత దేశం లో చూశారు. మొన్ననే ఇది బ్రిటన్ దేశం లో కూడా విడుదల చేసేరు నిర్మాత లేస్లీ ఉడ్విన్. ప్రపంచమంతా ఆర్ద్రతతో ఆవేదనతో సహానుభూతి తో చూస్తోంది. అయితే ఈ చిత్రాన్ని భారత ప్రభుత్వం ఎందుకు నిషేధించింది?

ఇందుకు కారణం రాజకీయ వత్తిడి , మన భారత దేశ పరువు పోతుందనే మిషతో ఈ చిత్రాన్ని నిషేధించారు. ఈ నిషేధం సబబేనా కాదా అన్న విషయం పై మేధావులు, రచయితలు, సామాజిక కార్యాకర్తలు, సామాన్య ప్రజలు చర్చిస్తున్నారు. కొందరు దీనిని సమర్థిస్తే ఎక్కువ శాతం నిషేధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇంత రభసకు కారణమైన ఈ చిత్రం గురించి కొంత వివరణ అవసరమనిపించి, అందులో ఉడ్విన్ చూపించిన విషయాలను గురించి విశదీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నదీ , ఆ చిత్రాన్ని చూశాను కనుక వాస్తవాలను తెలపాల్సిన ఆవశ్యకతను భావించి ఈ వ్యాసం రాస్తున్నాను.

**చాలా మందికి ఉన్న కొన్ని అభ్యంతరాలను చెప్తాను:**

ఈ చిత్రానికి "ఇండియాస్ డాటర్" అని పేరు పెట్టడం నచ్చని వారు కొందరున్నారు. వారిలో మహిళలు కూడా. రెండు ఈ చిత్రం ద్వారా ఇంతవరకు బయటికి రాని జ్యోతి పేరు అందరికీ తెలిసిందని. మూడు ఈ చిత్రం లో జ్యోతి ఫోటో చూపించారని. నాలుగు అసలు ఉరి శిక్ష పడిన ఖైదీ ముకేష్ సింగ్ తో ఇంటర్వ్యూ ఎందుకు చేశారని? అది ఎలా అనుమతించారని? ఈ ముకేష్ కి ఉడ్విన్ 40 వేలు ఇచ్చారని. ముకేష్ మాటలు ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయని? ఇలా అనేకానేక అభ్యంతరాలు ప్రశ్నలు చర్చలు ఖండింపులు మొదలయ్యాయి దేశమంతటా.

ఈ విషయాన్ని ప్రతి దిన పత్రిక కూడా సమాజం లోని

మేధావులను , ఆలోచనాపరులను, రచయితలను అందరి అభిప్రాయాలను ప్రచురిస్తోంది.

**NDTV** లో ఇటీవల ఉడ్విన్, కిరణ్ బేడి , పింకీ వీరాని జ్యోతి తల్లి తండ్రుల తో చర్చ కూడా ప్రసార మయ్యింది.

ఇక పోతే తెలుగు పత్రికలలో విస్తృతంగా వస్తోన్న అభిప్రాయాలలో చాలా వివాదాస్పద అంశాలు ఉన్నాయి.



**నిర్భయ తల్లితండ్రులు**

చాలా మంది ఈ చిత్రాన్ని చూడ కుండా మాట్లాడుతున్నారు.

ఈ చిత్రాన్ని చూసిన స్త్రీగా , రచయిత్రిగా , మనోవిజ్ఞాన శాస్త్ర విద్యా వేత్తగా, సామాజిక స్పృహ బాధ్యత కలిగిన వ్యక్తిగా కొన్ని వాస్తవాలను మీ ముందు ఉంచుతున్నాను.

1) ఈ చిత్రం జ్యోతి తల్లి తండ్రుల అనుమతి తోనే తీయ బడింది

2) ఈ చిత్రం తీసిన లేస్లీ ఉడ్విన్ తాను తీసిన చిత్రానికి లక్ష్యం ఏమిటో స్పష్టంగా చెప్పింది. రేప్ అనేది ఒక సామాజిక దుశ్చర్య . లైంగిక వివక్ష ఎక్కువగా ఉన్నభారత దేశం లో ఒక నేరం వెనుక గల కారణాలు ఏమిటో చూపించడానికి ప్రయత్నించింది.

> **నేరం వెనుక ఉన్న మానసిక, సామాజిక కారణాలు అన్నీ విశదంగా మనం విశ్లేషించుకునేందుకు చాలా మానవ మర్యాదను అతిక్రమించకుండా చూపబడ్డాయి. ఎక్కడా అసభ్య చిత్రీకరణ కానీ జ్యోతి ఫోటో కానీ ఎక్కడా చూపించలేదు.**

3) నిర్భయ ఉదంతం జరిగిన వెనువెంటనే తీవ్రంగా స్పందించిన భారతీయ మహిళల పట్ల గౌరవం తో ఈ చిత్రాన్ని నిర్మించానని పేర్కొంది.

58 నిమిషాల పాటు సాగే ఈ డాక్యుమెంటరీ లో నేరము ఏమీ భయంకరంగా (మన టి వి చానెళ్లలో వచ్చే నేరాలు ఘోరాలు లాగా చూపించలేదు. కేవలం రాత్రి పూట బస్ నడుస్తుంటుంది అంతే కనీసం అరుపులు అలాంటివి కూడా చిత్రించలేదు). నేరం వెనుక ఉన్న మానసిక, సామాజిక కారణాలు అన్నీ విశదంగా మనం విశ్లేషించుకునేందుకు చాలా మానవ మర్యాదను అతిక్రమించకుండా చూపబడ్డాయి.

ఎక్కడా అసభ్య చిత్రీకరణ కానీ జ్యోతి ఫోటో కానీ ఎక్కడా చూపించలేదు.

ఆమె తల్లి తండ్రులు జ్యోతిని తమ ఇంటికి కంటికి వెలుగు గా భావించామని మరి కొద్ది నెలలో డాక్టర్ అయి ఎంతో బంగారు భవిష్యత్తు ఉన్న తమ పుత్రికను ఇలా కోల్పోవడం తట్టుకోలేక రోదించారు.

ఇండియాస్ డాటర్ స్టోరీ ఆఫ్ జ్యోతి సింగ్ . అవును ఇది ఎందరో అమాయక మహిళలు రకరకలుగా అత్యాచారాలకు గురి అవుతున్న ఒక జ్యోతి కథ.

అందరూ ఆడపిల్ల పుడితే బాధ పడతారని కానీ తాము జ్యోతిని ఆనందంగా పెంచుకున్నామని చెప్తుంది. డాక్టర్ చదివించడానికి డబ్బులు లేవమ్మా అంటే . నాన్నకు చెప్పు నా పెళ్లి కోసం ఖర్చు పెట్టేది ఇప్పుడే పెట్టమని నేను చదువుకుని డాక్టర్ ని అయితే మన కష్టాలు తీరిపోతాయమ్మా అంది అని. అలాగే పరీక్షలు పూర్తయ్యి ఇంటికి వచ్చింది డెహ్రాడూన్ నుండి. మళ్ళీ మరో ఆరు నెలలు ఇంటెర్న్షిప్ కి వెళ్ళి పోవాలని ఇక టైమ్ ఉండదని ఆ దురదృష్టకరమైన ఆ రోజు స్నేహితుడు అవనీంద్ర పాండే వస్తే సినిమాకి వెళ్తానని ఒక రెండు మూడు గంటల్లో వచ్చేస్తానని చెప్పి వెళ్లింది. వెళ్ళిన పిల్ల మరి తిరిగి రాలేదు . సఫ్దర్ జంగ్ ఆసుపత్రి నుండి ఫోన్ వచ్చింది అమ్మాయి రేప్ కి గురి అయ్యిందని.

**జ్యోతి తండ్రి ఆక్రోశం :** డాక్టర్లు జ్యోతి కేవలం కొన్ని గంటలో లేదా ఒకటి రెండు రోజులు మాత్రమే బ్రతికి ఉండగలదని చెప్పేరు. కానీ కొన్ని రోజులపాటు ఆ ప్రాణం ఎలా నిలిచి ఉందో తెలియలేదు. మా బంధువు ఒకాయన జడ్జి . నువ్వు కూడా జడ్జ్ అవ్వమ్మ అంటే అంతకంటే పెద్ద పదవి లేదా అని అడిగేది చిన్నప్పుడు. డాక్టర్ అయితే ఎంతో మంచిది అని చెప్పేది. గుండెల మీద ఆడించుకుని పెంచిన కంటి పాప ఇలా నా చేతులతోనే కాల్చి బూడిద చేయాల్సి వస్తుందనుకోలేదు.

సఫ్దర్జంగ్ లో డాక్టర్ మాట్లాడుతూ తాను గత 20 యేళ్ళ నుండి రేప్ కేసుల బాధితులకు వైద్యం చేస్తున్నానని కానీ ఇంతటి దారుణమైన కేస్ ఎప్పుడు చూడలేదని చెప్పేరు.

హోటల్ 37 ముందు బస్సులోంచి నగ్నంగా బయటికి తోసి వేయబడ్డ జ్యోతి ని , ఆమె ఫ్రెండ్ అవనీందర్ ను తాను హోటల్ లోకి వెళ్ళి మంచి నీళ్ళు ఒక దుప్పటి తీసుకొచ్చి, దుప్పటిని రెండు ముక్కలుగా చించి ఇద్దరికీ కప్పానని చెప్తాడు ఆమెను రక్షించిన పెహ్రెదారు పోలీస్. ఎవరూ సహాయానికి ముందుకు రాలేదని , కాసేపటికి అంబులెన్స్ వచ్చి తీసుకువెళ్లేరని చెప్తాడు. కానీ ఎక్కడా ఎటువంటి దృశ్యమూ చూపించరు.

ఇక బాగా వివాదాస్పదమూ , ప్రజల మనసులను రంపంలా కోస్తున్న నిందితుడు బస్ డ్రైవర్ ముకేష్ సింగ్ మాటల్లో కరుడు కట్టిన కసాయి తనమే తప్ప ఎక్కడా ఏ కోశానా కించిత్తైనా పశ్చాత్తాపం లేక పోవడం హృదయాన్ని కోసేస్తుంది ఎవరికైనా. తన అన్న రామ్ సింగ్ ప్రధాన నిందితుడు కావడం (జైల్ లోనే ఆత్మ అహత్య చేసుకున్నాడు రామ్ సింగ్), తాను బస్సు నడుపుతున్నానని అమ్మాయి పైన అత్యాచారం జరుగుతున్నంతసేపు బస్సు నడుపుతూనే ఉన్నానని చెప్తాడు.

రేప్ జరిగేందుకు కారణం ఆడవాళ్లే. రేప్ జరిగేటప్పుడు ప్రతిఘటించకుండా ఉంటే ప్రాణం తీసే వాళ్ళం కాదు. కానీ ఆమె చాలా పోరాడింది. అందుకే చంపాల్సి వచ్చింది. ఆమె లోపలికి చెయ్యి పెట్టి బయటికి లాగిన పేగులను బట్టలో చుట్టి పారేసాం. మాకు ఊరి శిక్ష వేస్తే ఇక పై జరిగే రేపుల్లో ఇక సాక్ష్యమన్నది లేకుండా అమ్మాయిని చంపేస్తారు అనడంలో సందేహం లేదు. ఇలాంటి వ్యాఖ్యలతో మాట్లాడే ముకేష్ ని ఇంటర్వ్యూ ఎందుకు చేశారన్న ప్రశ్న వచ్చినప్పుడు. ఉడ్విన్ చెప్పిన సమాధానమిది. రేప్ వెనుక గల మానసిక సామాజిక కారణాలను, నేరస్తుల మానసిక వైపరీత్యాన్ని కూడా ఎత్తి చూపాలని. ప్రతి ఒక్క కోణం నుండి ఒక రేప్ నేరాన్ని ఎలా చూస్తారో ప్రజల్లోకి తీసుకు వెళ్ళడమే తన లక్ష్యమని చెప్తుంది ఉడ్విన్.

***రేప్ వెనుక గల మానసిక సామాజిక కారణాలను, నేరస్తుల మానసిక వైపరీత్యాన్ని కూడా ఎత్తి చూపాలని. ప్రతి ఒక్క కోణం నుండి ఒక రేప్ నేరాన్ని ఎలా చూస్తారో ప్రజల్లోకి తీసుకు వెళ్ళడమే తన లక్ష్యమని చెప్తుంది ఉడ్విన్.***

రామ్ సింగ్ , ముకేష్ సింగ్ తల్లి తండ్రులతో కూడా ఇంటర్వ్యూ ఉంటుంది. వాళ్ళు ముసలి కాలం లో తమకు ఆసరాగా ఉంటారనుకున్న బిడ్డలు ఒకరు ఆత్మహత్య చేసుకోవడం , మరొకరు ఊరి శిక్షకు గురి కావడం తట్టుకోలేక పోతున్నామని చెప్తారు. మరొక నిందితుడు అవినాష్ భార్య అన్ని రేప్ కేసుల్లోనూ ఇలాగే ఊరి శిక్ష వేస్తున్నారా? నా భర్త కి ఊరి వేస్తే మా కుటుంబం , చిన్న పిల్లాడు ఎలా బతకాలి అని ప్రశ్నిస్తుంది. ఇది ఆమె వైపు వాదన. ఇదీ ఒక సమాజ పార్శ్వమే కదా అక్కడా మహిళకే అన్యాయం జరుగుతోంది. వాడు చేసిన నేరానికి నేను నా బిడ్డను గొంతు నులిమి చంపేసి నేను చచ్చిపోవాలి లేకుంటే మాకు ఆధారమే లేదు అంటుంది.

ఇక రేపిస్టుల డిఫెన్స్ లాయర్లు ఇద్దరూ చాలా అసహ్యంగా మానవ సమాజం సిగ్గు పడేలా మాట్లాడేరు. ఒకరి దృష్టిలో ఆడవారు రాత్రి పూట బయటికి వెళ్లనే కూడదు అన్న ఛాందస వాదం . రెండవ వారు మరీ దారుణంగా అంటాడు . అదే తన ఇంట్లో ఎవరికైనా అయితే ఫార్మ్ హౌస్ కి తీసుకువెళ్లి పెట్రోల్ పోసి బంధువులందరి ముందూ తగులపెట్టేస్తాను అంటాడు. ఎన్నటికీ అదే మాట మీద ఉంటాడట. నిజంగా అలా తగలబెట్టేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. మర్యాద మరణాలు మనకు కొత్తవా ?

నేరస్తులు అందరూ వాళ్ళు అతి సాధారణ మైన పూరి గుడిసెల్లో బ్రతికే వారు. చిన్నప్పటినుండి నేరాలు , వ్యభిచారం చూసిన వారు. ఆ నిమిషాన నిషాలో ఉన్న వారిలో పైశాచికత్వం ప్రబలింది అందుకే ఈ నేరం ఇంత కర్కోటకంగా చేసేరు. అని పేర్కొంటాడు జైల్ మనో విజ్ఞాన శాస్త్రవేత్త.

జ్యోతి ఎంతో పట్టుదల కల మనిషి అని, ఆమె హాస్టల్ ఫీజ్ కోసం రాత్రుళ్లు కాల్ సెంటర్ లో కూడా పనిచేసేదని ఆమె ట్యూటర్ మిత్రుడు చెప్తాడు. అలాగే ఆమె చాలా మంచి మనసుకు నిదర్శనంగా ఒక సంఘటన చెప్తాడు. బజారులో పర్స్ దొంగిలించి పారిపోతున్న చిన్న కుర్రాడిని అందరూ తన్న బోతుంటే జ్యోతి ఆపి వాడికి ఏమి కావాలో అవి కొనిచ్చి ఇంకెప్పుడూ దొంగతనం చేయనని ఒట్టేయించుకుంటుంది. అంతటి మంచి అమ్మాయినా మనం ఇలా చంపుకున్నాం . ఇంతమందీ మాటలు విన్నాక ఒకటే పెద్ద ప్రశ్న మన ముందు కదులుతుంది ఆడపిల్లకి కనీస భద్రత కల్పించలేక పోవడం మన దేశం లోని ఆడపిల్లల జీవితాలపట్ల శాపం అంటాడు ఇతను. జ్యోతి కూడా ఎప్పుడు అదే మాట చెప్పేదని , వైద్య సదుపాయం లేని తమ పల్లెటూల్లో హాస్పిటల్ పెడతానని చెప్పేదని చెప్తాడు.

తన చివరి క్షణాల్లో తల్లి చేతులు పట్టుకుని ముద్దు పెట్టుకుని "మమ్మీ క్షమించు నీకు చాలా కష్టం కలిగించాను" అని చివరి శ్వాస విడిచిందని కన్నీళ్లతో చెప్తుంది జ్యోతి తల్లి.

ఈ సంఘటన ఒక తూఫాను లా వచ్చి వెళ్లిందని. ఇక ఆపైన చర్యలు చేపట్టాల్సినవి ఉన్నాయని చెప్తాడు ఆమె తండ్రి. చివరిగా గంగలో తర్పణంగా వెలుగుతున్న జ్యోతిని చూపిస్తూ చిత్రాన్ని ముగిస్తారు. చూసిన మానవత్వం ఉన్న ఏ మనిషికైనా గుండె బరువెక్కుతుంది.

**ఈ చిత్రాన్ని మనం సరి ఐన దృక్పథం తో అర్థం చేసుకుని గమనించాల్సిన విషయాలు:**

నేరస్తులు పెరిగిన వాతావరణం, వారి నేర ప్రవృత్తికి ఎలా దోహదమయిందో. అలాగే ఈ నేరస్తుల్లో ఉన్న మైనర్ అబ్బాయి కూడా ఇంత దారుణమైన నేరానికి పాల్పడటం లో వెనుక మానసిక పైశాచకత్వం. దీనికి గల కారణాలు ఏంటి? ఆడాళ్ళను అనుక్షణము ఒక వ్యాపార వస్తువుగా సినిమాల్లోనూ , టీవిల్లోనూ చూపించడం. అక్కడ అలాంటివి చూసి బయట అవకాశం చిక్కినప్పుడు ఇటువంటి అసహాయులైన ఆడపిల్లల పై అత్యాచారాలు చేయడం, ఎంతగా ఈ ప్రభావం ఉందంటే

వీళ్ళు నేరం చెయ్యడమే కాదు , దొరికిపోయినా చివరికి ఉరి శిక్ష పడినా కూడా ఏ మాత్రమూ పశ్చాత్తాపం కనబరచనంత కర్కశంగా తయారయ్యారు. ఇక ఆమె విషయంలో లాయర్లు మాట్లాడిన మాటలు స్త్రీల, ఆడపిల్లల పట్ల ఎంత క్రూరమైన భావం కలిగి ఉన్నారో , ఆటవికమైన మనస్తత్వంతో మాటాడుతున్నారో అర్ధం అవుతుంది. ఇది సభ్య సమాజంలో లాయర్ల పవిత్రమైన వృత్తిలో ఉండీ మాటాడిన మాటలు. నిజానికి ఆవేశం లో సారాయి మత్తులో నేరం చేసిన వారికన్నా అన్నీ తెలిసినా చదువుకున్న వర్గం వారు ఇలా మాటాడే వీరే అసలు నేరస్తులు అనిపిస్తుంది.

రేప్ వెనుక గల కారణాలను విశ్లేషించుకుని , చర్చించి ఆలోచించి మనమందరము ముందుకు సాగ వలసిన విధానం తెలియ జేస్తుంది ఈ చిత్రం.

ఈ చిత్రం వెనుక గల సదుద్దేశం , లక్ష్యం గ్రహించకుండా కేవలం ముకేష్ మాటలు విని అపార్ధం చేసుకుంటె మనంత ఫూల్స్ ఎవరూ ఉండరు.

ఒక విదేశీ మహిళ ఈ చిత్రాన్ని నిర్మించినందుకు , తమ దేశం పరువు పోయిందని భావించే మేధావులమని భ్రమించే వారు ఆమెను షటప్ అని చెప్పాలనిపించిందని రాయడం. అదీ ఒక కుల్లు కల్మశం నిండిన సినిమా రంగం లో నుండి వచ్చిన గొల్లపూడి మారుతీ రావు గారు రాయడం చాలా బాధను కలిగించింది. రాసేటప్పటికి ఈ చిత్రాన్ని చూడలేదని పేర్కొంటూ చూసాక కూడా ఒక్క మాటా మార్చాలనిపించలేదు అనడం మరీ బాధ కలిగించింది. ఆడవారికి మానభంగాలే కాదు మేధో భంగాలు కూడా తప్పవనిపించి నేను సాక్షి లో ఆయనకు సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. ఎందరో మహిళలు, పెద్దవారు మరి కొందరు లాయర్లు, ఎంతో మంది దాదాపు 100మందికి పైగా నాకు ఫోన్ చేసి మేము ఆ ఆర్టికల్ చూసి బాధపడ్డాం మీరు సరైన రీతిలో జవాబిచ్చినందుకు థాంక్స్ అంటూ చెప్పేరు.

మిత్రులారా! పురుషహంకారం తోనూ మిడి మిడి మేధతోనూ మానవత్వాన్ని మరిచి, కనీసం ఏ పాటి శ్రద్ధ లేకుండా ఆయన అలా రాయడం అభ్యంతరకరమే . అయితే ఇప్పుడు ఈ విషయం కాదు మనం పట్టించుకోవాల్సింది. మనమందరం మానవత్వం తో ఈ చిత్రం పై నిషేధం ఎత్తి వేసి సామాజికమైన ఈ దుశ్చర్యకు వెనుక గల కారణాలను తెలుసుకుని చర్చించాల్సిందిగా నా విన్నపం.

నిన్న ఒక ఇల్లాలు నాకు ఫోన్ చేసీ అమ్మా బయటికి వెళ్ళక తప్పని పరిస్థితి వెళితే ఎలా తిరిగి వస్తారో ఆడపిలల్లలని గుండెలు అదురుతూనే ఉంటాయి రోజూ అంటూ ఏడ్చేసింది. మరొక ఆమె ఇండియాస్ డాటర్ అని పేరెందుకు పెట్టేరు అమ్మా అంటే మనమందరం ఇలా రేపుకి గురైన వారిమా అంటూ ఏడ్చింది.

ఇక్కడ ఒక్క ముఖ్య విషయం. ఇండియాస్ డాటర్ అని ఉడ్విన్ ఈ భారత పుత్రి కథను తీసినప్పుడు ఆమెకు ముందుగా సహకరించిన జ్యోతి తల్లి, వకీలు లీల (వర్మ కమీషన్ ), సఫ్దర్ జంగ్ హాస్పిటల్ డాక్టర్, ఉడ్విన్ కి సహకరించిన అనురాధా సింగ్ (ఎడిటర్), ఆమె కోసం పోరాడిన మహిళ లందరూ ఇండియాస్ డాటర్లే కదమ్మా .

రేప్ ఒక మానసిక జాఢ్యమ్, సామాజిక దుశ్చర్య దీనిని అరికట్టలంటే దీని వెనుక గల కారణాలను తెలుస్కోవాలి అప్పుడే మూలాలనుండి నరుక్కు రావడం జరుగుతుంది .

జ్యోతి జరిగిన విషయమంతా వివరించిందని చెప్పింది డాక్టర్. వైద్యులు ఏ అంగం ఎలా అతకాలో తెలియడం లేదమ్మా అంత ఛిద్రమైన దేహాన్ని ఎప్పుడూ చూడలేదు అన్నారని భోరున విలపిస్తుంది ఆ తల్లి.

ఆమెను రక్షించిన పెట్రోలింగ్ పోలీస్ అప్పుడే దూడకు జన్మనిచ్చిన ఆవులాగా ఉంది ఆమె దేహం నేను చూసినప్పుడు అని చెప్తాడు. ఇంత పైశాచికత్వం కేవలం మనుషుల్లోనే ఎందుకు ఇలా ప్రబలిపోతోంది?

నిర్భయ సంఘటన తర్వాత రోజూ జరుగుతూనే ఉన్నాయి ఇలాంటి దారుణాలు. అన్ని వయసులవారి పైనా ఇవి తప్పడం లేదు. సామాజిక రుగ్మత గా భావించి ఈ రుగ్మతకు వైద్యం ఏమిటా అని మనసున్న మేధావులు ఆలోచించాలి తప్ప ఈ చిత్రాన్ని ఈ దేశం లో నిషేధించడం న్యాయం కాదు. చాతనైతే ఈ దుష్కృత్యాలను ఆపే ప్రయత్నాలు చేయండి.

*నిర్భయ సంఘటన తర్వాత రోజూ జరుగుతూనే ఉన్నాయి ఇలాంటి దారుణాలు. అన్ని వయసులవారి పైనా ఇవి తప్పడం లేదు. సామాజిక రుగ్మత గా భావించి ఈ రుగ్మతకు వైద్యం ఏమిటా అని మనసున్న మేధావులు ఆలోచించాలి తప్ప ఈ చిత్రాన్ని ఈ దేశం లో నిషేధించడం న్యాయం కాదు. చాతనైతే ఈ దుష్కృత్యాలను ఆపే ప్రయత్నాలు చేయండి.*

చాలా మంది అయితే పరిష్కారం ఏమిటంటారు అండీ అనడిగారు నన్ను. నాకు తోచినవి చెప్తాను. ఎక్కడ బడితే అక్కడ ప్రతి పబ్లిక్ ప్లేస్ లోనూ పోస్టర్లు పెట్టండి “రేప్ చేయడం నేరం” చివరికి సినిమా టికట్లపైన రైల్ టికట్ల పైన కూడా ముద్రించండి. అన్నిటిని ఇంచి ఇంచిలుగా వ్యాపార సంస్థలకు అమ్మేసుకుంటున్న వార్తా పత్రికల్లో రోజూ ఒక ప్రకటన వెయ్యండి. అతి దారుణంగా ఆడవారిని అసభ్యంగా చూపిస్తున్న

## నివాళి

# రాళ్లబండి కవితా ప్రసాద్ ఇక లేరు



ప్రముఖ సాహితీ వేత్త, భాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు రాళ్లబండి వెంకట ప్రసాదరాజు (కవితా ప్రసాద్- 56) ఏప్రిల్15 న కన్నుమూశారు. కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడు గ్రామంలో జన్మించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. తెలుగు పండితులయిన తండ్రి కోటేశ్వరరాజు 20ఏళ్ల క్రితం మృతి చెందారు. ఆయన ఖమ్మం జిల్లాలో స్థిరపడ్డా, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిలాసఫీలో డాక్టరేట్ అందుకున్నారు. సంయుక్త కార్యదర్శి హోదాలో ప్రభుత్వ ఉన్నత ఉద్యోగిగా పనిచేస్తూనే...మరోవైపు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారు. అవధాన ప్రక్రియలో ప్రతిభ ప్రదర్శించారు. స్పష్టమైన ఉచ్చారణ, వాక్పటిమతో వ్యాఖ్యాతగా రాణించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన సాంఘిక సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా తెలంగాణ ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవధాన విద్య-ఆరంభ వికాసాలు, ఒంటరి పూలబుట్ట, పద్యమండపం, అగ్నిహంస, ఇది కవి సమయం తదితర పుస్తకాలు రచించారు.

సినిమాల్లో వారి వేషధారణని సెన్సార్ వారు ఆపండి. అటువంటి సినిమాలకు అనుమతి ఇవ్వకండి. టీవి ల్లో ప్రతి సెకనూ అమ్మేసుకుంటున్న వారు ఆలోచన వస్తే మరుగు దొడ్డి వస్తుందని చెప్పే వారు, మనుషులైతే రేప్ చేయకండి అని చూపించండి. అప్పుడే నిజమైన స్వచ్ఛ భారతమౌతుంది.

ఆడ మగ మధ్య ఈ బేధం ఎప్పుడు ఉంటుంది. ఈ రెండు జాతులూ ఉన్నంత వరకు. ఏది సౌకుమార్యమో సౌందర్యమో అది తెలుసుకోక వ్యాపార రంగం శాసిస్తున్నట్టు మహిళలూ మీరు ఉండకండి. ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోండి. కడుపులో పడిన దగ్గరనుండి వదిలించుకోవాలన్న ఆడపిల్లలను బతకనీయండి. మన సమాజం లో ఉన్నా ఈ లైంగిక వివక్షే ఎయిడ్స్ కన్న భయంకరమైన వ్యాధి. అనాదిగా ఆడవారిని పీడిస్తున్న వ్యాధి. దీనికి వైద్యం మారాల్సిన మనుషుల దృక్పథం. పురుష స్వామ్య వ్యవస్థ లో ఉన్న ఈ పురుషాహంకార ధోరణి. ఇవి మూలాలు పాతుకుపోయిన దేశం లో ఉన్నాం మనం.

అయితే రేపులు ఇంగ్లండ్ లో లేవా అమెరికా లో లేవా లాంటి పిచ్చి ప్రశ్నలకు తావు లేదిక్కడ. ఇది ప్రపంచ మహిళా సమస్య . దీనికి ఏ దేశమూ అతీతం కాదు. అయితే అన్నిటికన్నా మనదేశం లో సంప్రదాయాల పేరిట, పురుష స్వామ్య వ్యవస్థ పేరిట మరీ ఎక్కువగా ఉన్న ఛాందసాలు ఉండటం మరింత కారణాలు.

వీటిని సమూలంగా నాశనం చేయడానికి ప్రయత్నించాలి. ఇప్పటికే అభివృద్ధి పథం వైపు నడుస్తోన్న మానవ చరిత్రలో ఇంకా పాతరాతి యుగాల నియమాలు కాకుండా నేటి సాంకేతిక యుగం లో స్త్రీ మాన హాని కలగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలి. అందుకు ఈ వేదనమయ నిశ్శబ్దాన్ని ఛేదించి మాటాడాలి. మానభంగాలకు అభిమాన భంగాలకు గురి అవుతోన్న మన మహిళలను సగౌరవంగా బ్రతికే స్థితిని మనుషులందరూ మానవత్వం తో దోహదపడాలి. అంతవరకూ మనం మనుషులమని చెప్పుకునేందుకు సిగ్గు పడాలి.

మొన్ననే జ్యోతి స్నేహితుడు (ఆమెతో బాటు ఆ రాత్రి బస్సులో ఉన్నవాడు), నిజానికి అతను క్లీనర్ని కొట్టడం వలనే గొడవ మొదలయ్యింది. ఇంతవరకు మాటాడని అతను ఇప్పుడు ఈ నిషేధాన్ని సమర్ధిస్తూ అదంతా కట్టు కథ అంటున్నాడు. ఎవరు ఈ విధంగా చెప్పిస్తున్నారో ఆలోచించండి. అయితే మరి ఆ రోజు రేప్ జరగడం నిజం కాదా ? ఎందుకు అవినింద్ర ఇలా మాటాడుతున్నాడో కూడా ఆలోచించాలి. ఇతన్ని కూడా ఉడ్విన్ ఇంటర్వ్యూ అడిగిందని చాలా సార్లు తాను నిరాకరించనని చెప్తున్నాడీ మహానుభావుడు. ఇంతవరకు మౌనంగా ఉండి ఇప్పుడెందుకు నోరు విప్పి స్టేట్మెంట్లు ఇస్తున్నాడు ఈ వీరుడు ? (ఇది మొన్న వార్తల్లో వచ్చింది).

ఈ చిత్రాన్ని, నిషేధాన్ని, దాని వెనుక కారణాలని, రోజు రోజుకూ జరుగుతోన్న పరిణామాలని విశ్లేషించి మీ అందరికీ చెప్పాలన్న నా ఆవేదన ఆవేశం అర్ధం చేసుకుంటారని భావిస్తూ అందరం కలిసి పోరాడాల్సినది నినాదాలతోనే కాదు నిర్భయులమై ఎదిరించాలి, మన ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తూ, ప్రపంచ పుత్రికలందరికి జోహార్లు.

## కవిత

# చిరునామా కావాలి..!



– బి. కళాగోపాల్
9441631029

దృశ్యా దృశ్యంగా కంటిముందు కనిపించేదంతా
మిథ్య అని నమ్మినన్నినాళ్ళూ వంచనకు
గురవుతున్న విశ్వ ప్రపంచంలో..
అదృశ్యమవుతున్న మనిషి అడుగుజాడల్ని
పట్టుకొనే ప్రయత్నంలో
అస్తిత్వాన్ని అంగడి సరుకుగా,
జీవితాన్ని ఆర్థిక విలువల పందేరంలో
బలిపీఠాన్ని ఎక్కించాక,
ఇక చూస్తూ ఉండటానికి ఏముంది?
నీ చుట్టూ ఒకానొక శూన్య ప్రపంచం తప్ప!
ఆవరించుకొన్న మాయాలాంతరు
ఊదారంగు పొగవలయంలో
ఉక్కిరిబిక్కిరవుతున్న ఓ మనిషీ! నీవొక మాయావివి!
మాతృత్వాన్ని స్కైప్ తడిపొడి మాటల కప్పుజెప్పిన
డాలర్ల వలసపక్షి జీవనంలో..
చారెడు నీళ్లూ, గుప్పెడు మెతుకులకై
వృద్ధాప్యం అవిటి విగ్రహాల్లా..
ఆశ్రమాల్లో నిర్జీవంగా పడి ఉంది!
నీకు నీవే పరిచయం లేనట్టు
అపరిచిత ముఖ పుస్తక భాషలోకి
కొత్తగా తొంగి చూసుకుంటున్న పరాన్న భుకూ!
నీ జాడ ఏదంటూ? పడమటిగాలి ప్రశ్నిస్తూ
వెళ్లిపోయింది!
అవినీతి అంటుజాడ్యపు రంగుమరకల్లో
బకాసురులు,
చీకటి మత్తు ఒంట్లో పులుముకొన్న కీచకసర్పాల
వికృత చేష్టల్లో.. తలలు తెగుతున్న పసిమొలకలు!
నాగేటి చాళ్ళలో మొలుస్తున్న ఉరికొక్కాలు.
చిరుగుల బతుకు కన్నీటిసాగులో,
వాడిన స్వప్నాలు పూయిస్తున్న చవిటి నేలలు!
మాటల కందని మౌనంలో,
దిగుడుబావి చూపుల్తో ఇటుకల గోడలు!
మనిషి వాసన లేని శూన్యావస్థలో
శిథిలావస్థకు చేరువవుతున్నాయి.
ముళ్ళ తీగెల్లో చుట్టబడిన రక్త గులాబీలు
చీకటి పేగుల నీడన అంటరాని మొక్కలుగా
మేమెలా వికసించేదంటున్నాయి.
బిగ్‌స్క్రీన్‌పై అల్లుకుంటున్న పచ్చనిపందిట్లో
ఉమ్మడి కుటుంబాలు విషపు నవ్వులు ఒలకబోస్తున్నాయి!
స్మార్ట్ ఫోన్ల కేరింతల్లో నిక్షిప్తమవుతున్న
పండుగ పబ్బాలు!
ఆకాశంలో ఎండమావుల హరివిల్లుల్ని నిర్మిస్తున్నాయి!
నెత్తురోడుతున్న చరిత్ర పేజీల్లో
దిష్టిబొమ్మల దహన క్రియలు!
అన్నీ కళ్ళముందు అలా గతించి వెళ్తుంటే..
ఏమీ పట్టనట్లు కాలపు ముళ్ళకు వేలాడేసిన
బోలుదేహాన్ని మోస్తూ తిరుగుతున్న మనం.
ఏ తిరోగమనపు చీకటి వలయాల్లోకి ఇంకిపోతున్నాం?
ఏ మిథ్యా ప్రపంచపు కక్ష్యా భ్రమణాల్లోకి తూలిపోతున్నాం?
ఒక పలకరించే చూపైనా లేక,
ఒక ఆర్తితో తడిమే స్పర్శైనా లేక,
దిక్కూ దిశా లేని ఒంటరి కాగితపు నావికులం!
కఫన్ డబ్బాల్లో మృతత్వంలా..
ఉద్వేగాలన్నీ కోల్పోయి.. స్పందనలన్నీ తాకట్టు పెట్టి.
పచ్చ కాగితాల్తో వసంతాలను పూయించవచ్చునుకుంటున్న
మర యంత్రాల జాతరలో,
తప్పిపోయిన నేను కనబడితే,
నీవెవరని ప్రశ్నించాలనుంది?
మనిషితనపు ఆనవాళ్ళలో
నేనెక్కడో..? కనుగొనాలనుంది!

# కథ

## కన్నపేగు



-బూతం ముత్యాలు
9490437978

అతను పన్కి పోనికే తయారైతుండు అన్కోకుండా జేబులున్న ఫోను రింగ రింగ ట్రింగ్ ట్రింగ్‌మని మోగవట్టింది. ఫోనుల నెంబరు సూతై తన చెల్లె మంగమ్మది. ఏందో ఇసయమని ఫోనెత్తిండు అతడు. 'అలో' అని అనంగనే అవతలి వైపునుంచి తన చెల్లె వల్ల వల్ల ఏడ్చుకుంట 'అన్నో నేను మంగని' నోరు పెగ్గకుండా దుఃఖం ఆగకుండ మత్తడి కత్వ అల్గుదుంకుతుంటే, కొంగుతోని తూడ్చుకుంట 'ఇగో అన్నో మీ బావ తెల్లారుగొట్టంగ లేసి చెంబట్కోని ఎల్లిండు. ఇంతవరకు ఇంట్కిరాలే. బైల్కు పోయినకాడ లోట పారేసుంది. ఎవర్నడ్గినా మాకు తెల్వదంటే. మాకు తెల్వదని చెబుతుండ్రు. ఒకరిద్దరు మట్కు మనూను బాటెంట తూర్మొకాన పోతుండే, జూశ్నమంటుర్రు. నాకెందో బయమైతుందన్నా, అన్నో... నన్నెట్టజేస్తరయ్యా.... ఉ...ఉ. నాకేదన్న దారి సూపురయ్యా... నా బత్కు ఆగమైతటుందయ్యా మీ బావ మున్పటి మన్సిలాలేడు. నిచ్చె తాగవట్టె. నా పెళ్ళినాడు గిలాస కల్లుతాగని మీబావ ఇయ్యాల తెల్లారంగనేమందు దూకునంలకు పోయి సీస సారతాగి సోల్కంటు, సోల్కుంట ఇంటికొచ్చి, ఇంట్ల పంతుండు. పనిబందువెట్టిండు. నేను పసి బాలింతనని కూడా సూస్తలేడు. జిల్దిరా... అన్నా' అని మంగ ఏడ్చుకుంట, కండ్లనీల్లు తూడ్చుకుంట, పోనుల తన బాధను వలపోయసాగింది. అంత ఇన్న అతను ఆల్చంచేయక అమ్మనాయినను తీస్కోని, రెక్కలు గట్కోని చెల్లె ఊర్లోవాలిండు.

టైము పదకొండు కొడ్తుంది. ఇంటి ముంగల ముగ్గురు పిల్లలు ఆడ్కుంటున్నరు. తన చెల్లె మంగమ్మ నెత్తిన తలకు చెవులకు తువాల కట్టుకుంది. చెవ్వుల దూది సగ బెట్కుంది. ఆమె ముందె పచ్చిబాలింత నుల్కమంచాన్ని గోడ దాప్కు, ఏస్కోని పక్కన పసిగుడ్డును మంచల ఒర్గింది. గనుమ ముంగల కుంపటి రాజుకుంటనే ఉంది. గన్మల ఎడ్మకాలి చెప్పు. పాతపార్క, బూడిదను గనుమ ముందు పోసి ఉంది దారగా, అట్నే గ్యారమండ సగ గనుమట్ల ఏసుంది. ఇంట్ల బాలింత, గని, సమర్త అయిన పిల్లగాని ఉంటే ఇట్ల చేయడం ఊర్లల్ల ఆనవాయితీ. దుమ్మొకాళ్లవచ్చిన అతను అతని అమ్మయ్యలు జాలారు గొలెంకాడ కాల్గడ్కోని చెల్లె మంగను మందించె. ఆమె ఈళ్లను సూసినంతనే లేసిలేవక అట్నే మంచంల గూకోని ఏడ్వసాగింది. బిడ్డ ఆలతు జూస్న ఎంకమ్మ బిడ్డ దరికి జేరి 'నీకేం శెరలొచ్చె బిడ్డా. మంచోడనుకొని బిడ్డా నిన్నీడికిస్తి బిడ్డా పెళ్లినాడు కైసునీసు ముట్టనోడు బిడ్డ నిన్ను తిప్పలు వెట్టనట్టె బిడ్డా ఇది ఎవని సాలో గపి బిడ్డా మన దాంట్ల లేదాయె బిడ్డా, నా రెక్కలు ఇర్గలే బిడ్డా నిన్ను కంట్కి రెప్పలా సూస్కుంట బిడ్డా, అని తల్లి ఏడ్వసాగింది. 'ఇగ ఏడ్చిన కాడ్కి, సాల్లాని తీయమ్మ, ఎరా మంగ పిల్లలు బాగున్నారా'. 'బాగానే ఉండన్న' 'ఏందో నీ కర్మ గాకుంటె వొర్సగ నలుగురు ఆడపిల్లన్నిచ్చె బగవంతుడు. ఎవడు చేసిన తప్పిదం ఇది, నేను అయ్యిల్నఏ నెత్తినోరు బొంగ చేసస్తి బావకు నీకు ఈ రోజుల్ల ఒక్కరిద్దరు పిల్లల సాదనికే గగనమైగుంది అది నల్గురు ఆడ్పిల్లలైతే ఎట్టా ఇంతదాంక ఎందుకు తెచ్చుకుండ్రు.

నువు నా తోడ ఒక్కదానివని నిన్ను గార్యంగా సాద్కుంటి నీకెంత కష్టమొచ్చె చెల్లె ఇప్పుడన్న పిల్లలు గాకుంట ఆప్రిషను జేస్కున్నావురా అని అనే అతను 'యాడ నన్నా చేస్కోలే అన్నది మంగ. 'ఇంక చేస్కోక ఆట సూస్తే ఎట్లరా' అనె అతను 'ఆయినకు ఆడబిడ్డలయితె ఆయన వంశం పోతడట. వంశంని ల్వడాలంటె మగ పిలగాడు కావాల్నట. అంద్కె నేను చేస్కుంట అని అన్న ఆయన ఒప్తలేడు. ఆయనమాటకాదని నేను చేస్కుందామన్న

లమ్మిడి నామటినవ అని నన్ను దమిదమిన  తాగొచ్చి తంతడు మీబావ' అనే మంగ 'అది కాద్ర ఈ రోజుల్ల సిరిగల్లోల్లు, ఉద్యోగాలు జేస్తోల్లు ఒక్క పిల్లనో, పిలగాడో పుట్టంగనే ఆప్రిషను చేపిచుకుంట్టుర్రు. మీరిట్ల పిలగాడు కావాల్నని మంకు చేస్తే ఆడ్బిల్లలు ఊకనే పోతరా ఇయ్యాల రేపట్ల గుడ్సెమీద సెత్తలేనోడు సగ లచ్చల కావాల్నని కూకుంట్టుండు మీరు సూడంది కాదు మీకు ఎర్కలేంది కాదు ఎందుక్క జేస్తవురా మమ్మగాని చెల్లె పిల్లలు కాకుంట ఇప్పుడున్న చాపిచ్చో ఆగోనీ ఆలతు చూడు నీకండకరిగె నీ బలం దిగిపోయె తీర మూడు పదులు దాటని ఈడుకె ముసలమ్మోలె అయిత్వి అనే అతను అది కాదన్న దానిగురించె నాత్రి ఇంట్ల కిరకిరి మొదైంది. నేను ఎద్రుమాట్లాడి తాల్కి నన్ను రెండు దెబ్బలేసిండు. కొడ్తెకొట్టె నా పెన్మిటే గదా అన్కుంటిమీకు గూడ ఎర్క జేయాలే ఇగ ఆయ నేమో పాల్జీకే సంటిదాన్ని మూడ్నెల్లు కూడా దాటక ముందె పిల్లను ఎవర్కో అమ్ముతని మంకు జేస్తుండు మీ బావ. నా పేగు దెంచుకొని పుట్న పసి గుడ్డును ఎట్ల అమ్మ నాన్న తిండ్కి లేకుంట వాయె ఆడ్క తినన్న నా పిల్లల సాద్కుంట అని నేను లేదు లేదు పట్నంల మాటిచిన చిన్నపిల్లను ఆమ్మాల్సిందే ఈ సంతనుసాద నా శేతకాదు' అని ఆయన ఇద్దర్కి వాదులాడ అత్త ఎవర్కి జెప్పక పక్కూరు పోయింది. గీగుడ్సె మీద సెత్తలేని మన్ని అని తెల్సిన నన్ను మంచిగ సూస్కుంటడని ఈనకిచ్చి కట్టబెడ్తిరి ఆడ్బిలెన్క ఆడ్బిల్ల కాంగనే అది తట్కోలేక మందుకలవా డయ్యిండు పొద్దు పొడ్సక ముందే సందు



పొంటపోయి మందు తాగి వచ్చి పంతుండు పని బందు పెట్టిండు. నేను అమ్మనీయనంటె మీ అమ్మయ్య అన్నకు జెప్పి రెండెకురాల పొలం రాయించమంట్టుండు. నాకు పెళ్లైన సంది సగిలీక సగలం పంపితిరి ఇప్పుడిట్ల ప్లిను అమ్మతవా? పొలం రాయిస్తవా? అని తెడా బెట్టిమునిమాపున లేసి పోయిండు ఎటుపోయిండో అన్న.. మా అత్తేమో ఏం పట్టనట్టు సందుల పొంట పోయి ఏ ఇంటితాన కులవడ్డదో అన్న' అని గుడ్ల నింద నీల్దెచ్చుకొన్నది. ఆమెను జూస్న అన్నకూ కండ్ల నీళ్లు కమ్ముకున్నాయి.

పగట పూట అతన్కి పోనొచ్చింది అది అతని చుట్టాల నుంచి పోను ఎత్తి 'హో' అన్నడు 'అలో ఎవరు అన్నది అవతలి గొంతు 'ఏంది రాముఅక్క' అనే అతను 'ఒష్ నువ్వా తమ్మి నేను కొత్తపల్లి రాములక్కను మాట్లాడుతున్న' అనె ఆమె 'ఏంది చెపక్క' అని అనె అతను. 'ఇగో మీ బావ సోమయ్యనాతాన్నె ఉండు జల్దిరా తోల్కపోదువు. అయిన తీరు సూస్తే ఈనుంచి దెంకపోతట్టుంది తొవ్వెంట సర్రసర్ర నడ్సుకుంట పోతుంటె నేనుగుర్తు బట్టి ఆపిన. ఆపి ఏవూరంటి? ఒకటి లేదు రెండు లేదు బిత్రిసూపులు సూస్తుండు. ఎండలపడి పాణమల్సి నట్టుంది. కడ్పు పీకపోయి, మొకం పాలిపోయి ఉంది నేనే ఒపావు తాపి కడ్పు సల్ల పుచ్చి మా పడ్డామ ఎండ పొద్దు పోయినంక సల్లపూట పోదువు అని ఆపితి. మంచమేస్తే నిద్రలకు జారిండు. జిల్దిన రా తమ్మి' అన్నదామె అతను మరొకతను ఇద్దరు కూడి బైకు మీద ఎల్లిఅర గంటల ఆ వూల్యఅల్లిండ్రు. బావ నిద్రల మస్తుగా జోగుతుండు. ఈళ్లు పోయి పక్కెంట కులవడ్డరు. ఆమె అతని పెద్దనాన బిడ్డ కావడం చేత విషయం చేరవేసింది. అతను వెళ్లినంక విషయం ఆమెకు చెప్పిండు. అతని బావ సిన్నగ నిద్రల నుంచి మెల్కల కొచ్చిండు. తనకు తన బావమీద ఎక్కడలేని కోపం రావట్టింది. కని తన కోపాన్ని అనచుకుంటూ 'ఏంది బావ ఇట్లజేస్తే ఎట్లా' అని అనె 'ఎట్లేముంది నాకు తోసింది నేను జేస్త. నీ ఇష్టమొచ్చింది నీవుజేస్తలేవా ఏంది? 'అనెబావ, 'అదికాదు బావ' అని నేననంగనే 'ఏదికాదు నీకిద్దరు కొడ్కులు. మరి నా కొద్దా కొడ్కులు' అనె బావ. 'దాన్కి మాచెల్లేంజేస్తది. అదేమన్న అమెచేత్లవుందా, ఏదికమ్మంటే అది కానికే ఇదేమన్న పాతాళభైరవి సినిమానా, అంతా మనవిది కొడ్కంటే బిడ్డపుడ్తది, బిడ్డంటే కొడ్కు పుడ్తడు,'అని నేనంటి. 'ఓయ్ నువెనన్న జెప్పు నామంకు నాదే నీచెల్ల నాకు పిలగాడినన్న కనాలె నీ చెల్లె లేకుంటె నీకున్న రెండెకరాలు రాసియి' 'రాసిస్తగని తీయి' 'ఉత్త మాటలంటె కుదరదు అంద్కె నా బిడ్డను అమ్ముకుంట అట్లన్న దాని దేశ మార్తది నేనా సాదేను కడ్పునిండ తిండి పెట్టలేను బట్టకూ కర్వె ఎవని కన్న కల్గినోన్కి ఇస్తే అదన్న మంచిగ బత్తది' 'మరట్లనే కనుమ పిల్లల్కి జేయరాదు' 'ఆల్లకు మాటలొస్తయి, ఆళ్లు కొన్నోల్లను ఆ పిల్లలు అమ్మయ్య అని పిల్వరు మమ్ముల గుర్తు పడ్తరు అంద్కె పాల్జీకే పిల్లలయితే మమ్ముల గుర్తుపట్టక కొనుకున్న వాళ్లను అమ్మయ్యంటది. అంద్కె సంటిదాన్కి బేరం బెట్న లేకుంటె తతిమ్మ పిల్లలు కుద్దుగ అమ్ముడు' అనే బావరములు 'నువు మట్కుమారవా?' 'ముయ్యి ఏంది మీరనేది మిమ్ముల నల్ల తెల్ల అంట్టున్ననా నా కర్మ కొద్దిగ ఆడ్బిల్లలు పుట్టిరి మరి వాళ్ల ఎవడు సాకా ఏ అంద్కె ఇట్ల' 'ఇన్ని బాదలున్నయిని తెల్సినప్పుడు ఒకరిద్దరు కాంగనే ఆప్రిషను చేపిస్తే అయిపోవుగ' ' నామర్జి, నా తీట. నా తీటకు నీ గుద్దడమా' అని బావ అనె సర్కి అతన్కి ఎక్కడ లేని కోపమొచ్చింది కని ఒర్సుకుని బావ కాళ్లు పట్టుకుండు ఇట్ల చేయకు అని ఎవరెన్ని చెప్పినా ఇన్లె కసాయి మదిరి కన్న కూతుర్ని కల్గిన వారింట్కి అమ్మనె అమ్మిండు చేష్టలుడ్గిన వాడై అతడు ఏమి అనక ఎద్రు పల్కలేని మంగ కన్న పేగు కదలి పోతుంటే దీనంగ కడ్పుల కడ్పులనే దిగమింగి శిలగాదిగమింగి నిలవడిపోయింది. నెలలు నిండని పసిగుడ్డు సిరి మంతుల గడప తొక్కింది. సిరులుండి మూగవోయి చీకట్ల అలుముకున్న అయిల్లు పాప చిరునవ్వుతో కళకళలాడింది.

**కవిత**

# మూడో అడుగు

- పెరుగు రామకృష్ణ
9849230443

ప్రేమించలేని తనమే
మహాపాపం....

ఇన్ని యుగాలుగా భూగోళాన్ని శాసిస్తుంది
మత చరిత్రే..
నీ కీర్తి స్వప్నాల్ని
ప్రాకృతిక సౌందర్యాన్ని
హరిస్తుందీ అదే...

స్వర్గాల దారుల దూరానికి
మతం ఒక కొలబద్ద
దారులు మారతాయి కానీ
కొలబద్ధ మాత్రం ఒక్కటే...



పువ్వుల జాతులు వేరయినా
వాటిది పుష్ప మతమే...

ఏ మతమూ పక్షుల సంభాషణల్ని అనువదించదు
ఏ మతమూ ప్రభాత పుష్పాలతో మనిషిని అభిషేకించి
సంపూర్ణ మానవ సమూహం మధ్యన నిలబెట్టలేదు...

మతం వారధి మాత్రమే... అది ఎప్పటికీ సత్యమవదు
హృదయాల్లోనే కదా
సూర్యోదయాలు.. అస్తమయాలు.. రెండూను...

అదే దేవాలయం అయినప్పుడు
ఇక మతాలెందుకు....?

ఏదో ఒక జీవ ప్రయాణంలో
ఒక్కడో, ఒకచోట ఆగాలి కదా...?
ఆగినప్పుడు దాహం తీర్చుకోవాలి కదా..?
గాలి, నీరు, నిప్పులకు మతాల్లేనప్పుడు
మనుషులకెందుకూ....?

మనిషీ
ఇక్కడ నుంచే
ఈ నేల మీంచే,
పాడు
గొంతెత్తి... గాలిలో మానవత్వపు జెండా ఊపుతూ..
గట్టిగా పాడు
ఒక పాదాన్ని భూమ్మీదనే వుంచి
మరొక పాదాన్ని ఆకాశం చెంతకు చేర్చి,
అప్పుడు మూడో అడుగు ఎక్కడ వేస్తావో
అదే నిజమైన **మానవ ప్రపంచం....!!!**

ప్రస్థానం వెబ్‌సైట్: www.prasthanam.com

**'ప్రస్థానం' కు చందా కట్టండి !**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి !!**



అయిదేళ్లకు : రు. 500 /-
పదేళ్లకు : రు. 1000/-
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-

**5,10** సం॥ల చందా కట్టిన వారికి విలువైన పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
- ట్రాన్స్‌పోర్టు చార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి !!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు: 040-27660013, సెల్ : 9490099059 ఇ-మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

# రాయలసీమ తొలికథ




డా॥ తవ్వా వెంకటయ్య
9703912727

***సర్కారు ప్రాంతంలో ఆధునికత తొందరగా ప్రవేశించటం వల్ల అక్కడ ఆధునిక సాహిత్యం కూడా ముందుగా ప్రవేశించిందని రాచమల్లు రామచంద్రారెడ్డి గారు పేర్కొంటూ “ఆధునిక సాహిత్యరంగంలో సర్కారు సోదరులు సాధించిన ఈ విజయానికి వారి బుద్ధి విభవానికి గానీ, మన బుద్ధి దారిద్ర్యానికి గానీ నిదర్శనం కాదు. నవ్యసాహితీ వికాసానికి మూలకారణమైన నూతన చారిత్రకశక్తులు ఆ జిల్లాలో ముందు తలెత్తడం వల్లనే ఈ వ్యత్యాసం ఏర్పడింది.***

ఆంధ్రప్రదేశంలో ఇతర ప్రాంతాలలో పోల్చి చూసినప్పుడు రాయలసీమలో కథానిక పుట్టుక కొన్ని దశాబ్దాలుగా వెనకబడిందని సాహిత్య విమర్శకులు అభిప్రాయపడ్డారు. దీనికి అనేక కారణాలున్నాయి. రాయలసీమలో ఆధునికత ఆలస్యంగా ప్రవేశించటం, భూస్వామ్య సంస్కృతి వేళ్ళూనుకోవడం, నిరంతరం కరువు కాటకాలు, ముఠాకక్షలు మొదలైన కారణాలు రాయలసీమలో తీవ్రప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా సాహితీరంగంలో ఆధునిక ప్రక్రియల సృజనకు పై కారణాలు అడ్డంకిగా మారాయని చాలామంది సాహిత్యవిమర్శకులు, మేధావులు అభిప్రాయపడ్డారు.

అనంతపురం జిల్లాకు చెందిన గుత్తిరామకృష్ణ రాసిన ‘చిరంజీవి’ అనే కథ 1941 ఆగస్టు నాటి “విజయవాణి” పత్రికలో ప్రచురితం అయ్యింది. దీనినే మొదటి రాయలసీమ కథగా ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు గుర్తించారు. వల్లంపాటి వారి కంటే ముందు కొంతమంది విమర్శకులు చింతాదీక్షితులు రాసిన ‘సుగాలి కుటుంబం’ (1921) అనే కథనే రాయలసీమ నుండి వెలువడిన మొట్టమొదటి కథగా భావించారు. కోస్తా ప్రాంతం నుంచి వచ్చి రాయలసీమలో కథాసాహిత్యానికి దారి చూపాడు చింతాదీక్షితులు. తర్వాత రాయలసీమలోనే పుట్టి కథారచయితగా వెలుగులోకి వచ్చిన గుత్తి రామకృష్ణను వల్లంపాటి వారు మొట్టమొదటి రాయలసీమ కథకుడిగా గుర్తించారు. అటు తరువాత సింగమనేనిగారు, కె. సభాను తొలి రాయలసీమ కథా రచయితగా భావించేవారు. కె. సభా రాసిన మొదటి కథ ‘కడగండ్లు’ (1944) చిత్రగుప్త పత్రికలలో ప్రచురితమయ్యింది. 1944 కంటే ముందు అంటే 1941 లోనే జి. రామకృష్ణ రాసిన కథ ‘చిరంజీవి’ ప్రచురితమయ్యింది. కాలక్రమ దృష్టితో పరిశీలించిన వల్లంపాటిగారు రాయలసీమ తొలి కథారచయితగా జి.రామకృష్ణను గుర్తించారు. కాబట్టి వల్లంపాటి గారి అభిప్రాయ సమంజసమైంది.

రాయలసీమ సాహిత్యం గురించి ప్రాంతీయ దృక్పథంతో ఆలోచించిన మొదటి విమర్శకులు రా.రా. ఈయన ‘వ్యక్తి స్వాతంత్ర్యం సామాజిక శ్రేయస్సు’ అనే గ్రంథంలో “ఈనాటి కడప జిల్లా సాహిత్యం స్థూల రేఖలు” అనే వ్యాసం రాస్తూ రాయలసీమలో ఆధునిక సాహిత్యం వెనుకబడిందని పేర్కొంటూ అందుకు కారణాలను కూడా వివరించారు. సర్కారు ప్రాంతంలో ఆధునికత తొందరగా ప్రవేశించటం వల్ల అక్కడ ఆధునిక సాహిత్యం కూడా ముందుగా ప్రవేశించిందని రాచమల్లు రామచంద్రారెడ్డి గారు పేర్కొంటూ “ఆధునిక సాహిత్యరంగంలో సర్కారు సోదరులు సాధించిన ఈ విజయానికి వారి బుద్ధి విభవానికి గానీ, మన బుద్ధి దారిద్ర్యానికి గానీ నిదర్శనం కాదు. నవ్యసాహితీ వికాసానికి మూలకారణమైన నూతన చారిత్రకశక్తులు ఆ జిల్లాలో ముందు తలెత్తడం వల్లనే ఈ వ్యత్యాసం ఏర్పడింది. ప్రజాజీవితంలో విప్లవాత్మకమైన పరిణామాలు ముందు ఆ జిల్లాలలో ప్రారంభమైనాయి. ఈనాటికి మనకు సర్కారు జిల్లాలలో ఉన్నన్ని హైస్కూళ్ళుగానీ, కాలేజీలుగానీ లేవు. ఈనాటికి అక్కడ

ఉన్నంతమంది విద్యావంతులు మనకు లేరు. దీనికి కారణం కూడా మన బుద్ధిలోపం కాదు. మన ఆర్థిక లోపమే" అని అభిప్రాయపడ్డారు. రాచమల్లు రామచంద్రారెడ్డి గారి అభిప్రాయం ప్రకారం సాహిత్యరంగంలో కోస్తా ప్రాంతానికి కడప జిల్లాకు వ్యత్యాసాలు ఉండడానికి కారణం. ఆర్థిక వెనుకబాటుతనమేనని స్పష్టమౌతోంది.




సమాజంలోని ఆర్థికాభివృద్ధి ఆధునిక సాహిత్యపుట్టుకకు మూలహేతువన్న మార్క్సిస్టు అవగాహనతో రాచమల్లు రామచంద్రారెడ్డి ఇంత సుదీర్ఘ వివేచన చేశాడు.

రాయలసీమ సాహిత్యంతోపాటు తెలుగు కథానిక, నవల మీద సాధికారకమైన విమర్శ రాసిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య "రాయలసీమ ఆధునిక సాహిత్య సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ" అనే గ్రంథం ప్రచురించకముందు రాయలసీమ కథానిక పుట్టుకను గురించి ఒకటి రెండు సందర్భాలలో ప్రస్తావించారు. 1995లో వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'కథాశిల్పం' అనే గ్రంథం రాశాడు. ఇందులో చింతాదీక్షితులు రాసిన 'సుగాలి కుటుంబం' (1921) అనే కథను తొలిరాయలసీమ కరువు కథగా గుర్తించారే గానీ అది రాయలసీమ జీవితాన్ని ప్రతిబింబింపజేసి కథగా పేర్కొనలేదు. అలాగే జి. రామకృష్ణ 1941లోనే కథారచన ప్రారంభించిన విషయాన్ని వల్లంపాటి ఈ పుస్తకంలో ప్రస్తావించలేదు. ఇందులో కె.సభాను రాయలసీమ తొలికథారచయితగా పేర్కొన్నాడు. "కరుణకుమారతో పోల్చదగిన ప్రతిభావంతుడైన కథారచయిత ఆ కాలంలో రాయలసీమలో ఉద్భవించలేదు. ఇలాంటి నిరాశామయ వాతావరణంలో రచన ప్రారంభించిన కె.సభా చిత్తూరు పరిసరాలలో గ్రామీణ జీవితాన్ని కొన్ని కథల్లో గొప్ప అర్ద్రతతో చిత్రించాడు." అని చెప్పాడు.

***1943లో 'చంద్రగుప్త' అనే పత్రికలో 'తూమాటి దోణప్ప' రాసిన 'చంద్రుడు-కలువ' అనే కథ వచ్చినట్టు ఈయన పేర్కొన్నాడు. ఈయన దృష్టిలో అనంతపురం జిల్లా నుండి వచ్చిన మొట్టమొదటి కథానిక ఇదే.***

1996 నాటి కథాశిల్పం పుస్తకంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాయలసీమ జీవిత చైతన్యం చాలా ఆలస్యంగానే ప్రవేశించిందని, తొలి తెలుగు కథ 1910లోనే వచ్చినా రాయలసీమలో కథ ఉదయించడానికి మరో 30-50 సంవత్సరాలు పట్టింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే రాయలసీమలో కథ ఒక గౌరవమైన సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చెందటం ప్రారంభించింది" అని అభిప్రాయపడ్డారు.

ఇదే పుస్తకంలో రాయలసీమ గురించి తొలికథానిక రాసింది 'చింతాదీక్షితులు' అని మొట్టమొదటి సారిగా వల్లంపాటి పేర్కొన్నారు. అయితే ఈ వ్యాసం రాసేనాటికి జి. రామకృష్ణ కథలు రాసిన విషయం వల్లంపాటి గారికి తెలిసినట్టులేదు. కానీ 1958లో 'బొగ్గవరపు రఘునందన్' అనే రచయిత కథానికలు రాశాడని అదే కాలంలో జి. రామకృష్ణ అనంతపురం జిల్లా కరువును గురించి, గంజికేంద్రాల గురించి కథలు రాశాడని ఈ విషయం శాంతినారాయణ చెప్పినట్లు ఈయన పేర్కొన్నాడు.

శాంతినారాయణ 1996లో 'సీమ సాహితీ' పత్రికలో 'అనంత కథ' అనే వ్యాసం రాస్తూ "1910 నుంచే తీరంధ్ర ప్రాంతంలో పుట్టిపెరిగి 1952 నాటికి అంతర్జాతీయస్థాయికి ఎదిగిన తెలుగు కథ తెలంగాణా ప్రజలసాయుధ పోరాట ప్రభావంతో 1940 ప్రాంతాల్లోనే తెలంగాణాలోకి అడుగుపెట్టినప్పటికి, రాయలసీమలోకి 1950 ముందు ప్రవేశించలేకపోయింది" అని అన్నాడు. ఇదే వ్యాసంలో శాంతినారాయణ అనంతపురం జిల్లాలో శంకరవిజయం (1910), పినాకిని (1922), మాతృసేవ (1922), భారతమహిళ (1925) మొదలైన పత్రికలు వస్తున్నా అవి కథానికను ప్రోత్సహించలేదని ఫిర్యాదు చేశాడు. అలాగే అనంతపురం జిల్లాలో 19వ శతాబ్దం నుంచి అనేక సాహిత్య సంస్థలు పనిచేస్తున్నా అవి సంప్రదాయ పద్యరచనలను మాత్రమే ప్రచురించాయే తప్ప కథవైపు దృష్టిని సారించలేదని చెప్పాడు. ఇటువంటి సమయంలో 1943లో 'చంద్రగుప్త' అనే పత్రికలో 'తూమాటి దోణప్ప' రాసిన 'చంద్రుడు-కలువ' అనే కథ వచ్చినట్టు ఈయన పేర్కొన్నాడు. ఈయన దృష్టిలో అనంతపురం జిల్లా నుండి వచ్చిన మొట్టమొదటి కథానిక ఇదే. దీని తరువాత1956-57 మధ్య జి. రామకృష్ణ 'గంజికేంద్రం', 'వడ్లగింజలో బియ్యపుగింజ', 'జొన్నచేను' వంటి కథానికలు రాసినట్లు పేర్కొన్నాడు.

'హరిజనాభ్యుదయం తెలుగు కథానిక' అనే అంశం మీద పరిశోధన చేసిన డా॥ కె. లక్ష్మీనారాయణ 1997 సెప్టెంబర్ 15న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రాయలసీమ కథావికాసం' పేరుతో వ్యాసం రాశాడు. ఆ వ్యాసంలో 1941 నాటి జి. రామకృష్ణగారి 'చిరంజీవి' కథనే తొలి రాయలసీమ కథగా గుర్తిస్తూ డా॥ లక్ష్మీనారాయణ "1941కి పూర్వం కేవలం పురాణ కాలక్షేపం కోసం కథలు వచ్చాయి. నామాలసింగడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి కథలు ప్రచారంలో ఉండేవి. కానీ సామాజిక స్పృహతో కథలు రాలేదు. వచ్చినా ఆ సాహిత్యం గోచరం కావాల్సిఉంది" అని పేర్కొన్నాడు. ఈ

కాలంలోనే శీపిరి ఆంజనేయులు పపూరి రామాచార్యులు ఒకరినొకరు ఆక్షేపణ చేసుకుంటూ 'ప్రేమ విజయం' కథలు రాశారు. రాయలసీమలో 1941 కన్నా ముందు కథాసాహిత్యం ఉందని, అయితే అది సామాజిక స్పృహ కలిగినది కాదని లక్ష్మీనారాయణ భావనగా అర్థమవుతుంది. అయితే ఆ సాహిత్యం వెలుగులోకి రావలసి ఉందని వీరి అభిప్రాయం.

రాయలసీమ కథానికకు రూపురేఖలు దిద్దిన మధురాంతకం రాజారాం 'తెలుగు కథకులు - కథనరీతులు' మొదటి సంపుటంలో కె. సభా కథాసాహిత్యాన్ని గురించి వ్యాసం రాస్తూ, రాయలసీమలో ఆధునిక సాహిత్యం సంచలనం కావడానికి నాలుగు కారణాలను పేర్కొన్నాడు. ''ఉత్తరాంధ్రాలో చింతాదీక్షితులు, చలం, కుటుంబరావు, గోపిచంద్, బుచ్చిబాబు, పద్మరాజులాంటి వారు మిగలిన రచయితలు విరివిగా సాహిత్యకేదారాలు పండించే (1945-50) నాటికి రాయలసీమలో చెప్పుకోదగ్గ రచయితలు ఒక్కరైనా లేరు" అని అభిప్రాయపడ్డారు. కె. సభాను రాయలసీమలో కథాసాహిత్యానికి ఆద్యుడుగా మధురాంతకం గారు భావించారు.

ప్రముఖ కథారచయిత కేతువిశ్వనాథరెడ్డి 'దృష్టి సాహిత్య వ్యాస సంపుటి'లో 'కడప జిల్లాలో కథారచన' అనే వ్యాసం రాస్తూ కడప జిల్లా మొదటి కథా రచయిత ఎవరూ? అనే అంశాన్ని చర్చిస్తూ భారతం నాధమునిరాజు "నీలవేణి" కథలను ప్రచురించాడని, నాదమునిరాజే కడప జిల్లా తొలి కథకుడని పేర్కొన్నాడు.

**ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఆరు ఆధారాలు లభిస్తున్నంతలో రాయలసీమ తొలి కథ అని 'చిరంజీవి' కథను చెప్పడంతో తొలిరాయలసీమ కథాచర్య పూర్తికాలేదన్న స్పృహ ధ్వనిస్తుంది.**

మరో ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ 1998న 'ప్రజాసాహితీ'లో 'రాయలసీమ కథా చిత్రం' అనే వ్యాసం రాశారు. అందులో "రాయలసీమలో కథ' నవల వంటివి చాలా ఆలస్యంగా ప్రారంభమైనవని పేర్కొని, అందుకు కారణాలను వివరిస్తూ ''స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమలో ఆధునిక కథ దాదాపు లేనట్లే, స్వాతంత్ర్యానంతరమే రాయలసీమలో కథానిక ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకుందని మనం భావించవచ్చు. కె. సభాగారిని రాయలసీమలో తొలి తెలుగు కథకుడిగా గుర్తించవచ్చు." అని అభిప్రాయపడ్డారు. అక్కడితో ఆగకుండా, ఆయన ''సభా గారు చిత్తూరు జిల్లాలో కథలు ప్రారంభించేనాటికి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుండి కథలు పుట్టుకొచ్చిన దాఖలాలు లేవు॥ అన్నారు. అయినప్పటికీ ఈయన 1941 నాటి జి. రామకృష్ణగారి 'చిరంజీవి' కథను తొలి సీమకథగా గుర్తించారే గానీ ఆయనను తొలిరాయలసీమ కథకుడిగా పేర్కొనలేదు.

ప్రముఖ సాహిత్య విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 1999 అక్టోబర్ 26న ఆంధ్రభూమి దినపత్రికలో 'అనంత కథకులు దళిత కథనం' అనే వ్యాసం పేరుతో రాయలసీమ కథ గురించి రాస్తూ "రాయలసీమలో 1940 ప్రాంతాల్లో పురిటినొప్పులు మొదలైన 1950 తరువాతనే సలక్షణమైన కథానిక పుట్టింది. రాయలసీమలో చిత్తూరు జిల్లా నుండి కె.సభా, అనంతపురం జిల్లా నుండి జి. రామకృష్ణ ఒకే సమయంలో కథారచన ప్రారంభించారు. జి. రామకృష్ణ స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయులు, కమ్యూనిస్టు, ఆయన రాసిన మొదటి కథ 'చిరంజీవి' ఇది విజయవాణి పత్రికలో 1941 మార్చి 26 సంచికలో అచ్చయింది. ఆధారాలు లభిస్తున్నంతలో ఇది తొలి రాయలసీమ కథ" అని అన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఆరు ఆధారాలు లభిస్తున్నంతలో రాయలసీమ తొలి కథ అని 'చిరంజీవి' కథను చెప్పడంతో తొలిరాయలసీమ కథాచర్య పూర్తికాలేదన్న స్పృహ ధ్వనిస్తుంది. ఈయన అనంతకథాశిల్పి సింగమనేని' అనే మరొక విమర్శనా వ్యాసాన్ని రాస్తూ రాయలసీమలో 1940 నాటికిగానీ అనేక కారణల వల్ల కథానిక మొదలుకాలేదని తెలిపారు. ఈయన 'అశాంతిబ్రతుకులశిల్పి శాంతినారాయణ అనే మరో వ్యాసంలో 1935 ప్రాంతాల్లోనే చిలుకూరి నారాయణరావు 'తరువాత?' కథను రాశాడని పేర్కొన్నారు. దీనిని బట్టి జి.రామకృష్ణ కంటే ముందే రాయలసీమలో కథానకి ప్రారంభం అయ్యిందని రాచపాళెం గారి అభిప్రాయంగా గుర్తించాలి. అయితే ఇదే వ్యాసంలో రాచపాళెంవారు తూమాటి దొణప్ప, సర్దేశాయి తిరుమలరావు వంటివారు కూడా కథలను రాసినట్లు తెలిపారు. వాటి ప్రచురణ వివరాలు తెలియరావడం లేదు.

రాయలసీమ కథల మీద పరిశోధన చేసిన వేంపల్లి గంగాధర్ ఇటీవల (2010) నాలుగు వ్యాసాలు ప్రచురించారు. వాటిల్లో రాయలసీమ తొలికథా చర్య తీసుకొచ్చాడు. "రాయలసీమ కథలకు ఆద్యులు" అనే వ్యాసంలో ఇదివరకటి పరిశోధకులు, విమర్శకులు చెప్పిన 1941 నాటి జి. రామకృష్ణ రాసిన 'చిరంజీవి' కథనే తొలిరాయసీమ కథగా గుర్తించవచ్చని అభిప్రాయపడ్డారు. చిత్తూరు జిల్లాలో కె.సభాను, కర్నూలు జిల్లాలో శ్రీ మహావిష్ణువును, కడప జిల్లాలో నాదమునిరాజును తొలికథలుగా గుర్తించారు. అంతేకాదు 1941 నాటికిగానీ సీమలో మొదటి కథ నమోదు కాలేదన్నారు. అలాగే 1910లోనే అనంతపురం జిల్లాలో పత్రికలు ప్రచురించబడినా కథకు

మాత్రం పునాది పడలేదన్నారు. 'రాయలసీమ కథాసాహిత్యం' అనే మరో వ్యాసంలో గంగాధర్ ఇదే విషయాన్నే పునర్వక్తీకరించారు. అలాగే మూడు తరాల కథసేద్యం అనే మరొక వ్యాసంలోకూడా ఇవే అంశాల్ని ప్రస్తావించారు.

శశిశ్రీ ప్రముఖ కథారచయిత, విమర్శకులు, రాయలసీమ తొలికథా రచయిత చర్చపై ఈయన కూడా దాదాపు వల్లంపాటి, సింగమనేని వారి అభిప్రాయాలనే ఏకీభవించారు. శశిశ్రీ కూడా అందరిలాగే 1941నాటి జి. రామకృష్ణ కథనే తొలిరాయసీమ కథగా నిర్ధారించారు.

**పై పరిశోధకుల విమర్శకుల అభిప్రాయం ప్రకారం**

– రాయలసీమ గురించి తొలికథ రాసిన రాయలసీమ చింతా దీక్షితులు రాయలసీమ వాసి కాదు. గోదావరి జిల్లాకు చెందిన ఈ యన 1921లో 'సుగాలికుటుంబ' అనే కథను రాశాడు. రాయలసీమ జీవితం గురించి వెలువడిన మొదటి కథయిదే.

– అనంతపురం జిల్లాకు చెందిన 'గుత్తి రామకృష్ణ' రాసిన 'చిరంజీవి' కథతో రాయలసీమ కథానిక ప్రారంభమైంది. ఈయన రాయలసీమ మొదటి కథకుడు 1941 మార్చి 16న 'విజయవాణి' పత్రికలో ప్రచురితమైన 'చిరంజీవి' అనే కథానిక రాయలసీమ కథకుల మీద పడలేదు.

– గుత్తిరామకృష్ణ కన్నా ముందు తూమాటి దొణప్ప, చిలుకూరి నారాయణరావు, సర్దేశాయి తిరుమలరావు వంటి కొందరు కథారచన చేసే ప్రయత్నం చేశారు.

–రాయలసీమలో 20వ శతాబ్దంలో ప్రారంభంలోనే అనేక పత్రికలు మొదలైనా అవి రాయలసీమ రచయితలను కథారచన వైపు మళ్ళించలేకపోయాయి.

– రాయలసీమలోకి ఆధునికత ఆలస్యంగా ప్రవేశించటంతోనే ఇక్కడ కథానిక పుట్టుక కూడా ఆలస్యంగా వచ్చిందనేది మరొక వాదన.

పై విషయాలన్నింటిని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆధునికత ప్రజాజీవితంలోకి ప్రవేశిస్తే తప్ప ఆధునిక సాహిత్యం వ్యాపించదనే విషయం వీరిలో ప్రబలంగా ఉన్నట్లుంది. ఈ సిద్ధాంతం సరైనదే అయినా తెలంగాణా కూడా రాయలసీమలాగే వెనుకబడిన ప్రాంతం. నిజాం పరిపాలన అక్కడి ప్రజలను కూడా ఆధునికత నుండి దూరం చేసింది. అయినా అక్కడి సాహిత్యవిమర్శకులు, పరిశోధకులు, బండారు అచ్చమాంబను తమప్రాంతం రచయిత్రి అని, ఆమె 1902లోనే 'ధన త్రయోదశి' అనే కథను రాశారని చెప్పుకుంటున్నారు. నరహరి గోపాలకృష్ణమశెట్టి కన్నా ముందే అక్కడ నవలా రచన జరిగినట్లు కూడా వాళ్లు అభిప్రాయపడుతున్నారు. ఇది ఎలా సాధ్యమయ్యిందని ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాయలసీమలో కూడా మన పరిశోధకులు, విమర్శకులు పేర్కొనట్లు నిజంగానే 1941కి ముందు కథానిక పుట్టలేదా? అనే ఆలోచనతోనే నా తొలి సీమ కథ సాహిత్య అన్వేషణ సాగింది.

*రాయలసీమలో కూడా మన పరిశోధకులు, విమర్శకులు పేర్కొనట్లు నిజంగానే 1941కి ముందు కథానిక పుట్టలేదా? అనే ఆలోచనతోనే నా తొలి సీమ కథ సాహిత్య అన్వేషణ సాగింది.*

సమాజంలోకి ఆధునికత ప్రవేశించకుండానే 1872లోనే నరహరి గోపాలకృష్ణమశెట్టి, 'శ్రీరంగరాజచరిత్రను' ఎలా రాయగలిగారు? ఆధునికత ప్రవేశించకుండానే కట్టమంచి రామలింగారెడ్డి 1899లోనే 'కళాపూర్ణోదయం' ప్రశంస అనే విమర్శను 'ముసలమ్మ మరణం' అనే ఆధునిక కావ్యాన్ని ఎలా రాయగలిగారు? ఆధునికత ప్రవేశించకుండానే ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు ఇతోధికంగా ఆధునిక స్పృహతో నాటకాలు ఎలా రాయగలిగారు? కల్వటాల జయరామారావు 1925లోనే 'రేనాటి వీరులు' నవలను ఎలా రాయగలిగారు? ఇవన్నీ ఆలోచించాల్సిన అంశాలు'' రాయలసీమ నుంచి 20వ శతాబ్దం ప్రారంభంలోనే శంకరవిజయం (1910) వినాకిని (1922), మాతృసేవ (1924), భారతమహిళ (1925) అనే పత్రికలు వచ్చాయి. ఈ పత్రికలేవి సీమ రచయితలను కథానిక రచనవైపు మళ్ళించలేకపోయాయని వీళ్ళు అభిప్రాయపడ్డారు.

పై విమర్శకులు పేర్కొన్న పరిధులను, పత్రికలను దాటి లోపలికి వెళ్ళితే 1941కి ముందే రాయలసీమ నుంచి చాలా కథానికలు వచ్చాయని ఆ కథలను ప్రచురించిన పత్రికలను గమనిస్తే తెలుస్తుంది. రాయలసీమ నడిబొట్టులోని కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి వెలువడిన 'భారతకథానిధి' అనే పత్రిక, పైన పేర్కొన్న విమర్శకుల దృష్టిలో పడినట్లు లేదు. ఈ పత్రిక ప్రొద్దుటూరు నించి 1926 జూలై నుంచి 1930 ఆగస్టు దాకా నడిచింది. ఈ పత్రికే రాయలసీమ కథకు తొలిపట్టం కట్టింది. ఈ పత్రికే రాయలసీమ కథలకు పెద్దపీట వేసింది. అనంతపురం నుండి వెలువడిన శ్రీసాధన పత్రికలో 18 కథలు వచ్చాయి. వీటిని 8 మంది రచయితలు రాశారు. అలాగే కడప నుండి 1948లో వెల్లాల రామకృష్ణశాస్త్రి సంపాదకత్వంలో

## కవిత

# రాత్రి



**కనుపర్తి విజయ లక్ష్మి**
**9441382303**

*దుఃఖమంతా ఘనీభవించి ఘనీభవించి*
*చీకటి ముద్దలా ఆవరించిన రాత్రులు*
*వద్దు వద్దంటున్నా జరిగిపోతున్న సంఘటనల*
*పాత జ్ఞాపకాల దుఃఖపుటలలు చుట్టుముట్టి*
*ఉక్కిరి బిక్కిరి చేస్తూ దిక్కుతోచకుండా చేసే రాత్రులు*
*పగలంతా ఖరీదైన సిల్కు ముఖంపై పులుముకొన్న నవ్వుతో*
*పయట చాటున దాచిన దుఃఖం, నవ్వులో విషాదం*
*ఒక్కసారిగా రాత్రి దాడి చేసే చీకటితో కలిసి*
*మరింత దుఃఖ సాగరం లోకి నన్ను నెట్టివేస్తూ*
*గడ్డకట్టిన దుఃఖాన్ని ద్రవీకరించి*
*కన్నీటి ప్రవాహాలుగా మారుస్తూ*
*మరచి పోదామనుకొనే విచారపు శకలాలను*
*ఒక్కొక్కటి ఎక్కడ లేని ఐకమత్యంతో ఏకమై*
*నా మీద దాడి చేస్తోంటే పారి పోదామన్నా వీల్లేని*
*విచారం నా చుట్టు ఆవరించి గుండె బరువెక్కితే*
*బరువెక్కిన గుండెను ఏ గూట్లో పెడతావని*
*వెక్కిరించే రాత్రులు*
*ఎంత క్రూరమైనవి నిశ్శబ్దాన్నే కాక గొప్ప అలజడిని*
*అశాంతిని నెత్తి మీద దిమ్మరించేవి ఈ రాత్రులు*
*చీకటిని చిక్కగా అలముకొన్న రాత్రులు*
*దుఃఖాన్నీ దట్టంగా అలుకుతాయి*
*ఒంటరిని చేసి తుంటరిగా నవ్వుతుంటాయి*
*అయినా ఓ రాత్రీ! ఎంత సేపులే నీ బడాయి! ఓ పది*
*గంటలేగా*
*వెలుగు వచ్చేంత వరకేగానీ మిడిసిపాటు*
*వెలుతురుతో పాటు చిట్లిపోయిన దుఃఖపు దుప్పటిని*
*అవతల పారేసి నవ్వుల నగారాను మోయిస్తూ లేస్తాను*
*పగటి వెలుగుల కాంతిలో చిన్నబోయిన నిన్ను మరచిపోతాం*
*కాని నీవు మమ్ము వదలవు ఎంతిష్టమో మేమంటే*
*చీకటితో పాటు చీకాకుల తలుపులు తెరుస్తావు*
*చిందరవందరైన దుఃఖపు పోవుని చక్కగా ఒక దగ్గరకు*
*చేరుస్తావు, దుఃఖించమని ఆదేశిస్తావు*
*తీయనిరాత్రులు, తేనెలరాత్రులు మరపురాని రాత్రులునాకు లేవు*
*నాకు తెలిసింది పడకపై చేరగానే ఘనీభవించిన*
*దుఃఖాన్నంతా*
*నీరులా ప్రవహింపజేసే నీ కరకుతనమే*
*అందుకే నీ వంటే నాకు భయం, అయినా నిన్ను*
*తప్పించుకొనే దెలా ఓ రాత్రి*

---

వచ్చిన భారతజ్యోతి అనే రాజకీయపత్రికలో కూడా 8 కథలు వచ్చాయి.

పై పత్రికలలో వచ్చిన కథలన్నీ 'చిరంజీవి' కథానికలాగా సమకాలిన సామాజాన్ని ప్రతిబింబించేవి కాకపోయినా రాయలసీమ ప్రజాజీవితాన్ని కొంతవరకు తెలియజేశాయి.

ఈ కథలు రాసిన కథకులెవ్వరికి కూడా తెలుగు సాహిత్య చరిత్రలో స్థానం లేదు. కులం, మతం, స్త్రీ వివక్ష, కన్యాశుల్కం, వరకట్నం, నీతి, ఆధ్యాత్మికం మరియు సంప్రదాయానికి సంబంధించిన అంశాలపై వీరు తమ కథలు రచించారు. శ్రీయుత అయ్యగారి నరసింహమూర్తి 1926 జూలైన రాసిన 'మతభేధం' కథను రాయలసీమ తొలికథగా గుర్తించవచ్చు. ఈ కథ మతం కంటే మానవత్వం గొప్పదని ప్రబోధించింది. కథాస్థలం కూడా కడప జిల్లా పెండ్లిమర్రి గ్రామం. ఆ ఊర్లో మాధవరాయుడు, వెంకటసుబ్బమ్మలకు నాగరాజు అనే కుమారుడు ఉండేవాడు. అతని భార్య సుగుణవతి. ఓ రోజు నాగరాజుకు జ్వరం వచ్చి మంచాన పడ్డాడు. నాగరాజు భార్య తన భర్తకు వైద్యం చేయించాలని పక్కగ్రామానికి చెందిన సాహెబ్‌ను పిలపిస్తుంది. సుగుణవతి అత్త, సాహెబు ఇంట్లోకి రావడానికి ఒప్పుకోదు. తాము బ్రాహ్మణులమని సాహెబులను ఇళ్ళలోకి అడుగుపెట్టనివ్వమంటుంది. సుగుణవతి తమకు మతాలు ముఖ్యం కాదని తన భర్త ప్రాణాలు ముఖ్యమని అత్తను తోసివేసి సాహెబును ఇంటిలోకి పిలిపించి భర్తకు వైద్యం చేయించి నయం చేయించుకుంటుంది." సంక్షిప్తంగా కథ ఇది. ఇందులోని కథావస్తువు, కథాశిల్పం ఏ ఆధునిక కథకు తీసిపోదు. దీనిని కాలక్రమ దృష్టితో పరిశీలించినప్పుడు అయ్యగారి నరసింహమూర్తిగారి 'మతభేధం' కథ మొట్టమొదటి రాయలసీమ కథగా తోస్తుంది.

## కవిత

# అమ్మలు మాటలు

– మాధవీ సనారా
9440103134



మాటలు
వెన్నెలలా వేసవిలా వ్యాపిస్తాయి
పెదవులపై నుంచి మదిగదుల్లోంచి
కళ్ల కాసారాల్లోంచీ వ్యాపిస్తాయి మాటలు
వాదాలు సృష్టిస్తాయి వేదనలు కూడా కలిగిస్తాయి
మకరందాలు మాధుర్యాలూ ఒలకబోసే మాటలు
దసరాలో బాణాలతో పిల్లలు విసిరే పూవులు కూడా
లిఖించబడిన తాళపత్రాల దశ నుంచి
నేటి యంత్రపూరిత సాధనాల వరకు
పరిరక్షింపబడినవి అక్షర రూప మాటలు
భూమిపొరలు చీల్చుకొని అట్టడుగు నుంచి బయటికొచ్చి
మన అవసరాలు తీర్చే జలాలు మాటలు
తుంటి నుంచి మింటికి ఎగబ్రాకించేవి మాటలే
అప్రమత్తత అంగరఖా ధరించకపోతే అపుడపుడూ మాటలు
మాయ చేస్తాయ్, మరులు గొలుపుతాయ్
మత్తులో ముంచి వివాదాల గోతిలో దించుతాయ్
మనం పోల్చుకోలేని మారు వేషాల్లోనూ ఉంటాయ్
అయినా గొప్ప సంపదలు మనం పరిరక్షించుకోవలసిన మాటలు
అనుకూల రాగాలు ఆలపించేవైనా
ప్రతికూల ప్రభంజనాలు విసిరేవైనా
వాటిని ఒకేలా తలదాల్చి
నిచ్చెనలుగా చేసుకుంటేనే జయాలు.. విజయాలు
పరిరక్షించుకోకపోతే
కొన్ని రూపాల్లో అంతరించిపోయినా
అనేక రూపాల్లో నిలిచి ఉండే అమ్మలు – మాటలు

---

# ప్రపంచీకరణ

అగతముడి మరియదాసు
9490596240

ప్రపంచీ కరణం
ఒక కనిపించని
సుడిగుండం

అందులో పడి
మన భాషలు, సంస్కృతులు
మటుమాయం

చిన్నారి దేవుళ్ళ
చిలక పలుకుల బళ్ళు
బాల్యం బంధి ఖానా

ప్రపంచం ఒక కు గ్రామం
ఇంటర్నెట్‌లూ
ఛాటింగ్‌లూ

పదహారేళ్ళ అమ్మాయి
పండు ముదుసలితో
నెట్‌ప్రేమ




ప్రపంచీకరణం అంటే ఏమిటి
దాని చెడు ఫలితాలేమిటి
అన్న మిత్రునితో

చల్లగాలి కోసం నదీ తీరానికి వెళ్ళిన జంట
వాటర్ బాటిల్ కొని నీరు తాగడం చూసి

కొబ్బరి కాయలు అమ్మే కుర్రాడు
దాహానికి కోక్ తాగడం చూసి

పల్లెల్లో పిల్లలు
పిండి వంటలకు బదులు
పిజ్జాలు బర్గర్‌లు తినడం చూసి

ప్రపంచీకరణం అంటే
ఏమని చెప్పగలను?
ఎన్నని చెప్పగలను?




చిన్న కథ

# ఆలింగనం


మలయాళ మూలం : పి.కే. పారక్కడవు

తెలుగు సేత : ఎల్. ఆర్ . స్వామి

9949075859


'పాత గుమ్మాలు,తలుపులు అమ్మకానికి' అనే బోర్డు చూసి ఆగాడు అతడు. ఒక నిమిషం ఆలోచించిన తరువాత లోపలకు వెళ్ళాడు.

ఒక పెద్ద చెట్టుక్రింద నిలబెట్టిన గుమ్మం వద్దకు వెళ్ళి జాగ్రత్తగా పరిశీలించాడు. ఆప్యాయంగా తడిమి అది తాను కట్టే ఇంటిగుమ్మానికి సరిపోతుందని అనుకున్నాడు.

ఆ చెట్టుని బాధగా చూసి అంది గుమ్మం.''ఒకానొకప్పుడు నేను కూడా నీలా అనంతాకాశంలోకి చేతులు జాపి స్వతంత్రంగా నిలబడేవాడ్ని. ఏం చెప్పను,నా ఖర్మ ! నన్ను ఒక గుమ్మంగా మార్చి ఇంటిముందు ప్రతిష్టించారు.ఆ తరువాత ఇంటిలో వాళ్లు చేసిన చెత్త పనులన్నిటికీ సాక్షిగా నిలబడవలసి వచ్చింది. మరో సారి ఆ వేషం వేయలేను.''

చెట్టు బుర్ర ఊపింది. రహస్యంగా గాలికి కబురు పెట్టింది. చెట్టుతో ఏవేవో గుసగుసలాడింది గాలి.

చెట్టు చేతులు జాపి అతన్ని కౌగిలించుకుంది. భూమి అనే మెత్తని పరుపుమీద వాలారు వాళ్ళు. కొమ్మలూ ఆకులూ కదిలాయి. ఆ తరువాత ఏదో నిర్వృతితో ఆకులు కళ్ళు మూసుకున్నాయి.

మట్టిపై నెత్తుటి తడి.

అతనికోసం తన గర్భపాత్ర తెరిచింది భూమి.

కానీ ఆ పాత బోర్డు ఇంకా అక్కడే ఉంది . 'పాత గుమ్మాలూ తలుపులూ అమ్మకానికి'

# జన జీవన రాగంలో ... కన్నెగంటి పాటలు




- కొండ్రు బ్రహ్మం
9949459409.

ప్రజా ఉద్యమానికి పాటే ఊపిరి. ప్రజల గాయాలన్నీ తన గేయాలుగా వచ్చిన గేయరూప కవిత్వం "జన జీవన రాగంలో"... ఈ పుస్తక రచయిత కన్నెగంటి వెంకటయ్య ప్రజా వాగ్గేయకారుడుగా కనిపిస్తడు. తను అనుభవించిన, చూసిన సన్నివేశాల్ని, అనుభూతుల్ని పాటగా మలిచాడు. పాటల ఊటై పరుగులెత్తుతడు కన్నెగంటి.

పుస్తకాన్ని పరికిస్తే ఒక సారాయి ఉద్యమం చరిత్ర మనకగుపిస్తది. 1990ల్లో వచ్చిన సారాయి వ్యతిరేక ఉద్యమంలో బహుళ ప్రచారంలోకి వచ్చిన గేయం "అక్కో సారాయి చుక్క" – ఈ పాటలో పేదవాడి బతుకుల్ని తాగుడు మహమ్మారి ఎలా కబళించిందో రాశాడు – ఆదివారంనాడు ఆవుల సంతలో/ ఐదు రూపాయలకే లీటరొస్తుందని/ ఆశతో ఆదెమ్మ మొగుడు తాగినాడె / అమ్మోనియెక్కువై అంగిట్లో వుంటాడు. మత్తు దిగకముందే మట్టయిపోయాడే – అంటూ తనువులారిన పేదోడితన్లాట కనిపిస్తది. అంతేగాక ఓట్లు వచ్చాయంటే గూడేల్లో ఔట్లు పేలాల్సిందే. సారాయి వరదలై పారుద్ది. ఓట్ల పండుగనాడు సీట్లకోసం జనం/నోట్లోన సారాయి ధారగా పోసింద్రు / మల్లన్న, యల్లన్న మత్తుగా తాగింద్రు – అంటూ కన్నెగంటి పాలకుల కుట్రల్ని కడిగేసిండు.

కేవలం సారాపాటలే కాదు, అంతరిస్తున్న ప్రకృతి అందాలను సైతం చూసి చలించి ఆలాపిస్తడు. సీతాకోక చిలుక బతుకు చిద్రమైన విషయం ఇలా అంటాడు. ఒంటినిండా బొంత ధరించి / గొంగళిపురుగై ఉన్నపుడు / గూటిలో ఏమాయ జరిగెనో / పూర్వ రూపమంతా పోయి / అతిలోకపు అందాలన్ని / అణువణువున నింపుకొని ... పంటలనాశించే/ పురుగులను అంతం చేసే/ విషపూరిత రసాయనాలు / కసిరికాటు వేశాయా అంటూ సీతాకోక చిలుక పరిస్థితిని వివరిస్తడు. దాని బతుకు మూడునాళ్ళ ముచ్చట కావడం రచయిత భరించలేకపోయాడు." అన్నా పుల్లన్న' పాటలో అడవులు అంతరించిపోవడాన్ని తెలిపాడు. ఆనాటి అడవులు ఏవన్నా పుల్లన్నా / పక్షుల కిలకిలలు ఏవన్నా అంటూ వ్యధాభరిత జీవుల గాధను వివరించాడు. నాగరికత సాధిస్తున్నాదనుకున్న మనిషి భూతదయను విడనాడి నరకప్రాయుడవుతున్నాడు.

ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్, దేశభాషలందు తెలుగు లెస్స అన్న భాష గొప్పదనం గురించి నా తెలుగు భాష/దీపించు మణిపూస / దేశభాషలందు తెలుగు లెస్స / ద్రావిడ భాష శ్వాస / అమరావతీ స్థూపం / అలనాగబు పదం/ ప్రాచీన చరితకు సాక్షి / ప్రసరించే తెలుగు కీర్తి అంటాడు.

కోటి ఆశలతో కళాశాలకు పంపిన తమ పిల్లలు విలవిలలాడటం చూసిన తల్లిదండ్రుల వ్యధను కళ్ళముందుంచాడు. 'ర్యాగింగ్ చీడ' అను పాట ద్వారా 'చదువుల పూదోటకు / పట్టెను ర్యాగింగ్ చీడ / గుండె రగులుతుంది దీని ఆగడాలు జూడ అంటూ రచయిత ర్యాగింగ్ అకృత్యాలను అంతమొందించాలంటాడు.

కూరగాయాలు, పెట్రోల్ మంటలు, నిత్యావసరాలు చుక్కలకు పోటీ పడుతుంటే పండుగనాడు కూడా పచ్చిపులుసయ్యే పరిస్థితి. సగటు ఉద్యోగి కూడా సరుకులు కొనలేక చతికిలపడుతుంటే, ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటి. ఏం కొనేటట్లు లేదు, ఏం తినేటట్లు లేదు అనే పాట అక్షరసత్యమై అనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తే ఈ పాట సక్కగ సరిపోతుంది. "ఇంగెట్ల బతుకుదాం" అనే పాటలో మాయన్న వచ్చెనని/ కోడిగుడ్డు పులిసొండి పెడదామని / చిల్లర దుకాణ కొట్టుకుపోయి / ఉల్లిగడ్డలరకేజి ఇమ్మని / ఐదు రూపాయలు శేటుకు యిత్తే / ఎర్రని కళ్ళతో నొసలెగిరేసి / కేజీ ఇరవై రూపాయలంటే / కొయ్యకుండానే నీళ్ళు తిరిగినయ్ అంటూ సగటు జీవి గుండెల్ని పిండేశాడు.

"ఇది మనసుకు తగిలిన గాయం" అనే పాటలో తన గాయాల గేయాలు వినిపిస్తాడు. ఇది మనసుకు తగిలిన గాయం / ఎవరికి తగదీ అన్యాయం / అట్టడుగు కులంలో పుట్టటమేనా / అవమానాలకు మూలం అను ఆవేదన వెలిబుచ్చాడు. దేవుళ్ళను కూడా కులాల వారీగా విభజించే కుసంస్కృతికి స్వస్తి చెప్పాలంటాడు. – గ్రామ దేవత ముత్యాలమ్మకు / కులాల వారీగా గుడికట్టారే?!/ బతుకమ్మ పాటల్లో మీవెంట / మా అమ్మలక్కలను రానీయరే? / కొండమీద కోదండరాముని / మొక్కుని తీర్చగ గుడికెళితే / గోత్రం చెప్పంగానే మంత్రం / కోప చేసిందే శఠగోపం లేదందే – ఇది కాదా గాయం.

కుల రహిత సమాజం కావాలని ఊకదంపుడు ఉపన్యాసాలు మాని కార్యరూపం దాల్చే మాటలనండి. ఇన్ని చట్టాలున్నా సమస్య తీరదేం. దీనికి కారణమెవరు కనీసం ఇల్లు కూడా కిరాయికి ఇవ్వని దైన్యం దాపురించింది. పంచ భూతాలకు లేని కులం మనుషులకెందుకని తన మనసు గాయాన్ని వినిపించాడు కవి.

వేడుకల్లో స్వాగత గీతాలకు కన్నెగంటి పాట వేకువ కూతలా వెన్నెల జలతారులా జాలువారుతుంది. పాట ద్వారా పదుగురికి స్వాగతం చెప్పడం రచయిత ప్రత్యేకత. ‘స్వాగతం సుస్వాగతం’ గీతం అందుకుదాహరణ. జ్ఞానజ్యోతిని వెలిగించే గురువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కళగళార్పణము చేసే కళాకారులు, పాత్రికేయులు, కార్మికులు, కర్షక, సైనికులకు మొదలగు వారందరికి స్వాగతం చెప్పే గీతం స్వాగతతోరణంలా అనిపిస్తది.

‘స్వాతంత్రం కోసం’ పాటలో తెల్లదొరగాళ్ళ పీచమణిచిన / విల్లంబుల అల్లూరిని తలచి / ప్లాస్టిక్ పదార్థ బలిపీఠంపై / చేతివృత్తులను సంరక్షింపగా” అని చెప్తూ పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పదమంటాడు. దేశాన్ని ప్లాస్టిక్ రహిత, హరిత దేశంగా మార్చ పదమంటాడు. అల్లూరి వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు పిలుపిస్తున్నాడు.

> **వేడుకల్లో స్వాగత గీతాలకు కన్నెగంటి పాట వేకువ కూతలా వెన్నెల జలతారులా జాలు వారుతుంది. పాట ద్వారా పదుగురికి స్వాగతం చెప్పడం రచయిత ప్రత్యేకత. ‘స్వాగతం సుస్వాగతం’ గీతం అందుకుదాహరణ.**

రాత్రనక, పగలనక రెక్కలు ముక్కలు చేసుకొని జీవనం కొనసాగిస్తూ వెన్నుముకగా నిలిచిన రైతన్న దీనగాథను “రైతు బతుకు” అనే పాటలో చూస్తాం. రైతన్న అప్పుల కొలిమిలో కాలుతూ, పురుగు మందుల పెరుగన్నాలు తింటూ తనువు చాలిస్తుంటే దేశం గతి ఏమైపోవాలి అంటూ ప్రశ్నిస్తాడు. కల్తీ విత్తనాల ఎరువులు / పురుగు మందుల నిలుపు చేయక / అధిక ధరలకు కారణం / రైతు మద్దతు ధరేనంటూ / బొంక జూపిన నోళ్ళు మూయగ/ సంఘశక్తిని చాటి చెప్పగ / రైతు బతుకున వెలుగునింప / ఎత్తరా మన పోరు జెండా – అంటూ సమస్యలు తీరాలంటే రైతుకూలి సంఘాలు పెట్టి సంఘటిత పోరాటాలే శరణ్యమంటాడు.

మకిలి బట్టలుతికి మానవాళిని మల్లెపువ్వులా తయారు చేసే మహనీయులు రజకులు. నేడు వారెంతో అనాదరణకు గురౌతూ, శ్రమదోపిడీకి బలౌతూ వాషింగ్ మిషన్లలో వేసిన బట్టల్లా నలిగిపోతున్నారు. ఒకప్పుడు తెలంగాణలో దొరలగడీల్లో దుర్భర బతుకీడ్చిన రజకుల పక్షాన పోరాడాలంటూ స్వేచ్ఛాయుత వాతావరణం వారికి కల్పించాలంటూ ఈ పాటలో చెప్తడు – విదేశీ వ్యాపారుల (డ్రై వాషింగ్ మిషన్లొచ్చి / పేద రజక పనివాళ్ళ / పొట్టగొడుతున్నాయి / భూస్వాముల పెత్తందార్ల / ఆగడాల అంతుజూడ / రజక వృత్తిదారులంతా / దండుగ బయలెల్లుదాం – అంటూ పోరాట పటిమ ప్రదర్శిస్తాడు.

కాళోజిపై ‘నిజం కవి’ పాటలో “కాళోజి నిజంకవి / ఉదయించే సూరుడివి / నిను మరువదు ఈ భువి / నీ కవిత చిరంజీవి” అంటూ వీరులకు, కవులకు మరణం లేదంటూ తన అభిమానాన్ని చాటుకున్నాడు.

అడవి తల్లిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులు అమాయక జనులు, నిజాయితీపరులు నిజమైన అడవితల్లి వారసులు. అభివృద్ధి ఎంత ఉన్నా వారు ఇప్పటికి అడవిలోనే జీవిస్తున్నారంటే కారణమెవరు. ఐనా వారినక్కడ కూడా ఉండనివ్వకుండా ప్రాజెక్టుల పేరిట వారిని పజపంచలు పట్టిస్తున్నారు. ఈ పాపమెవరిది. నిజంగా గిరిజనుల ఉసురు తగలకమానదు అనే ఆవేదన ఈ పాటద్వారా వెలిబుచ్చాడు. “గిరిజనుల గోడు”లో ఇపుడిపుడే నాగరికతతో / కొత్తలోకం చూస్తావుంటే / పాయింటు చొక్కా పీకేసి / ఆ కొండకోనలు / గోచినే మళ్ళీ పెట్టాలా అని రచయిత నిలదీస్తాడు. చేతనయితే వారికింత చేయూత నిద్దాం. లేదంటే అలా వదిలేద్దాం కాని ప్రాజెక్టుల పేర ముంచకండ్రా బాబు అంటూ బావురుమంటాడు.

జల్, జంగల్, జమీన్ అంటూ సాగిన పోరాటాలు, జమీందార్ల, పెత్తందార్ల, రజాకార్ల పీచమణచగ పుట్టుకొచ్చిన తెలంగాణ సాయుధ పోరాటం. అందులో సమిధలైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ లాంటి ఎందరో అమరుల నెత్తురు పారిన నేల మన తెలంగాణ. ఎన్ని పోరాటాలు చవిచూసిందో నా తల్లి. ఎందరి విముక్తికై తన్లాడిందో నా నేల. అటువంటి నేలతల్లికి విముక్తి కావాలంటాడు ‘నేలతల్లి’ పాటలో – భూస్వాముల ధనవంతుల / చేతుల్లో మిగులు భూమిని / అర్హులైన పేదలందరికి / న్యాయం పంచివ్వాలని /కొమురయ్య ఐలమ్మ / స్ఫూర్తి బావుటే ఎగురేద్దాం. ప్రభుత్వాలు ఇప్పుడు దళితులకు భూపంపిణీ అనే నాటకాలాడుతున్నయ్. కానీ కన్నెగంటి ఏనాడో వారి పక్షాన పాటై నిలిచిండు. పోరుబాటై నడిచిండు.

నాణేనికి రెండు వైపులున్నట్లు రచయిత మరోకోణం పరికిస్తే గజల్ ప్రక్రియ దర్శనమిస్తుంది. అతికొద్ది మంది గజల్ రాసేవాళ్ళున్న ఈ తరుణంలో ఈ ప్రక్రియ పట్టుకోవడం కన్నెగంటి సృజనకు, ప్రతిభకు తార్కాణం.కన్నెగంటి గొంతునుండి జాలువారిన “మనిషికి విలువుంటుందా” అనే గజల్‌లో “మానవతా మధురిమలేని / మనిషి విలువ లేదుకదా/ కందిరీగ తుట్టెల నుండి / జుంటితేనె రాదుకదా” అంటూ మనిషి డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తాడు. మరొక గజల్ “చైతన్యపుబాట”లో డబ్బుంటే చాలు ఏదైనా చేయొచ్చనుకునే వారికి చురకలు వేస్తాడు. పిల్లల చదువుల్లో డొల్లతనాన్ని వెల్లడిస్తాడు. “ధనం విలువ పెరుగుతుంటే మనిషికెంత బరువో / జనం విలువ తరుగుతుంటె / ప్రగతికెంత కరవో – పదిమంది మంచికోరే / చైతన్యపు బాటలో / నడువకుంటె కన్నెగంటి / శ్వాసకెంత బరువో” అని తన ఉద్దేశాన్ని వివరిస్తాడు.

కన్నెగంటి నాకు చాలాకాలంగా మంచి మిత్రులు. ఆయన ఎప్పుడు మాట్లాడినా సామాజిక అంశాలు తన సంభాషణలో తొణికిసలాడుతాయి. రచయిత ఇంకా అనేక కోణాల్లో కవితా ప్రస్థానాన్ని, పాటలను రాయాలనీ, ఆశిస్తూ సెలవు.

## నివేదిక

# కథలు విందాం రండి!

### పలమనేరులో అంతర్‌రాష్ట్రీయ సాహితీ సదస్సు



కథారచయిత పలమనేరు బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన 'కథలు విందాం రండి' కార్యక్రమంలో కేరళ, కర్ణాటక, తమిళనాడులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి కథకులు, విమర్శకులు, అనువాదకులు, పత్రికా సంపాదకులు పాల్గొన్నారు. 200 మంది సాహితీవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ సదస్సు చిత్తూరు జిల్లా పలమనేరులోని మదర్ థెరిస్సా విద్యాసంస్థల సమావేశ మందిరంలో మార్చి 15, ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది.

మొదట ' తెలుగు కథ అనువాదం ' అనే అంశంపై తమిళ, కన్నడ అనువాద రచయితలు మాట్లాడారు. తరువాత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథల సంపుటి "ఈ కథకి శిల్పం లేదు" ఆవిష్కరణ జరిగింది. అనంతరం రచయితలు, పాఠకులు వారికి ఇష్టమైన, వారిని స్పందింపజేసిన కథల గురించి వివరించారు.

కేంద్ర సాహిత్య అకాడమి, కన్నడ సాహిత్య పరిషత్తుల నుండి ఆరు పురస్కారాలను పొందిన యువ సాహితీవేత్త ఆచార్య లక్కూరు ఆనంద్ కన్నడ సాహిత్యంలో కథా ప్రాభవాన్ని గురించి వివరించారు. మాస్తి వేంకటేశ అయ్యంగార్ నుండి జయంత్ కాయ్కిణి వరకు సాగిన కన్నడ కథా సాహిత్య వికాసం గురించి తెలియజేశారు.

తెలుగు కథానిక గురించి ప్రఖ్యాత కథా ప్రచారకర్త డా. వేదగిరి రాంబాబు కథకి, కథానికకి మధ్య గల తేడాను వివరించారు. కథ అనేది అన్ని సాహిత్య ప్రక్రియలలోను అంతర్లీనంగా వుంటుంది. కానీ, కథానిక అనేది సహజ సంఘటనతో కూడిన ఆధునిక కాల్పనిక ప్రక్రియ. కనుక దీనిని కథానిక అని వ్యవహరించడమే సమంజసమని స్పష్టంచేశారు. తెలుగు కథానికకు ఘనమైన గతం మాత్రమే కాకుండా ఉజ్వలమైన భవిష్యత్తు కూడా వుందని తెలిపారు.

తమిళ, మళయాళ కథా సాహిత్యాన్ని గురించి ప్రముఖ అనువాదుకులు, బహుభాషావేత్త ఏ.జి. యతిరాజులు ప్రసంగించారు. తెలుగు, తమిళ కథాప్రక్రియలు ఏక కాలంలో సమాంతరంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయని వాటి మధ్య భాషాపరమైన వ్యత్యాసమే తప్ప ఎదుగుదల విషయంలోగానీ, భావజాల విషయంలోగానీ ఎటువంటి తేడాలు లేవన్నారు. కానీ వైవిధ్యం విషయంలో దేనికదే తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ కొనసాగుతున్నాయని వివరించారు.

అనంతరం జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన రెండవ కథా సంపుటం "ఈ కథకు శిల్పం లేదు" పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త, రాయలసీమ సీనియర్ రచయిత సి.వేణు ఆవిష్కరించారు. తొలి ప్రతిని వైవిధ్య కథా రచయిత నాయుని కృష్ణమూర్తి గారు అందుకున్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, ఆర్.యం. ఉమామహేశ్వర రావు, పలమనేరు బాలాజి, డి.కుమార స్వామి రెడ్డి, తులసీనాథం నాయుడు, మదర్ థెరిసా ఇంజనీరింగ్ కాలేజి అకడమిక్ అడ్వైజర్ ఆర్. రాజేంద్ర రెడ్డి గారు పాల్గొన్నారు.

ఈ కథా సంపుటిని పరిచయం చేస్తూ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథలు ఒకే రచయిత రాసిన

## కవిత

# నానీలు

తగుళ్ళ గోపాల్
9505056316

తీరొక్క పువ్వు
కొలువు తీరింది
మనస్సు
తోటగా మారిపోయింది

కొడుతూ
ఏడిపించేది అక్క
పెళ్లి రోజున
ఆ అవసరం లేదు

ఇంట్లో
దొంగలు పడ్డారు
నా పేదరికాన్ని
దోచుకుపోతే బాగుండు

వాస్తవం కన్నా
కలలే నయం
రాత్రి కలలో
ఆత్మీయులు చూసి పోయారు



నాన్న గూర్చి
చెల్లితో ముచ్చట్లు
మా కబుర్లు వింటూ
నాన్న ఫోటో

బావి
పాడుబడింది
అయితేనేం
గిజిగానికి ఇల్లైంది

ఆమెకు
వ్యాయామమెందుకు?
ఇంట్లో
పనిమనిషి లేదు గదా!

అతడు సగం పేరుతో
పిలుస్తున్నాడు
బంధం
బలపడిందిగా

దొంగకి
భయం అంటే తెలియదు
ఎవరి భయం లేకనే
దొంగయ్యాడుగా

ఆకాశం
ఎర్ర చీర కట్టుకుంది
సూరన్న
సారె పోశాడట సాయంత్రం

---

కథాసంపుటంలా కాకుండా వేరువేరు రచయితలు రాసిన కథల సంకలనంలో ఉన్న కథలలాగా వైవిధ్యవంతంగా వుంటాయని, వివిధ ప్రాంతాల జీవన వైవిధ్యానికి ఈ కథలు దర్పణాలని పలమనేరు బాలాజి అన్నారు.

కవి, అనువాద రచయిత డి.కుమార స్వామి రెడ్డి మాట్లాడుతూ ఈ సంపుటంలోని కథలన్నీ రచయిత సునిశిత దృష్టిని సమాజంపట్ల బాధ్యతని ప్రతిభింబిస్తున్నాయ్నారు. రండి మళ్ళీ పుడదాం, వంతెన, రాగిమాను, ముచ్చు ఇత్యాది కథలు ప్రతిభతో పాటు రచయిత స్థూల దృష్టిని, సూక్ష్మ దృష్టిని వెలికి తెచ్చాయి. ఉపాధ్యాయుడి అసలైన నైజాన్ని, ప్రవృత్తిని 'రండి మళ్ళీ పుడదాం' అనే కథ మనముందుంచుతుందన్నారు. ఇద్దరు స్త్రీల మధ్య ప్రతి సంభాషణ స్పటిక సదృశ్యంగా వుంటే వారి జీవితం ఎంత సజావుగా సాగుతుందో చెప్పే కథ 'వంతెన' అని, పర్యావరణ ప్రేమికులు మెచ్చే కథ 'రాగిమాను' కులవృత్తులలో ఇమిడిపోయి బ్రతుకుపోరాటం సాగిస్తున్న వారి హృదయ సంచలనాన్ని హృద్యంగా ఆవిష్కరించిన కథ 'ముచ్చు' అని అన్నారు.

పాలపిట్ట సహసంపాదకులు, ప్రముఖ విమర్శకులు కె.పి. అశోక్ కుమార్ విమర్శనాత్మక దృష్టితో ఈ కథా సంపుటాన్ని సమీక్షించారు. ఇందులోని ఇతివృత్తాలు ఎంత వైవిధ్యంగా ఉన్నాయో ఆయా వస్తువులను కథగా రూపొందించడానికి ఎన్నుకొన్న భాష, శైలి, శిల్పాలు కూడా అంతే వైవిధ్యంగా ఉన్నాయని చెప్పారు. మనిషిలోని అంతరలోకాలను అత్యంత సహజంగా ప్రదర్శించడంలో శ్రీరామచంద్రమూర్తి ప్రతిభ విభిన్నమైనదని తెలిపారు. రచయితకు, పాఠకులకు మధ్య వంతెనలా ప్రతి కథకు ఒక అభిప్రాయ ప్రకటన నమూనాను ఇవ్వడం, ఆ రచన విలువను నిర్ధారించే అవకాశాన్ని పాఠకులకు కల్పించడం ఇంత వరకు ఏ రచయితా చేయని సరికొత్త ప్రయోగమన్నారు.

పుస్తకావిష్కరణ అనంతరం కథా రచయితలు తమ తమ కథా నేపథ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు కరణం బాలసుబ్రమణ్యం పిళ్ళై, సుంకోజి దేవాంద్రాచారి, పెరుగు రామకృష్ణ, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, ఆర్.ఎం. ఉమామహేశ్వర్ రావు, కన్నడ రచయిత వి.జి. నాగేశ్, గండికోట వారిజ, కెఎస్వీ, నూక రాంప్రసాద్ రెడ్డి, తవ్వా ఓబుల్ రెడ్డి, మల్లెల గురవయ్య, ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు తులసీనాథం నాయుడు, జక్కన్న, సాహిత్య నిధి సంపాదకులు సయ్యద్ మొహిద్దీన్, ఆలోచించండి పత్రిక సంపాదకులు నాగార్జున శర్మ, అల్లి రామకృష్ణ, గురురాజారావు, తొండవాని పురుషోత్తమాచార్య, శరత్‌చంద్ర, సి.ఎన్. చంద్రశేఖర్, ఆముదాల మురళి, షణ్ముగం, పేటశ్రీ, గంటామోహన్, పాయసం వెంకటేశ్వర్ రావు, అబిదాలీ, కలువకుంట రామ్మూర్తి మొదలైన కవులు, రచయితలు, స్థానిక సాహిత్యాభిమానులు ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

**- పలమనేరు బాలాజి**
**9440995010**

# స్వీకారం

## చెరుకూరి సత్యాన్వేషణ




వెల : లేదు పేజీలు: 304

ప్రతులకు :9440331016

చెరుకూరి సత్యానికి 60 ఏళ్ళు నిండిన సందర్భంగా ఒక జ్ఞాపికగా మిత్ర బృందం తరపున 'సత్యాన్వేషణ' పుస్తకాన్ని వెలువరిస్తున్నాము. ఇందులో చెరుకూరిని ప్రభావితం చేసిన కవితల్ని కూర్చాం. ప్రతి కవిత సత్యాన్వేషణకు ప్రతీక. చెరుకూరి జనశక్తి, ప్రజా సాహితి, ఆంధ్రజ్యోతి పత్రికలలో రాసిన కొన్ని వ్యాసాలను పొందుపరిచాం.

**- సాకం నాగరాజు**

## ప్రసిద్ధ తెలుగు కవులు




**కవిత్వం**

**డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ**


వెల : రూ.100/- పేజీలు: 100(ఎ4 సైజు)

ప్రతులకు : 9291530714

మీ తెలుగు వాచకాలలో ఎన్నో పాటలూ, పద్యాలూ, గద్యాలూ, నాటకాలూ ఉంటాయి గదా! అవి చాలా చాలా బాగుంటాయి. వాటిని రాసిన కవుల్నీ, రచయితల్ని గురించి వారి జీవితాల్ని గురించీ, వారు రాసిన పుస్తకాల్ని గురించీ కథలూ, గాథలుగా తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారా? అయితే ఇంకెందుకు ఆలస్యం? ఈ పుస్తకాన్ని తెరవండి.

**- రామడుగు వేంకటేశ్వర శర్మ**

## జీవితం




**కథల సంపుటి**

**చలపాక ప్రకాష్**


వెల : రూ.80/- పేజీలు: 112

ప్రతులకు : 9247475975

కథానిక ప్రధాన లక్షణం, క్లుప్తత, స్పష్టత. అవి పుష్కలంగా ఉన్నాయి. చలపాక ప్రకాష్ కథానికల్లో. అలాగే కథానికా ప్రారంభం ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా సరాసరి కథలోకి వెళ్ళడం కూడా ఈ కథానికల్లో కనిపిస్తుంది. ముగింపు సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేదే కాకుండా ఆలోచింపచేసేది కూడా కావడం గమనార్హం.

**- వేదగిరి రాంబాబు**

## అంతర్జ్వాల




**నవల**

**ఆదిరెడ్డి మావుళ్ళు**


వెల : రూ.80/- పేజీలు: 138

ప్రతులకు : 9885114658

ప్రస్తుతం మన వ్యవస్థలోని ఒక ముఖ్యమైన అంశాన్ని తీసుకొని దానిపై విస్తృతంగా చర్చోపచర్చలు జరిపి లోతైన ఆలోచనలు చేసి 'ఇలా చేస్తే బాగుంటుందేమో' నన్న జిజ్ఞాసతో రచించి ప్రజాబాహుళ్యం ముందు ఉంచడానికే ఈ నవలా రచన.

**-ఆదిరెడ్డి మావుళ్ళు**

## ఆకుపచ్చ శోకం (పర్యావరణ కవిత్వం)




**డా॥ కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్**


వెల : రూ.50/- పేజీలు: 71

ప్రతులకు : 9440211120

ఈ కవితా ధారావాహికలోని ప్రత్యేకత ఏమిటంటే వాడుక భాషను విస్తృతంగా వాడటం, ఆంగ్లపదం దొర్లినప్పుడు సందర్భానుసారంగా అదే కరెక్టు అనిపించినపుడు దానిని ప్రయోగించడంలో వెనుకాడక పోవడం. మొత్తానికి విషయం శ్రోతకు అందాలన్నదే నియమం.

**- చుండూరి మహేష్**

## అక్షర సేద్యం




**కవిత్వం**

**బైతి దుర్గయ్య**

వెలం : రూ.75/- పేజీలు: 71

ప్రతులకు : 9959007914

కవి ఎన్నటికైనా ప్రతి పక్షమే. కవి ఎన్నటికైనా ప్రజా పక్షమే. పాలకులెవరైనా కవి ఎప్పుడూ ఒక్క కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎప్పుడూ ఉంటుంది.

బైతి దుర్గయ్య కవిత్వం నిండా పల్లెలు, ఊర్ల ప్రతీకలు అందమైన అచ్చమైన బాల్యం ప్రపంచీకరణ విధ్వంసాలు మానవ పరిమళాలు మట్టి వాసనలు గుబాళిస్తున్నాయి.

**- అన్నవరం దేవేందర్**

# స్వీకారం

## రంది(తెలంగాణ కత 2013)



సంపాదకులు: **సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ**

వెల : రూ.60/- పేజీలు: 200

ప్రతులకు :9885420027

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భాన్ని పురస్కరించుకొని మనం నడిచొచ్చిన దారి తెలియాలంటే, చేరాల్సిన గమ్యం అవగాహనలోకి రావాలంటే మన కతను మనం జెప్పుకోవాలని నిర్ణయించి 'సింగిడి' ఈ రందిని తెస్తుంది. ఇందులో ఒకట్రెండు కథలు మేము నిర్దేశించుకున్న ప్రామాణికతను అందుకోలేకపోయినప్పటికీ వారిలో ఉన్న స్పార్క్‌ని గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో ఇందులో జోడించడమైంది.

**- సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ**

## తలుగు(కథ)



**వేంపల్లె షరీఫ్**


వెల : రూ.25/- పేజీలు: 28

ప్రతులకు : 9603429366

ముస్లిముల్లోని మహిళలు, కొందరు దళిత వర్గాల ప్రజలు సొంత సమాజంలోని అణచివేతను ఎదుర్కొంటూనే బయట మెజార్టీ సమాజంలోని ఆధిపత్యాన్ని కూడా ఎదుర్కొని షరీఫ్ కథలోలాగ తలుగులు తెంపుకోవాల్సిన అవసరం ఉంది. షరీఫ్ రాసిన ఈ 'తలుగు' కథ రాయలసీమలో ఇకముందు విస్తృతంగా రాబోయే దళిత ముస్లిం కథలకు నాందిగా నేను భావిస్తున్నాను.

**- షేక్ హుస్సేన్ సత్యాగ్ని**

## డా॥ అద్దేపల్లి సారస్వత సమీక్షా దర్శిని



**టి.జి.ఎస్.ఎన్. చక్రవర్తి(తంగిరాల చక్రవర్తి)**


వెల : రూ.50/- పేజీలు: 48

ప్రతులకు : 9393804472

డా॥ అద్దేపల్లి సారస్వత సమీక్షా దర్శిని' అని ఈ చిరుగ్రంథానికి పేరు పెట్టారు రచయిత. దీనికి రెండర్థాలు చెప్పుకోవచ్చు. అద్దేపల్లి సారస్వతాన్ని సమీక్షారూపంలో దర్శింపజేయడమనీ లేదా సారస్వతంతోపాటు వారి సమీక్షా విధానాన్ని కూడ దర్శింపజేసేదనీ, ఏ ఉద్దేశంతో ఈ పేరుంచినా, ఈ రెండు రకాలుగానూ తంగిరాల తన రచనను సాగించారు.

**- మాకినీడి సూర్యభాస్కర్**

## చూపు (నవల)



**బి.ఎస్. రాములు**


వెల : రూ.195/- పేజీలు: 320

ప్రతులకు : 08331966987

కాలంతో పాటు నిలిచిపోయే నవల రాసిన శ్రీ బి.ఎస్. రాములు గారిని అభినందిస్తున్నాను. ఇటీవలి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంకోసం సాగిన సామాజిక ఉద్యమ తొలిదశను అక్షరబద్ధం చేసిన ఈ నవలని పాఠ్యపుస్తకంగా పెడితే విద్యార్థులకు మనోవికాసం, మేధోవికాసం కలుగుతుందని ఆశిస్తున్నాను..

**- సలీం**

## బి.ఎస్. రాములు కథలు సామాజిక పరిణామాలు



**నందిగామ నిర్మల కుమారి**

వెల : రూ.120/- పేజీలు: 144

ప్రతులకు : 08331966987

నందిగామ నిర్మల కుమారి "బి.ఎస్. రాములు కథలు- సామాజిక పరిణామాలు'' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ పరిశోధన కోసం రాసిన సిద్ధాంత వ్యాసం ఇది. ఈ గ్రంథంలో బి.ఎస్. రాములు గారి జీవిత విశేషాలను గురించి, ఆయన రచనల గురించి సమగ్రంగా పరిశీలించి చూపబడింది.

**- డా॥ సి. నారాయణ రెడ్డి**

## సుజనులారా!



**పి.ఎన్. మూర్తి**

వెల : రూ.30/- పేజీలు: 36

ప్రతులకు : 9441151762

ఛందస్సు యతిప్రాసలతో ఈ తేటగీతి, ఆటవెలది వంటి కవితలు వ్రాయాలని మూర్తి సంకల్పం కాదు. ఇందులో భాష పద్యాల – భాషలాగా గ్రాంధికంగా కనిపిస్తుంది. కాని గ్రాంధికం కాదు. వ్యావహారికమే. ఈ కవితలు కొంత గానయోగ్యంగా ఉన్నాయి. కవి పూర్వాశ్రమంలో పాటలు వ్రాసి ఉండాలి.

**- కొలకలూరి ఇనాక్**

# స్వీకారం

## జనజీవన రాగంలో...(గేయరూప కవిత్వం)



**కన్నెగంటి వెంకటయ్య**

వెల : రూ.30/- పేజీలు: 37

ప్రతులకు :9885657582

కన్నెగంటి పాటలన్నీ సమకాలీన సమస్యల్ని ప్రతిబింబిస్తై. కొన్ని పాటలు జానపద శైలిని పుణికిపుచ్చుకున్నై. అంతేగాక కఠోరమైన జీవన వాస్తవికతను ప్రతిఫలిస్తుంది. చరణాల చివర వచ్చే భావం గొప్ప పరాకాష్టకు పోయి శ్రోతల్ని చప్పట్లు కొట్టించే లక్షణంగా కూడా ఉంది.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## కందనవోలు కథలు



(కర్నూలు జిల్లా జనజీవన చిత్రాలు)

**డా॥ ఎం. హరికిషన్**

వెల : రూ.100/- పేజీలు: 176

ప్రతులకు : 9885679758

రాయలసీమలోని కర్నూలు ప్రాంతపు ఆధిపత్యపు కులాల ఫ్యూడల్ అహంకారం, ఫ్యాక్షన్, కరువు పరిస్థితులు, వ్యవసాయం, పేదరికం ఇలాంటివన్నీ కూడా స్థానిక రచయిత రాయటం వల్ల ఈ కథల్లో ప్రాణం పోసుకున్నాయి. ఇందులో కనిపించే 'స్థానికత' ఒక విలక్షణత్వాన్ని ఈ కథలకు ఆపాదించింది.

**- సింగమనేని నారాయణ**

## మీ కోసం సమాచార హక్కు



**- కర్ర రాఘవేందర్ రెడ్డి**

వెల : రూ.300/- పేజీలు: 376

ప్రతులకు : 9848492877

కొత్తగా వచ్చిన ఈ సమాచార హక్కు చట్టం గురించైనా ఇప్పుడు తెలుసుకోండి. మీ పట్ల, సమాజం పట్ల జరిగే అన్యాయాలను అడ్డుకోవడానికి, నిరోధించడానికి ఇది మీకు కొంతయినా, గోరంతయినా ఉపయోగపడవచ్చు. ప్రజల నుంచి, ప్రజా ఉద్యమ రథసారథులు, మేధావుల నుంచి వచ్చే ఒత్తిడుల మేరకే ప్రభుత్వాలు ఇలాంటి చట్టాలు చేస్తాయి. ప్రజల కోసమే ప్రభుత్వాలు చట్టాలు చేసినా వాటిని అమలు చేయవు.

**- రచయిత**

## పోరాడి గెలిచిన తెలంగాణ(కవిత్వం)



**వేముల ప్రభాకర్**

వెల : రూ.100/- పేజీలు: 94

ప్రతులకు : 9247040332

ఈ పుస్తకం యువతరానికి తెలంగాణ చరిత్రను ఆశలను, ఆరాటాన్ని, చేసిన పోరాటాలను, త్యాగాలను, గెలిచి నిలిచిన తీరులను చక్కగా అందిస్తుంది. ఇటు గేయంలా, అటు వచన కవిత్వంలా, మరొకవైపు చరిత్రగా, ముప్పేటగా కొనసాగిన ఈ రచనల్లో కవితాత్మ తెలంగాణ.

**- బి.ఎస్. రాములు**

## మలుపులు



**అంబల్ల జనార్దన్ కథలు**


వెల : రూ.200/- పేజీలు: 206

ప్రతులకు : 09987533225

ఈ సంపుటిలోని కథలన్నింటిలోనూ ఒక సమకాలీన సమస్యకు కథానికా రూపం ఇవ్వడం కనిపిస్తుంది. కథల్ని సులభశైలిలో, సూటిగా, సాదాసీదాగా చెప్పే నేర్పు అంబల్ల జనార్దన్‌కుంది. కథానికకుండాల్సిన మంచి లక్షణాలైన క్లుప్తత, నిర్మాణ సౌష్టవం, అనుభూతి ఐక్యత, సంఘర్షణ మొదలైనవన్నీ అంబల్ల జపనార్దన్ కథల్లో మనకు కనిపిస్తాయి. ఈ కారణాల వల్ల ఈ రచయిత రాసిన కథలకు చక్కని పఠనీయతా గుణం అబ్బింది.

**- అంశయ్య నవీన్**

## తోటమాలి



**డా॥ వ్యాకరణం అచ్యుతరామారావు**

వెల : రూ.100/- పేజీలు: 108(౨౪)

ప్రతులకు : 9848147303

ఇందులోని కవితలను కవిత్వం గురించిన కవితలు, సమాజం గురించిన కవితలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. వీటిలో ఆయన తన మనసుకు సన్నిహితమైన అంశాల గురించి తన అనుభూతులను మనతో పంచుకున్నారు. రాష్ట్ర విభజన పట్ల తనకు కలిగిన ఆవేదనను వ్యక్తం చేసిన 'విడిపోయిన రోజు' కవిత బహుశ ఆయన ఇప్పటివరకు రాసిన వాటిల్లో చివరి కవిత.

**- మృణాళిని**

## జనరంజక కవిత్వం అవసరం



నేటి సమాజంలో కవిత్వాన్ని జనరంజకంగా మార్చేందుకు కవులు, రచయితలు మరింత కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు, సాహిత్య ప్రస్థానం మాసపత్రిక సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. ఏప్రిల్‌లో విశాఖపట్నంలో జరిగే సిపిఎం అఖిల భారత 21వ మహాసభల సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మార్చి 22న విజయవాడలోని హోటల్ స్వర్ణప్యాలెస్‌లో నిర్వహించిన 'జనకవనం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాక్ యుద్ధం తరువాత ప్రజా కవిత్వం బలోపేతమైందన్నారు. నేడు దేశంలో హక్కుల్ని ఊడ్చేసే స్వచ్ఛభారత్ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఆయా పార్టీల కార్యాలయాల్లో జరిగిన మన్మథనామ ఉగాది పంచాంగ శ్రవణం చూస్తే ఆ పార్టీలకు అనుకూలంగా సిద్ధాంతులు వ్యవహంచారని స్పష్టమవుతోందన్నారు. పాలకులు చంద్రులైనా, ఇంద్రులైనా ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేయటంలో ఒకే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి సందర్భాల్లో కవుల బాధ్యత ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. 'సింగపూర్ అనేది సిటీ స్టేట్ అని, అది మన ఆంధ్రప్రదేశ్‌కు ఎలా వర్తిస్తుందని, ఢిల్లీ దిక్కుచి న్యూయార్కని' పేర్కొంటూ కవితను చదివి వినించారు. ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ 'పొయెట్స్ ఎగనెస్ట్ ఫండమెంటల్స్' అనే సంస్థను ప్రారంభించాలని సూచించారు. పాత్రికేయులు వడ్లమూడి పద్మ మాట్లాడుతూ కవి నిబద్ధతతో అవిశ్రాంతంగా పనిచేయాలన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రగతిశీల, అభ్యుదయ భావాలు కలిగిన కవులు వాటిని బయటకు తీసుకెళ్లాలనే ఆలోచన చేయాలన్నారు. దాని కోసం మళ్లీ ఉద్యమానికి నాంది కావాలని చెప్పారు. ఈ సందర్భంగా 22 మంది కవులు పాల్గొని పలు అంశాలపై కవితలు చదివారు. నూతన రాజధాని, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, మాతృభాష, యువత పెడదోవపట్టం వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది వేడుకలను నిర్వహించిన అనంతవరం గ్రామ చిత్రాన్ని అద్దంపట్టేలా దీర్ఘ కవిత వినిపించారు. ప్రముఖ కవయిత్రి మందరపు హైమవతి మాట్లాడుతూ నేటి యువత చెడుపోకడలను వివరించారు. అరసం నగర కార్యదర్శి కొండపల్లి మాధవరావు పడిపోతున్న విలువలకు సంబంధించిన పద్యం ఆలపించారు. సభకు సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షులు కె.సత్యరంజన్ వందన సమర్పణ చేశారు.



**మార్చి1వ తేదీన ఒంగోలు మల్లయలింగం భవన్‌లో జరిగిన వైహెచ్‌కె మోహన్‌రావు చారిత్రక రచన 'శాంతిమాత నాయకురాలు' పుస్తక ఆవిష్కరణ సభలో పాల్గొన్న రచయిత, నల్లూరి వెంకటేశ్వర్లు, బి.హనుమారెడ్డి, పోన్నూరు వేంకట శ్రీనివాసులు, డా॥ బీరం సుందరరావు, కె.వి. రమణారెడ్డి, శిద్దా వేంకట శ్రీనివాసరావు, అస్ని విజయకుమారి, ఐ. మురళీకృష్ణ**



**మార్చి 1, 2015న జరిగిన ఎమ్.కె.ఎస్. భవన్‌లో రమణ వెలమకన్ని కవితా సంపుటి నా చిరునామా ఆవిష్కరణ సభలో జగదీష్, హర్షవర్ధన్ మాడభూషి ఎస్.బి.హెచ్.ఉద్యోగ నాయకులు శాంతను ముఖర్జీ ఆవిష్కర్త, (మేనేజింగ్ డైరెక్టర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్), కవి రమణ వెలమకన్ని, ఆర్. వినాయకరావు**



**మార్చి2న జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్, హైదరాబాద్‌లో 'వజ్ర పుష్పాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో టి.పాపిరెడ్డి, రచయిత ఆచార్య కట్టా నరసింహారెడ్డి, ఆవిష్కర్త డా॥సి. నారాయణ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఆచార్య కదారు వీరారెడ్డి, బైస దేవదాసు, దాస్యం సేనాధిపతి**

## కాకినాడ - సాహిత్యహేల



మార్చి 1న కాకినాడ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కట్టా కృష్ణారావు నాటక సాహిత్యంపై ప్రసంగించారు. ఆధునిక నాటకాన్ని గురించి మాట్లాడుతూ, గురజాడ అప్పారావు, 'కన్యాశుల్కం', ప్రపంచ నాటక చరిత్రలోనే ఒక విశిష్టత గల నాటకమని ఉద్ఘాటించారు. బళ్ళారి రాఘవను తన యింటికి పిలిచి, తన ముందు కొన్ని సంభాషణలు నటింపజేసి, బెర్నార్డ్‌షా, 'ఇంత అద్భుతనటన నేను ఇంతవరకు చూడలేదు' అని ప్రశంసించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 27న వరంగల్‌లో డా॥ అద్దేపల్లి 'శాంతిదూత' పురస్కారం జరిగినందుకు 'అభినందన' కార్యక్రమం నిర్వహించారు. వరంగల్లులో ఇచ్చిన 'ప్రశంసాపత్రంలోని పంక్తుల్ని సభలో ప్రముఖ కవి గడల శివప్రసాద్ చదివారు. 'కవిస్వరం' అనే శీర్షికతో జి. సుబ్బారావు, అరగంటపేసు తన కవితల్ని చదివారు. అందరూ ఆ కవితల్లో లీనమై అనుభూతి చెంది తమ ఆనందన్ని వ్యక్తపరిచారు. తర్వాత 'నేను' అనే అంశంపై కవితాగోష్ఠి జరిగింది. రామకృష్ణ శ్రీవత్స మణిబాబు, అద్దేపల్లి, జ్యోతి, మద్దాలి సత్యనారాయణ, శిరీష, గరికపాటి మాస్టారు, గడల శివప్రసాద్, యం.బి.జనార్దన్ మొదలైనవారు కవితలను వినిపించారు. మేడిశెట్టి శ్రీరాములు 'సాహితీ స్రవంతి'పై పాడిన గరికపాటి మాస్టారి పాట అందరి ప్రశంసలూ పొందింది. గడలవక్తల్ని ఆహ్వానించగా, రామకృష్ణ శ్రీవత్స వందన సమర్పణతో సభ ముగిసింది.

## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 20వ ఉగాది ఉత్తమ రచనల పోటీ విజేతలు

మన్మథ నామ సంవత్సర ఉగాది (మార్చ్ 21, 2015) సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 20వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో ఈ క్రింది రచనలు ఉత్తమ రచనలుగా ఎంపిక కాబడ్డాయని వంగూరి చిట్టెన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలోని అన్ని ప్రక్రియలలోనూ అత్యధిక సంఖ్యలో చాలా మంది ఔత్సాహిక రచయితలు, ప్రముఖ రచయితలూ పాల్గొన్నారని తెలిపారు.

**ఉత్తమ కథానిక విభాగం విజేతలు :** కథ వ్రాయాలి – భవానీ ఫణి, బెంగుళూరు (నగదు పారితోషికం ప్రశంసా పత్రం), తిరుగులేని ప్రయాణం – వేమూరి వెంకటేశ్వరరావు (నగదు పారితోషికం, ప్రశంసాపత్రం), మగబిడ్డ మాత్రమే – ఆర్. శర్మ దంతుర్తి – (ప్రశంసా పత్రం), అమ్మతనం అంటే – గంటి భానుమతి, హైదరాబాద్ (ప్రశంసా పత్రం).

**ఉత్తమ కవిత విభాగం విజేతలు :** పులస చేసి స్వగతం – శిఖామణి, హైదరాబాద్ (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), అయినా రాస్తూనే ఉంటాను – ఫణీంద్ర రావు కొనకళ్ళ, రాజమంత్రి (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), ఊహించడానికేం ఖర్చు కాదులే – గరిమెళ్ళ నారాయణ, (ప్రశంసా పత్రం), నీటి ముల్లె – శ్రీలక్ష్మి ఐనంపూడి, హైదరాబాద్ (ప్రశంసా పత్రం).

**నా మొట్ట మొదటి కథ విభాగం విజేతలు :** "ప్రేమ చిత్రం" –లావణ్య కొల్లూరు (చికాగో) (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), వరదగూడు– బదుగు రవికుమార్ (హైదరాబాద్) (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), "ఎక్క వలసిన రైలు" – బాలమురళీ కృష్ణ గోపరాజు (హుస్టన్) (ప్రశంసా పత్రం)

**"నా మొట్టమొదటి కవిత" విభాగం విజేతలు :** కాస్త జాగ్రత్త తల్లీ – ఇందుర్తి వెంకట ప్రభాకర రావు (హైదరాబాద్) (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), యువతూ నీవే మా ఘనత – నడిమింటి శ్రీరామ్ (నగదు పారితోషికం. ప్రశంసా పత్రం) ప్రకృతి కూడా దుఃఖిస్తుంది – కొండూరి రామరాజు యానాం (ప్రశంసా పత్రం)

**యువతరం – ఉత్తమ కవిత విభాగం విజేతలు :** లోగిలి – మల్లిపూడి రవిచంద్ర, హైదరాబాద్ (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), తాతయ్యగారికి – ప్రసూన రవీంద్రన్, శేరిలింగంపల్లి (నగదు పారితోషికం, ప్రశంసాపత్రం), నిర్భయ 'మా' ఈ లోక రీతి – ఎ. మారుతి, హైదరాబాద్ (ప్రశంసా పత్రం), ఆమె అతడు – మల్లెగోడ గంగా ప్రసాద్, నిజామాబాద్ (ప్రశంసా పత్రం).

**యువతరం – ఉత్తమ కథానిక విభాగం విజేతలు :** హైటెక్ అత్తగారు – ప్రజ్ఞ వడ్లమాని, (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), పునరావృతం – ప్రసూన రవీంద్రన్, శేరిలింగంపల్లి (నగదు పారితోషికం, ప్రశంసా పత్రం), చీకటైన వెలుగు – జోషి బాబు, హైదరాబాద్ (ప్రశంసా పత్రం)

## బాల సుధాకర మౌళికి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు



'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు – 2014' కోసం బాల సుధాకర మౌళి కవితాసంపుటి 'ఎగరాల్సిన సమయం' ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు డా॥ రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా – కె. శివారెడ్డి, డా॥ రెంటాల వేంకటేశ్వరరావు, డా॥ కోయి కోటేశ్వరరావు వ్యవహరించారని తెలిపారు. ఇప్పటి వరకూ ఈ అవార్డు పొందిన కవుల్లో 'బాల సుధాకర మౌళి' 27వ వారు. ఈ అవార్డు పొందిన కవిత్వం తన మొదటి పుస్తకం కావడం విశేషం. ఉత్తరాంధ్ర జన జీవితాన్ని తన కవిత్వంలో చక్కగా చిత్రించారని న్యాయ నిర్ణేతలు పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రదాన సభ జూలై నెలలో అనంతపురంలో జరుగుతుందని డా॥ రాధేయ తెలియజేశారు.

## కష్టజీవులకు ఆలంబనగా నిలిచేదే కవిత్వం



ఉగాది సందర్భంగా అనంతపురం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో 'చిక్కనవుతున్న పాట' కవితా సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది. సాహితీ విమర్శకులు సూర్యసాగర్ కవితా సంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనాటి కవిత్వం సమాజాన్ని ప్రతిబింబిస్తుందని, కష్టజీవులకు ఆలంబనగా నిలిచేదే కవిత్వమని అన్నారు. ఈనాటి కవి దళితులు, మహిళలు, రైతులు గురించి రాస్తున్నాడని, రైతుల ఆత్మహత్యలను నివారించాలని, కవులు కోరుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన జనకవనానికి పిల్లి కుమారస్వామి అధ్యక్షత వహించారు. జూటూరు రమేష్, మిద్దె మురళీకృష్ణ, మధురశ్రీ, కంటదూరి షేక్‌నబీ రసూల్, ఉద్దండం చంద్రశేఖర్, షేక్ రియాజుద్దీన్, బాలబారతమ్మ, ప్రగతి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు తమ కవితల్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి జిల్లా కార్యదర్శి తగరం క్రిష్ణయ్య, నగర కార్యదర్శి ప్రజ్ఞా సురేష్, నాగేశ్వరాచారి, అమళ్ళదిన్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ మార్పును కోరే రచనలు రావాలి



తెలంగాణ సాహితీ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని మార్చి 17న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయాబు ల్లాఖాన్ హాల్‌లో కవి సమ్మేళనం జరిగింది. 44 మంది కవులు స్వీయ కవితాగానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితీవిమర్శకులు ఎస్. రఘు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు, కార్పొరేట్ స్కూల్స్, హాస్పిటల్స్ పెట్టి సామాన్య మధ్య తరగతి ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. మానవ సంబంధాలు పరిరక్షించే రచనలు ఆదర్శ సమాజాన్ని నిర్మిస్తాయని, కవిత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించి ప్రోత్సహించాలని, బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణానికి కవులు కలాలు కదలించాలని అన్నారు. మరో ముఖ్య అతిథి ఆంధ్ర సారస్వత ప్రాచ్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మోతుకూరి నరహరి కవులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సభకు తెలంగాణ సాహితీ హైదరాబాద్ కమిటీ కన్వీనర్ తంగిరాల చక్రవర్తి అధ్యక్షత వహించగా వెంకట్ కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు ముందు తెలుగు భాషపై చక్కటి గీతాలు జి.నరేష్ పాడి వినిపించారు. గేరా, ఒబ్బిని సన్యాసిరావు, పి. హరనాథ్ ప్రసాద్‌రావు, యం. రఘుపతి, కోరుప్రోలు రాధాకృష్ణారావు, కొండపల్లి నీహారిణి, పొత్తూరి సుబ్బారావు, మౌనశ్రీ మల్లిక్, మాధవి, రమణ వెలమకన్ని, సాధనాల వెంకట స్వామినాయుడు, బిక్కికృష్ణ, సుతారపు వెంకట్, పాడేటి జాన్సన్, కొంపెల్ల కామేశ్వర్‌రావు, జి. నరసింహమూర్తి, ఆలువాల సురేష్, రాజయ్య, కె. సత్యమూర్తి, బొబ్బిని మల్లారెడ్డి, కె. లక్ష్మణస్వామి, ఇ.కె. విశ్వనాథ శర్మ పెద్దూరి వెంకటదాసు, కె. లలిత, రత్నామహీధర్, సాగర్, మోహన్ కృష్ణ, డాక్టర్ పూసల రజనీ గంగాధర్, బి.ఎస్.రామారావు, తదితర కవులు "ఉగాది' ' అంశంపై కవితలు శ్రావ్యంగా ఆలపించి శ్రోతల్ని అలరించారు. తెలంగాణ సాహితీ సిటీ కో కన్వీనర్ జి.యాదగిరి రావు, సభ్యులు మహేష్ దుర్గేలు స్వాగతం, వందన సమర్పణ చేశారు.

## హాస్యకథల పోటీ

సాహితీకిరణం, కార్తికాదెవలపర్స్ ఆధ్వర్యంలో హాస్య కథల పోటీ నిర్వహిస్తున్నట్లు సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావుఒక ప్రకటనలో తెలిపారు కథలకు..ప్రథమ బహుమతి రూ॥1500/-, ద్వితీయ బహుమతి రూ॥ 1000/-, 3 ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కటి రూ॥ 500/- ఇస్తామని తెలిపారు. డా॥ పట్టాభి కళాపీఠము సౌజన్యంతో కవితల పోటీ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవితలకు.. ప్రథమ బహుమతి రూ॥2000/-, ద్వితీయ బహుమతి రూ॥ 1500/-, తృతీయ బహుమతి రూ॥ 1000/-, ప్రోత్సాహక బహుమతి రూ॥ 500/-అందజేస్తామని తెలిపారు. జూన్8న హైదరాబాద్, త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. కథలు, కవితలను ఏప్రిల్ 30వ తేదీలోగా సంపాదకులు, సాహితీ కిరణం, ఇం.నెం. 11-13-154, అలకాపురి రోడ్ నెం.3, హైదరాబాద్ - 500035 చిరునామాకు పంపలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 040-20060181 ద్వారా సంప్రదించవచ్చును.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# కందుకూరి వీరేశలింగం

16.04.1848 – 27.05.1919



నవ్యాంధ్ర వైతాళికుల్లో ప్రథములు. సంస్కర్త. వితంతు పునర్వివాహాలను ఉద్యమంగా చేపట్టారు. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారు. సాంఘిక దురాచారాలను ప్రతిఘటించారు. సాహితీ రంగంలో గొప్ప కృషి జరిపారు. పలు పత్రికలు కూడా నడిపి, కొత్త రచయితలను ప్రోత్సహించారు. రచనల ద్వారా ఆచారాలకు కొత్తబాటలు వేసి, కార్యశూరుడని నిరూపించుకున్నారు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Positng : 30.03.2015 ▪ Date of Publication: 27.03.2015




If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059